
తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

సచిత్రమాసపత్రిక

మార్చి 2021

వెల రూ.5/-



శ్రీనివాసమంగాపురం

## శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు

2021 మార్చి 02 నుండి 10 వరకు

## తిరుమల తిరుపతి దేవస్థానములు

# రథసప్తమి (19-02-2021) పర్వదిన సందర్భంగా తిరుమల శ్రీవారికి జరిగిన సప్తవాహన సేవలు

















## గీతాశ్లోకార్థసారం

**శ్లో :** అథ వ్యవస్థితాన్ దృష్ట్వా ధార్తరాష్ట్రాన్ కపిధ్వజః ।
ప్రవృత్తే శస్త్రసమ్పాతే ధనురుద్యమ్య పాణ్డవః ॥
హృషీకేశం తదా వాక్య మిద మాహ మహీపతే ।

(శ్రీమద్భగవద్గీత 01వ అధ్యాయం-20, 21వ శ్లోకంలో అర్ధశ్లోకం)

**ప్రతిపదార్థం:** మహీపతే= ఓ ధృతరాష్ట్రమహారాజా!; అథ= అంతట; శస్త్ర సమ్పాతే= ఆయుధ ప్రయోగం; ప్రవృత్తే(సతి)= ప్రారంభమగుచుండగా, కపిధ్వజః= హనుమంతుడు టెక్కెమందు గల; పాణ్డవః= అర్జునుడు, వ్యవస్థితాన్= యుద్ధసన్నద్ధులైయున్న; ధార్తరాష్ట్రాన్= కౌరవులను; దృష్ట్వా= చూచి; ధనుః= వింటిని; ఉద్యమ్య= చేబట్టి, తదా= ఆ సమయమున; హృషీకేశం=శ్రీకృష్ణునిగూర్చి; ఇదమ్= ఈ; వాక్యః= మాటను, ఆహ= పలికెను.

**భావం:** ఓ ధృతరాష్ట్రమహారాజా! అటుపిమ్మట రణరంగమున ఆయుధములు ప్రయోగింపబడబోవుచుండగా, కపిధ్వజుడగు అర్జునుడు యుద్ధసన్నద్ధులైయున్న కౌరవులను జూచి, ధనుస్సును చేబూని, శ్రీకృష్ణునితో నిట్లు పలికెను.

---

## హరిఁ గంటి గురుఁ గంటి

ఇప్పుడిటు కలగంటి - నెల్లలోకములకు
నప్పఁడగు తిరువేంక - టాద్రీశుఁ గంటి

అతిశయంబైన శే - షాద్రిశిఖరము గంటి
ప్రతిలేని గోపుర - ప్రభలు గంటి
శతకోటి సూర్యతే - జములు వెలుఁగఁగఁ గంటి
చతురాస్యుఁ బొడగంటి - చయ్యన మేల్కంటి

కనకరత్నకవాట - కాంతు లిరుగడఁ గంటి
ఘనమైన దీప సం - ఘములు గంటి
అనుపమమణీమయ - మ్మగు కిరీటము గంటి
కనకాంబరము గంటి - గ్రక్కన మేల్కంటి

అరుదైన శంఖ చ - క్రాదు లిరుగడఁ గంటి
సరిలేని యభయహ - స్తము గంటి,
తిరువేంకటాచలా - ధిపుని జూడఁగఁ గంటి
హరిఁ గంటి గురుఁ గంటి - నంతట మేల్కంటి

(సంపుటం-1, సంకీర్తన - 38)





*అన్నిలోకాలకు తండ్రియైన వేంకటేశుని అద్భుత మహిమలతో నెలకొన్న శేషాచలశిఖరాన్ని చూచాను. సాటిలేని గోపురకాంతులను, నూరుకోట్ల సూర్యుల వెలుగును, నాల్గుముఖాలు గల బ్రహ్మను చూచాను. వెంటనే మేల్కొన్నాను. రత్నాలు పొదిగిన బంగారు తలుపుల కాంతులను, వెలుగుతున్న పెద్ద పెద్ద దీపాలను, మణులతో కూర్చిన సాటిలేని కిరీటాన్ని, బంగారురంగు వస్త్రంతో మెరిసే దేవుణ్ణి చూచాను. వెంటనే మేల్కొన్నాను. ఇరువైపులా అపూర్వమైనట్టి శంఖచక్రాదులను, సాటిలేని అభయహస్తాన్ని చూపుతున్న ఆ వేంకటాచలాధీశ్వరుణ్ణి చూచాను. వెంటనే మేల్కొన్నాను - అని అన్నమయ్య తనకు కలలో ప్రత్యక్షమైన శ్రీవేంకటేశ్వరుని స్వరూపాన్ని ఈ సంకీర్తనలో వర్ణించాడు.*

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి



# శ్రీవేంకటేశ్వర సర్వశ్రేయస్సు ట్రస్టు

"మానవసేవయే మాధవసేవ"- అన్న లక్ష్యంతో తి.తి.దేవస్థానములు వివిధ సామాజిక సంక్షేమకార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా అనాథ బాలబాలికలకు చేయూతనివ్వాలనే సంకల్పంతో 1943వ సం॥లో శ్రీవేంకటేశ్వర బాలమందిర్(తిరుపతి) ట్రస్టును స్థాపించింది. ఈ శ్రీవేంకటేశ్వర బాలమందిరంట్రస్టు ప్రస్తుతం శ్రీవేంకటేశ్వర జలనిధిపథకం, కల్యాణమస్తుట్రస్టు, శ్రీవేంకటేశ్వర సమాచార సాంకేతికట్రస్టులను కలుపుకుని 'శ్రీవేంకటేశ్వర సర్వశ్రేయస్సు ట్రస్టు'గా రూపొందింది.

## శ్రీవేంకటేశ్వర సర్వశ్రేయస్సు ట్రస్టు లక్ష్యాలు

01) అనాథలైన బాలబాలికలు, వృద్ధులు, నిరాశ్రయులు, అభాగ్యులు, నిరుపేద బలహీనవర్గాలవారి అభివృద్ధి, సంరక్షణ, సంక్షేమాలకోసం ధర్మశాలలు, వసతిగృహాల ఏర్పాటు.

అనాథలకు, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థినీవిద్యార్థులకు ఆర్థికంగా చేయూతనివ్వడం;

02) దివ్యాంగులకు, మానసికరోగులకు తగు వైద్యసదుపాయాలు కల్పించి, వారి జీవితప్రమాణాలను మెరుగుపరచడం. ఈ లక్ష్యంలో కుల, మత, జాతి, వర్గ, వర్ణ భేదాలను పాటించక అందరినీ సమానంగా స్వీకరించడం.

03) వరదలు, కరవువంటి ప్రకృతివిపత్తులసమయాల్లో అగ్నిప్రమాదాలవంటి అవాంఛనీయసంఘటనలు జరిగినపుడు సత్వరసహాయచర్యలు గావించడం.

04) వినికిడిలోపం, మాటలురాని శిశువులకు, ఈ లోపాలతో ఎదిగిన పిల్లలకు పునరావాసకేంద్రాల్ని ఏర్పాటుచేయడం.

05) గ్రామాలలో పై లోపాలతో ఉన్న బాలబాలికలకు అవసరమైన పరికరాలను అందజేయడంతోపాటు వారిని విద్యావంతుల్ని చేయడం.

06) సమాజంలో కనీస అవసరమైన త్రాగునీటిని నిత్యం అందుబాటులో ఉంచడం. తిరుమల పంచాయతి, తిరుపతి కార్పొరేషన్‌కు అవసరమైన నీటివనరులఏర్పాటుకై ఆనకట్టలు,



తొట్లెలను ఏర్పాటుచేయడం. నీటిపొదుపుకు అవసరమైన చర్యలు తీసుకోవడం.

07) శ్రేయస్కరమైన వివాహకార్యక్రమాలద్వారా వధూవరులు గౌరవాభిమానాలతో, ఉన్నతకుటుంబజీవితంతో గడిపేలా చేయడం.

08) పుస్తకాలతోపాటు, ఇంటర్‌నెట్‌వంటి ఆధునికసాంకేతిక సదుపాయాలతో మనదేశ చారిత్రక, సాంస్కృతికవారసత్వ సంపదను భవిష్యత్తరాలకు అందజేయడం.

09) సామాజిక క్రమశిక్షణ, నైతికవిలువల్ని పెంపొందిస్తూ యువ తరంలో ఆత్మవిశ్వాసం కలిగించటం.

10) పైన పేర్కొన్న ఆశయాలసాధనకు కృషిచేస్తున్న వ్యక్తులకు, సంస్థలకు సహకారమందించడం.

## శ్రీవేంకటేశ్వర సర్వశ్రేయస్సు ట్రస్టుకు విరాళాలు ఇలా....

01) ఈ పథకంకోసం కనీస విరాళం రూ.1000/- గా నిర్ణయించబడింది.

02) రూ.1000/- కంటే తక్కువవిరాళం శ్రీవారి హుండీఖాతాలో జమ చేయబడుతుంది. ఈ విరాళాలన్నీ కూడా ఒకే జాతీయబ్యాంకులో డిపాజిట్ చేయబడతాయి, వాటిమీదవచ్చే వడ్డీ ఈ పథకంకోసం వినియోగింపబడుతుంది. దాతలు తమ విరాళాలను 'ది ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, శ్రీవేంకటేశ్వర సర్వశ్రేయస్సు ట్రస్టు, తి.తి.దే.,తిరుపతి' వారి పేరిట ఏదైన షెడ్యూల్‌బ్యాంకుమీద తీసిన చెక్కు/ డిమాండ్‌డ్రాఫ్ట్‌ద్వారా 'చీఫ్ అకౌంట్స్ ఆఫీసరు, తి.తి.దే., తిరుపతి-517501' వారికి పంపవచ్చు.

ఇతర వివరాలకు 0877-2264258ను సంప్రదించగలరు.

50 వసంతాల
1970-2020
తిరుమల తిరుపతి దేవస్థానముల సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 51 మార్చి, 2021 సంచిక : 10



వేంకటాద్రి సమం స్థానం
బ్రహ్మాండే నాస్తి కించన ।
వేంకటేశ సమో దేవో
న భూతో న భవిష్యతి ॥

**గౌరవ సంపాదకులు**
డా॥ కే.ఎస్.జవహర్ రెడ్డి, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు.

**ప్రచురణకర్త-ప్రధాన సంపాదకులు**
ఆచార్య కె.రాజగోపాలన్, పిహెచ్.డి.,

**సంపాదకులు**
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

**ఉపసంపాదకులు**
డా॥ కంపల్లె రవిచంద్రన్,
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,

**ముద్రాపకులు**
శ్రీ పి.రామరాజు, ఎం.ఏ.,
ప్రత్యేకాధికారి (ప్రచురణలు & ముద్రణాలయం),
తి.తి.దే., తిరుపతి.

**ఫోటోలు**
శ్రీ పి.ఎన్.శేఖర్, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, సహాయఫోటోగ్రాఫర్, తి.తి.దే.,

సప్తగిరి మాస పత్రిక
ఇతర వివరాలకు
ఫోన్ నెంబర్లు
0877-2264543
0877-2264359
0877-2264360

విడి ప్రతి : రూ. 5/-
సం॥ చందా : రూ. 60/-
జీవిత చందా : రూ. 500/-
విదేశాలకు సం॥చందా : రూ. 850/-

## ఈ నెలలో....


| | | |
|---|---|---|
| శివరాత్రి-శుభధాత్రి | ఆచార్య గల్లాచలపతి | 07 |
| శ్రీమద్భగవద్గీత | విద్వాన్, డా॥ ఈ.జి. హేమంత కుమార్ | 12 |
| శ్రీమహాలక్ష్మి ఆవిర్భావం | డా॥ డి.ఉదయకుమారి | 14 |
| శ్రీవిష్ణుప్రీతికరమాసం... | శ్రీ కె.జానకిరామావధాని | 16 |
| అభిషేకప్రియుడు | డా॥ నిష్ఠల సుబ్రహ్మణ్యశాస్త్రి | 18 |
| పట్టుదల ఉంటే.. కానిది లేదు! | ఆచార్య కోలవెన్ను మలయవాసిని | 20 |
| శ్రీకాళహస్తి వైభవం | శ్రీ ఆముదాల మురళి | 22 |
| అన్నీ ఆమె.. అంతటా ఆమె | డా॥ కప్పగంతు రామకృష్ణ | 24 |
| పలుకే బంగారం | శ్రీ ఆర్.సి.కృష్ణ స్వామి రాజు | 26 |
| సురాసురార్చిత చరణా.. మల్లికార్జునా! | శ్రీమతి కె.విజయలక్ష్మి | 31 |
| షట్కాల శివలింగార్చన | 'సారస్వతకళానిధి' డా॥వెలువోలు నాగరాజ్యలక్ష్మి | 34 |
| పార్వతీకల్యాణం | డా॥ జంధ్యాల పరదేశిబాబు | 35 |
| అడుగడుగునా కాపాడే దైవం | శ్రీమతి యడవల్లి మృదుల లక్ష్మి | 39 |
| ఆకలి తీర్చగలగడమే తపస్సు | డా॥ యం.ఎన్.చార్య | 40 |
| పంగున్యుత్తరం | ఆచార్య చక్రవర్తి రంగనాథన్ | 43 |
| హరిదాస వాఙ్మయంలో శ్రీవేంకటాచలాధీశుడు | శ్రీ సుస్వరం నాగరాజాచార్యులు | 45 |
| ఈ విటమిన్ ఉండేలా చూసుకోం'డి' | డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ | 46 |
| సంస్కృతం నేర్చుకుందాం..!! | రచన- మహామహోపాధ్యాయ కె.కృష్ణాచార్య<br>నిర్వహణ- మహామహోపాధ్యాయ ఎస్.లక్ష్మణయ్య | 49 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకటఅప్పలాచార్యులు | 50 |
| మంచిమిత్రుడు | ఆచార్య పి.ఎల్.శ్రీనివాస రెడ్డి | 51 |
| కిరాతార్జునీయం (చిత్రకథ) | కథ : డా॥ కంపల్లె రవిచంద్రన్<br>చిత్రాలు : శ్రీ తుంబలి శివాజీ | 52 |


ముఖచిత్రం : ఉభయదేవేరీ సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారు (శ్రీనివాసమంగాపురం)
వెనుక చిత్రం : శ్రీకామాక్షీ సమేత శ్రీకపిలేశ్వరస్వామివారు (కపిలతీర్థం)

ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.

24 గంటలూ పనిచేసే
తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్ నెం.
0877 2277777 / 2233333



వెబ్‌సైట్- www.tirumala.org;
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు-
sapthagiri_helpdesk@tirumala.org; ద్వారా తెలియజేయవచ్చు.

సంపాదకీయం..

# ఆలయభద్రత - జీవనభద్రత

ఒకజాతి ఉత్తమజీవనవిధానానికీ, సంస్కృతీసంప్రదాయాలకూ ఆచారవ్యవహారాలకూ ఆలయాలు పట్టుగొమ్మలు. భౌతికంగానే గాక మానవుడు ఆధ్యాత్మికంగా సుఖశాంతులతో వర్ధిల్లడానికీ, మానసికంగా విశాలభావాలతో అందరి సుఖశాంతులు కోరుతూ అభ్యుదయాన్ని పొందడానికీ ఆలయాలే నిజమైనకేంద్రాలు. ఊహకందని కాలంనుంచీ దైవానికి మానవుడు నిర్మించుకున్న దివ్యస్థానాలే ఆలయాలు. తన శరీరాన్నీ, తన ఇంటినీ బాగుపరచుకోవడం, రక్షించుకోవడం మానవుడికి ఎంత బాధ్యతో, తాము పూజిస్తున్న దేవతామూర్తుల్నీ, వారి నివాసస్థానాల్నీ రక్షించుకోవడంకూడా అంతకంటే ముఖ్యమైనబాధ్యత.

దేవునిఅస్తిత్వాన్ని నమ్మనివాళ్లు లేదా ఒక విధమైన విధ్వంసకప్రవృత్తికి అలవాటుపడినవాళ్లు తమ ఇళ్లనుమాత్రం రక్షించుకుంటూ దేవాలయాలను పనిగట్టుకొని ధ్వంసంచేస్తూండడం క్షమించరానినేరం. కనుక దేవుణ్ణి నమ్మే ప్రతిమానవుడూ విశ్వమంతా దైవమందిర మనేభావనతో విశ్వేశ్వరుడైన భగవంతుని మందిరం మనం నిర్మించిందే కనుక దాన్ని రక్షించే బాధ్యతకూడా మనదే! అవకాశం ఉన్నప్పుడంతా యువత ఈ విషయంలో శ్రద్ధ వహించి, తరచుగా ఆలయాలకు వెళ్లడం, అక్కడిపరిస్థితులను సమీక్షించడం, ఆలయ రక్షణకై శ్రమదానంతో తాము చేయగలిగిన రక్షణకార్యక్రమాలు చేపట్టడం, ఆలయప్రాంగణంలో పవిత్రవాతావరణాన్ని కల్పించడం మనకర్తవ్యం.

ఆలయాలు కేవలం పూజలకు, మొక్కు బళ్ళకే కాదు ఎన్నో శుభకార్యాలు నిర్వహించడానికీ, సమాజాన్ని ఐకమత్యంతో, ఉత్తమభావాలతో నడిపించడానికీ కేంద్రాలు. అక్కడి శిల్ప, చిత్రకళాసంపద జాతివారసత్వ సంపద. దాన్ని రక్షించడంకూడా మనబాధ్యతే! ఈ బాధ్యత నిర్వహించడంతో భావితరాలకు మనజాతియొక్క ఔన్నత్యాన్ని, జ్ఞానవిజ్ఞానసంపదలను, ఉత్తమకళావైభవాన్ని అందించినవాళ్ల మౌతాం. అక్కడ జరిగేఉత్సవాలలో అందరూ సమానంగా పాల్గొనడంవల్ల వర్ణ, వర్గ, వైషమ్యాలు దూరమై అందరమూ భగవత్సేవలో సమాను లనే పవిత్రభావన ఏర్పడి, సమసమాజనిర్మాణంకూడా చేసినవాళ్ల మౌతాం.

ప్రతిరోజూ లేదా వారాని కొకమారైనా ఆలయంలో అందరూ చేరి, మంచివిషయాలు ముచ్చ టించుకోవడం, ఆలయఅభివృద్ధినిగురించి చర్చించుకోవడం, భజనలు, ఉపన్యాసాలు మొదలైనవి నిర్వహించడంద్వారా ఆలయంతో మనకు ఒక ఆత్మీయతానుబంధం ఏర్పడుతుంది. అప్పుడు ఆలయ భద్రతనుగూర్చిన ఆలోచన మనమెదడులో ఏర్పడి, స్థిరపడుతుంది. తద్వారా ఆలయభద్రతకై ముందుండే అవకాశం ఏర్పడుతుంది. మనోబలం, శరీరబలం దృఢంగా ఉంటే ఆలయభద్రత ఏప్రాంతంవాళ్లు ఎక్కడి కక్కడే నిర్వహించుకోవడం సులభం. ఆలయభద్రతవెనుక మనజాతీయసంపదను భద్రపరచుకోవడంకూడా ఉన్న దని ప్రతిపౌరుడూ గుర్తించాలి.

*ఆలయాలు క్షేమంగా ఉంటే - జాతిజీవనఆలయంకూడా క్షేమంగా ఉంటుంది.*

# శివరాత్రి-శుభరాత్రి

- ఆచార్య గల్లా చలపతి, 98858 26626

బ్రహ్మానంద స్వరూపంతో, నిర్వికారత్వంతో శమించి ఉండే వాడు శివుడు. శివమ్ అనే మాటకు కల్యాణం, శుభం అని అర్థాలు. కల్యాణాన్ని, శుభాన్ని కలిగించేవాడు శివుడు. ఈ మాటకు అరిష్టాన్ని తగ్గించేది (అరిష్టం శినోతి తనూకరోతి శివమ్) అనికూడా మరొక అర్థం. సుఖా న్నిచ్చేది రాత్రి (రాతి సుఖమితి రాత్రిః). అందువల్ల 'శివరాత్రి' అంటే శుభరాత్రి లేక శుభాన్ని కలిగించే రాత్రి. శుభం ఎవరికి అంటే - సమస్త భువనానికి లేక సమస్తజీవులకు. హిందువులకు శివరాత్రి ఒకపర్వదినం. ఆ రాత్రి శివపూజలతో, శివజాగారాలతో శైవ దేవాలయాలు సందడిగా ఉంటాయి. అనంతచతుర్దశి దినాన్ని వైష్ణవులు ఎంత పవిత్రంగా భావిస్తారో శైవులు శివరాత్రిని అంత పవిత్రంగా భావిస్తారు. సాధారణంగా దైవపూజ పగటి పూట జరుగుతుంది. శివరాత్రిరోజు శివపూజ రాత్రి వేళ జరుగుతుంది.

మాఘమాసకృష్ణపక్షఅర్ధరాత్రి వ్యాపక మైన చతుర్దశితిథిలో శివరాత్రి వస్తుంది. సంవ త్సరంలో ఐదురకాల శివరాత్రులనుగురించి పెద్దలు చెపుతారు.

### 1) నిత్యశివరాత్రి

కొందరు భక్తులు ప్రతిదినం శివుణ్ణి పూజి స్తారు. శివుడు శుభంకరుడు కాబట్టి శివారాధన ఎప్పుడూ శుభాన్నే కలిగిస్తుందని నమ్మకం.

### 2) పక్షశివరాత్రి

ప్రతిపక్షంలో ఒక ముఖ్యమైన రోజున శివారాధనక్రమం తప్పకుండా నిర్వహిస్తారు కొందరు భక్తులు.

### 3) మాసశివరాత్రి

ప్రతిమాసం బహుళచతుర్దశి అర్ధరాత్రి కున్న రోజు ఒక మాసశివరాత్రి వస్తుంది. ఆ రోజు శివపూజ చేయడం శుభప్రదం.

### 4) మహాశివరాత్రి

సంవత్సరానికి ఒకసారి మాఘకృష్ణచతుర్దశిరోజున వచ్చే పర్వదినం.

### 5) యోగశివరాత్రి

యోగులు తమమహిమతో యోగనిద్రను పొందేరాత్రి. ఇది సాధారణభక్తులకు సాధ్యంకాదు. పండ్రెండుమాసశివ రాత్రులలో మాఘమాసంలో వచ్చే కృష్ణచతుర్దశి శివుడికి ప్రీతి కరం కాబట్టి ఆ రాత్రికి **'మహాశివరాత్రి'** అని పేరు.

స్కాందపురాణంలో, లింగపురాణంలో, ఈశానసంహితలో శివరాత్రి మాహాత్మ్యానికి సంబంధించిన విషయాలున్నాయి. మాఘకృష్ణ చతుర్దశిరోజున జాగరణ చేయాలని, ప్రతిమాసంలో వచ్చే కృష్ణచతుర్దశి దినాన్ని శివరాత్రిగా భావించి, శివారాధన చేయాలని లింగపురాణం పేర్కొన్నది. భవిష్యపురాణం శివ రాత్రి పండుగను 'శివచతుర్దశి'గా చెప్పింది. శివరాత్రిరోజు



శివలింగాన్ని పూజించడం, రాత్రంతా జాగారం (నిద్ర మేల్కోవడం) చేయడం ప్రధానంగా కనిపించే ఆరాధనా విశేషాలు. సాధారణంగా శైవదేవాలయాలన్నింటా శివుడు లింగాకారంలోనే దర్శనమిస్తాడు. 'లింగం శివమితి జ్ఞేయం, పీఠం శక్తి రుదాహృతమ్' అని లింగపురాణంలో ఉంది. పానవట్టం, దాని క్రిందివేదిక శక్తిగా, పైభాగం శివుడుగా ఆరాధింపబడే శివలింగం శివశక్త్యాత్మకం.

ముక్తిదాయకమైన ఒక వ్రతాన్ని చెప్ప మని పార్వతి శివుణ్ణి అడిగినట్లు, శివుడు శివరాత్రివ్రతమే అన్ని వ్రతాలలో గొప్ప వ్రతమని, ఎవరైనా తెలిసిగాని, తెలియకగాని ఈ వ్రతం చేస్తే యమలోకాన్ని తప్పించుకొని శివలోకం చేరవచ్చు నని పార్వతికి చెప్పినట్లు లింగపురాణం వివరించింది.

శివుడు అర్ధరాత్రికాలంలో కోటి సూర్యుల కాంతిగల లింగాకారంలో ఉద్భవించడంచేత ఆ రాత్రికి 'శివ రాత్రి' అని పేరు వచ్చిందని ఈశానసంహిత చెపుతున్నది. లింగోద్భవకాలం శివుడికి ఎంతో ప్రియమైందని, ఆ సందర్భంలో లింగరూపి అయిన శివునిఆరాధన జరపాలని శైవపురాణాల కథనం. శివలింగం సాకారనిరాకార తత్త్వాలకు రెండింటికీ సంకేతం.

స్కాందపురాణంలో శివలింగోద్భవాన్ని గురించి, శివ రాత్రిమాహాత్మ్యాన్నిగురించి వివరంగా ఉంది. ప్రళయకాలాంతంలో బ్రహ్మ సృష్టిచేయడం ప్రారంభించి, తనకంటే అధికుడు లే డని భావించాడు. తానే పరమేష్ఠి నని, జగత్కర్త నని అహంకరించాడు. భూమిని తనకోరలతో పైకెత్తిన వరాహరూపి శ్రీమన్నారాయణుణ్ణికూడా లెక్కచేయలేదు. జగత్కర్తను నేనంటే



నేనని ఇద్దరూ వాదుకు దిగారు. మాటలు పెరిగి ఒకర్ని ఒకరు గెలవడానికి అస్త్రప్రయోగాలు చేసుకొన్నారు. బ్రహ్మ బ్రహ్మశిరో నామకాస్త్రాన్ని ప్రయోగిస్తే, నారాయణుడు చక్రప్రయోగం చేశాడు. ఈ రెండూ నిష్ఫలంకాగా ఒకరిపై ఒకరు మహాస్త్రాలు వేసుకొన్నారు. ఆఅస్త్రాలు ఇద్దరిశరీరాలను రక్తసిక్తం చేశాయి. లోకాలను చీకాకుపరిచాయి. ఈ ఇద్దరిని కాపాడడానికి, ఆఅస్త్రాలబారినుండి లోకాలను రక్షించడానికి శివుడు ఆ రెండు అస్త్రాలమధ్య మిరిమిట్లు గొలిపే ఒక స్తంభరూపంతో అవతరించాడు. ఆ స్తంభఆవిర్భావంవల్ల మహాస్త్రాలు అదృశ్యమయ్యాయి. ఆ స్తంభం ఎక్కడినుండి ఎక్కడికి వ్యాపించిందో తెలియలేదు. దాని ప్రభావంతో పుట్టిన అతిఉష్ణం, అతి శీతలం భరింపరానివైనాయి. బ్రహ్మవిష్ణువులు ఆ స్తంభ ఆద్యంతాలు తెలుసుకోలేకపోయారు. అయితే అది శివరూపమని అర్థమైంది.

'ఈశ్వరా! నీకు ఎలాంటి అనుష్ఠానాలు ఇష్టం? ఎలాంటి యజ్ఞం చేస్తే మేము నీ వాళ్లమవుతాము' అని వినయపూర్వకంగా అభ్యర్థించారు. శివుడు శివరాత్రివ్రతం తన కెంతో ఇష్టమని చెప్పి, వ్రతవిధానాన్నికూడా తెలియజేశాడు.

శివుడు చెప్పిన వ్రతవిధానం శివరాత్రిరోజు పగటి పూట తెల్లవారుజామున నిద్రనుండి లేచి, శౌచక్రియలు నిర్వర్తించాలి. గురువుకు నమస్కరించాలి. పూజాద్రవ్యాలు సమకూర్చుకోవాలి. నదీస్నానం చేయాలి. నిత్యనైమిత్తికాద్యనుష్ఠానాలు పూర్తి చేయాలి. శివభక్తులను పిలిచి వాళ్లకు ఆసనాదివిధులను సమకూర్చాలి. పంచామృతంతో శివుని పంచముఖాలను (సద్యోజాతం, వామదేవం, అఘోరం, తత్పురుషం, ఈశానం అనేవి శివుని పంచముఖాల పేర్లు) అభిషేకించాలి. ఫలపుష్ప గంధమాల్యాలతోను, కుంకుమాగరుకర్పూరాలతోను షోడశోపచార పూజ చేయాలి. రాత్రి నాలుగుజాములు శివనామోచ్చారణ చేస్తూ, శివునికథలు వింటూ జాగరణ చేయాలి. శివరాత్రి పూజామహిమ అనంతం. బ్రహ్మహత్య, గోహత్య, జంగమహత్య, శిశువధ మొదలైన దుష్కర్మలవల్ల కలిగినపాపం నశిస్తుంది. సురాపానం కలిగించే దోషం పోతుంది. శివసాయుజ్యం కలుగుతుంది.

ఎటువంటి పాపాత్ముడైనా శివలింగాన్ని ప్రతిష్ఠిస్తే శివలోకం పొందుతా డని; శైవక్షేత్రయాత్ర చేయడం, శివ


ఇతరులకు బాధ కలిగించడం కన్నా నువ్వు బాధపడటం నయం

లింగాన్ని దర్శించడం, పూజించడంవంటి పనులు సర్వపాపాలను హరిస్తా యని చెప్పే కథ లెన్నో పురాణాల్లో ఉన్నాయి. శివరాత్రినాడు ఉపవాసం చేసి, శివారాధన పూర్వకమైన జాగరణ చేస్తే అనంతఫలదాయకం అవుతుందని భక్తులకు తెలియజేయడానికి అనేకపాపాలతో భ్రష్టత్వం పొంది, ఏమీ తెలియని స్థితిలో శివరాత్రినాడు శివదర్శనంతో శివస్థానాన్ని పొందిన వ్యక్తుల కథ లెన్నో ఉన్నాయి. ఇలాంటికథలను తమ కావ్యాల ద్వారా ప్రచారానికి తెచ్చిన మొదటితెలుగుకవి శ్రీనాథ కవిసార్వభౌముడు. ఈశ్వరార్చనకళాశీలుడుగా ప్రసిద్ధి పొందిన ఈ కవి రచించినవన్నీ శైవగ్రంథాలే. శ్రీనాథుని భీమేశ్వర పురాణంలో ఇంద్రుడు దేవతలకు శివలింగమాహాత్మ్యం చెప్పే ఒక సందర్భం ఉంది. ఆ సందర్భంలోని పద్యమిది –

**దర్శనముకంటె మేలు సంస్పర్శనంబు,**
**సంస్పృశించుటకంటె నర్చనము లెస్స**
**యర్చనము సేయుకంటె ననంత-ఫలద,**
**మసితగళునిఁ బ్రతిష్ఠించు టమరులార!**


శివలింగప్రతిష్ఠ ఎంత పుణ్యప్రదమైందో ఈ పద్యం సూచిస్తున్నది. అందువల్లనే కాబోలు అనేకులు తమపేర్ల మీద ప్రచారమయ్యే విధంగా ప్రత్యేకసందర్భాల్లో పవిత్రమైన చోట్ల శివలింగాలను ప్రతిష్ఠించడం గమనించవచ్చు. అగస్త్యేశ్వరుడు, భీమేశ్వరుడు, రామేశ్వరుడు ఇలా పేర్లతో శివలింగారాధన



జరుగుతూ ఉండడం తెలిసిందే! శివరాత్రిరోజు నూతనంగా లింగప్రతిష్ఠచేస్తే అనంతపుణ్యప్రదం. శివరాత్రి సోమవారంతో కలిసి వస్తే విశేషఫలప్రద మని భక్తుల నమ్మకం.

శ్రీనాథుడు తన 'శ్రీకాశీఖండం' అనేకావ్యంలో శివరాత్రి మాహాత్మ్యాన్ని తెలిపే 'గుణనిధి' కథ చెప్పాడు. కాంపిల్య పురనివాసి యజ్ఞదత్తునికొడుకు గుణనిధి. గుణనిధికి వేదవిద్యలు అబ్బలేదు. ద్యూతవిద్య అలవడింది. ఆచారాలు, సంప్ర

## నియమాలు పాటిస్తే... ఎందుకు భయం!!



**కరోనా విజృంభన అనేది గతంలాగా ఉండదు కానీ, జాగ్రత్తలు తీసుకోవడం అవసరం. కరోన వైరస్ నివారణకు వ్యాక్సిన్ వచ్చినా, అది మనల్ని వదలదు. కనుక, మన స్వీయ సంరక్షణలో మనం ఉండాలి.**

**సాధ్యమైనంత వరకు ఆసుపత్రికి వెళ్లకుండా ఆరోగ్యజాగ్రత్తలు తీసుకోవడం ఉత్తమం.**

**ఎవరికి వారు ఆరోగ్యపరంగా వ్యక్తిగత ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. పోషక విలువలు కల్గిన సరైన ఆహారం తీసుకోవాలి. పరగడుపున వేడినీళ్లు త్రాగడం, వాకింగ్, యోగాసనాలు మొదలైనవి చేస్తూ రోగనిరోధకశక్తి (ఇమ్యూనిటీ పవర్) పెంచుకుంటూపోతే భయపడాల్సిన అవసరం ఉండదు.**

పడిపోతామేమో అని నడకమానుకుంటామా?



భ్రష్టుడైన గుణనిధిని యమలోకానికి కొనిపోతా మన్నారు యమభటులు. అతడు శివరాత్రినాడు అన్నం దొరకకపోవడంచేతనైనా ఉపవాసం ఉన్నాడు. రాత్రి పూర్తిగా జాగారం చేశాడు. అన్నం కనిపించడానికైనా దీపం వెలిగించాడు. తెలియకుండానే అక్కడి భక్తులు శివునికి పూలతో చేసిన పూజ చూశాడు. శివునిగుడి సమీపంలో ప్రాణం విడిచాడు. ఇంతకంటే మించిన శివధర్మాలు లే వని చెప్పి, శివభటులు గుణనిధిని శివునిసన్నిధికి కొనిపోయారు.

తనకు శివరాత్రినిగురించి ఏమీ తెలియకపోయినా తన దేహావసరాలకోసం చివరిరోజు శివధర్మాలు నెరవేర్చి, సంపాదించిన పుణ్యం కారణంగా శివుడు గుణనిధిని 'దముడు' అనే పేరుతో కళింగదేశాన్ని రాజుగా పాలించమని పంపాడు. ఈశ్వరానుగ్రహంతో దముడు పట్టాభిషిక్తు డయ్యాడు. ఈ కథ శివరాత్రి మాహాత్మ్యాన్ని చక్కగా వివరిస్తున్నది.

దాయాలు రుచించలేదు. విటులతో, నటులతో స్నేహం ఏర్పడింది. భ్రష్టుడయ్యాడు. తల్లిదండ్రుల మాట వినలేదు. భార్యను నిర్లక్ష్యం చేశాడు. ఇంటిసొమ్ము దొంగిలించి జూదమాడాడు. తండ్రికోపానికి గురై ఇల్లు విడిచిపోయాడు. అన్నం లేక అలమటించాడు. అన్నంకోసం వెతుకులాడాడు. ఆ రోజు శివరాత్రి. సమీపంలోని శైవాలయంలో ఒక భక్తుడు జాగరణ చేస్తూ నాలుగు జాములు పూజ చేసే కార్యక్రమం సాగిస్తున్నాడు. అక్కడ సమకూర్చి పెట్టిన ప్రసాదాన్నం వాసనను గ్రహించాడు గుణనిధి. అన్నం దొంగిలించడానికి అక్కడికి వచ్చాడు. నృత్తగీతావాద్యాలతో భక్తులు జాగరణ చేస్తుండడంతో వీలు కాలేదు. భక్తజనం పలుచబడేవరకు అంటే తెల్లవారుజామువరకు మేలుకొనే ఉన్నాడు. సద్దు చేయకుండాలోనికి ప్రవేశించాడు.

గాలికి దీపం ఆరిపోయేస్థితిలో ఉంది. అన్నంపాత్ర సరిగా కనిపించలేదు. తనవస్త్రాన్ని కొద్దిగా చించి, వత్తిగా చేసి, ప్రమిదలో వేసి, అక్కడుండిన నెయ్యి పోసి, పెద్దదీపంగా వెలిగించాడు. వెలుతురులో అన్నం కనిపించింది. అన్నంపాత్రను తీసుకొని పరుగెత్తినాడు. చూచినవాళ్లు దొంగదొంగ అని అరిచారు. తలారులు గుణనిధిని వెంబడించి, బాణాలు వేసి చంపారు. అతణ్ణి తీసుకొని పోవడానికి యమభటులు వచ్చారు. శివభటులుకూడా వచ్చారు.

శ్రీనాథమహాకవి 'శివరాత్రి మాహాత్మ్యం' అనే పేరు గల ఒక కావ్యమే రచించాడు. ఈ కావ్యంలో దుర్వ్యసనాలతో భ్రష్టుడై జీవితావసానదశకు చేరుకొని శివరాత్రి రోజు మోక్షం పొందిన సుకుమారునికథ ఉంది.

వింధ్యపర్వతప్రాంత రత్నపుర వాసి అయిన యజ్ఞదత్తునికొడుకు సుకుమారుడు. అతని పేరులోని సుకుమారత్వం ప్రవర్తనలో లేదు. బాల్యంలో మంచివిద్యలే అభ్యసించాడు. యౌవనవంతుడైనప్పటి నుండి ఆ విద్యలు మరచిపోయి, కామవిద్యలకు అలవాటు పడ్డాడు. సత్కర్మలు పోయాయి. దుష్కర్మలు ప్రీతిపాత్రమయ్యాయి. మద్యంతో, అన్యసతులతో సంబంధం కలిగింది. అతని దుశ్చర్యలకు విసిగిపోయి ఆ ఊరిజనం రాజుతో చెప్పారు. రాజు సుకుమారుణ్ణి దేశం నుండి బహిష్కరించాడు. సుకుమారుడు ఆకలిదప్పులతో అడవి మార్గం పట్టాడు.

సమీపప్రాంతంలో నాగేశ్వరక్షేత్ర మనే శివాలయం ఉంది. అక్కడిశివుడు నాగేశ్వరుడు. ఒక శివరాత్రి పుణ్యకాలంలో


మూర్ఖునితో స్నేహం కత్తిని కౌగిలించుకోవడమే

ఆ దేవాలయంలో పూజలు జరిగాయి. భక్తులు దేవాలయాన్ని శుభ్రపరచి, తోరణాలు కట్టారు. తైలదీపాలు వెలిగించారు. పూజోపకరణసామగ్రిని సిద్ధం చేశారు. భక్తులందరూ జాగారం చేస్తున్నారు. ఆ సమయంలో సుకుమారుడు ఒకచేతితో మాంస ఖండం, మరొక చేతితో మద్యం పాత్ర పట్టుకొని ఆ సందడి ఏమిటో తెలుసుకోవాలని అక్కడికి వచ్చాడు.

అక్కడ జరిగే పూజను ఆ రాత్రంతా కన్నార్పకుండా చూచాడు. తొట్రుపడడంవల్ల మద్యం ఒలికి కిందపడింది. గాలివల్ల పూలపుప్పొడి శరీరానికి అంటుకొన్నది. అది ఒడలంతా విభూతి పూసుకొన్నట్లు కనిపించింది. సుకుమారుడు ఈ చర్యలవల్ల పాశుపతదీక్ష గైకొన్న వాడువలె ప్రకాశించాడు.

శివపూజ చూడడంవల్ల అతనిపాపాలు కరిగిపోయాయి. మునుపటి నీచవృత్తిని వదిలిపెట్టాడు. కొంతకాలానికి నయంకానివ్యాధికి గురి అయ్యాడు. శివాలయంలో శివరాత్రినాడు జాగరణ చేయడం కారణంగా ఆ దుష్కర్ముడు పరమయోగీశ్వరుడు పోయినవిధంగా పోయాడు. కాలకింకరులు, శివదూతలు వచ్చారు. శివదూతలు అతణ్ణి శంభుని సన్నిధికి తీసుకెళ్లారు. శివుడు సుకుమారునికి కాలగమనంతోపాటు ప్రమథత్వం ప్రసాదించాడు. దానితో అతనికి శివలోక వాసం లభించింది.



శివరాత్రినాడు ఉపవసించి జాగరణ చేస్తూ శివారాధన తత్పరులైన ఎలాంటివారికైనా శివసాయుజ్యం కలుగుతుందని చెప్పే ఎన్నోకథలు భక్తులకు కనువిప్పు కలిగిస్తాయి. శివుడు అభిషేకప్రియుడు. ఎవరైనా శివరాత్రి పర్వదినాన శివలింగంపై కనీసం గరిటెడునెయ్యిగాని, తైలంగాని సమర్పిస్తే సర్వపాపాల నుండి విముక్తి లభిస్తుందని పురాణాలు ఘోషిస్తున్నాయి. శివరాత్రివ్రతాచరణాన్నిగురించికూడా పురాణాలు వివరించాయి. శివరాత్రికి ముందురోజు భక్తులు ఒంటిపూటమాత్రమే భోజనం చేస్తారు. ఆ రాత్రి పవిత్రమైన శుచిగలప్రాంతంలో నిద్రపోతారు. శివరాత్రిరోజు వేకువజామున లేచి స్నానం చేసి శివాలయానికి వెళతారు. రాత్రి జాగరణ చేస్తూ నాలుగు జాముల్లో నాలుగుపద్ధతుల శివపూజ చేస్తారు. 1) మొదటి జాములో శివలింగాన్ని పాలతో అభిషేకించి, పద్మాలతో పూజ చేసి, పెసరపప్పు బియ్యం కలిపి వండిన పులగంతో నైవేద్యం సమర్పిస్తారు. 2) రెండవజామున పెరుగుతో అభిషేకం చేసి, తులసిదళాలలో పూజ చేసి, పాయసం నైవేద్యం పెడతారు. 3) మూడవజాములో నేతితో అభిషేకం చేసి, మారేడు దళాలతో పూజిస్తారు. నువ్వులపొడి కలిపిన ఆహారపదార్థాలతో నివేదన చేస్తారు. 4) నాల్గవజామున తేనెతో అభిషేకంచేసి, నల్ల కలువపూలతో పూజిస్తారు. అన్నం నైవేద్యంగా సమర్పిస్తారు. ఈ నాలుగు జాములపూజను ఇంట్లోనూ నిర్వహించవచ్చు.

అదేరకంగా కాకున్నా భక్తులు తమశక్త్యనుసారం చిత్తశుద్ధితో శివరాత్రిపూజను నిర్వహించవచ్చు. ఇంట్లో వీలుగానివాళ్లు శివాలయాలకు వెళ్లి, ఉపవాసదీక్షతో జాగరణ చేస్తూ, అక్కడ జరిగే నాలుగుజాముల పూజావిధానాన్ని తిలకించి ధన్యులు కావచ్చు.

జీవితానికి శుభం కలిగించే శివరాత్రి ఎంతో పవిత్రమైన పర్వదినం. శివభక్తి మనసును అదుపులో ఉంచుతుంది. ఉపవాసం, జాగరణ శారీరకకల్మషాలను కడిగివేస్తాయి. ఆవిధంగా భౌతికాధ్యాత్మికాల సమన్వయతత్త్వం శివరాత్రి ఆరాధనసందర్భంలో అనుభవగోచరమవుతుంది. ప్రతిశివరాత్రినీ కాక పోయినా సంవత్సరానికి ఒకసారి వచ్చే మహాశివరాత్రిని అందరూ భక్తిప్రపత్తులతో జరుపుకొని పునీతులవుతారు. అందుకే కాబోలు *'జన్మకోశివరాత్రి'* అనడం ఒక సామెతలాగా ప్రచారంలో ఉంది.

# శ్రీమద్భగవద్గీత



4

విద్వాన్, డా॥ ఈ.జి. హేమంత కుమార్

## 4వ - అధ్యాయం (సారసంగ్రహం)

### జ్ఞానయోగం అధ్యాయ నామౌచిత్యం :

ఈ నాల్గవఅధ్యాయానికి జ్ఞానయోగం అని పేరు. "నహి జ్ఞానేన సదృశం పవిత్ర మిహ విద్యతే" అని జ్ఞానంతో సమానమైంది మరొకటి లేదని భగవంతుడే సెలవిచ్చాడు. భగవద్గీత చివరి ఆరధ్యాయాలు జ్ఞానకాండగా ప్రసిద్ధాలు.

ఐనా, ఈ నాల్గవఅధ్యాయంలో విశేషించి జ్ఞాన స్వరూపాన్ని వివరించటంవల్ల దీనికి జ్ఞానయోగం అనే పేరు కల్గింది. జ్ఞానార్జన ఒక మహాయజ్ఞం. అన్ని యజ్ఞాల్లోకి జ్ఞానయజ్ఞమే శ్రేష్ఠమైంది. నిష్కామకర్మయోగం పాటించిన తరువాత పాపం నశించి, చిత్తశుద్ధి ఏర్పడి జ్ఞానం కలుగుతుంది. జ్ఞానతపస్సునుగూర్చి వివరిస్తూ -

వీతరాగభయక్రోధాః మన్మయా మా ముపాశ్రితాః।
బహవో జ్ఞానతపసా పూతా మద్భావమాగతాః॥ 10

జ్ఞానతపస్వి కామక్రోధభయాలను వదలివేయాలి. భగవంతునియందు తన్మయత్వం పొందాలి. భగవంతుణ్ణే ఆశ్రయించాలని కృష్ణుడు బోధించాడు.

గీతాజ్ఞానాన్ని శ్రీకృష్ణుడు అర్జునునికి శాస్త్రంగా బోధించాడు- ఇది అనాది సిద్ధమైంది. కానీ, కాలక్రమంలో విస్మరింపబడింది. మళ్ళీ దాన్నే స్మృతిపథంలోకి తేవడానికి అర్జునుణ్ణి నిమిత్తంగా చేసుకొని కృష్ణుడు బోధించాల్సివచ్చింది. తా నెప్పుడో సూర్యునికి బోధించా నని కృష్ణు డంటే అది ఎలాగని ప్రశ్నించాడు అర్జునుడు.

అపుడు కృష్ణుడు జన్మసిద్ధాంతాన్ని వివరించాడు. సనాతన ధర్మానికి విశిష్టత కల్గించేది ఈ సిద్ధాంతమే! అంతా బ్రహ్మార్పణమనే భావంతో అంతటా బ్రహ్మ స్వరూపాన్ని దర్శిస్తూ కర్మల్ని చేసేవాడు బ్రహ్మకర్మ సమాధిస్థితిని అనుభవిస్తాడు-

బ్రహ్మార్పణం బ్రహ్మ హవిః బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతమ్।
బ్రహ్మైవ తేన గంతవ్యం బ్రహ్మకర్మ సమాధినా ॥ 24

అని బ్రహ్మకర్మసమాధిని వివరించాడు. తరువాత ఆత్మజ్ఞానానికి సాధనాలైన పండ్రెండు రకాలయజ్ఞాలు వివరింపబడ్డాయి. అవి 1)దైవయజ్ఞం 2)బ్రహ్మయజ్ఞం 3)ఇంద్రియ సంయమయజ్ఞం 4)శబ్దాది విషయనిరోధయజ్ఞం 5)మనోనిగ్రహ యజ్ఞం 6)ద్రవ్యయజ్ఞం 7)తపోయజ్ఞం 8)యోగయజ్ఞం 9)స్వాధ్యాయయజ్ఞం 10)జ్ఞానయజ్ఞం 11)ప్రాణాయామయజ్ఞం 12)ఆహారనియమయజ్ఞం.

ఈ విధంగా జ్ఞానానికి సంబంధించిన విషయాలు ఇందు వివరింపబడినందువల్ల దీనికి ఆపేరు తగినట్లే ఉంది. ఈ అధ్యాయం చదవటంవల్ల ఉత్తమగతులు సంప్రాప్తిస్తాయి.

- - - - -

### భగవంతు డంటున్నాడు

"అర్జునా! ఇంతవరకు నీకు విన్పించిన ఈ నిష్కామ కర్మయోగవిద్యను ఒకప్పుడు నేను సూర్యునికి ఉపదేశించాను. సూర్యుడు మనువుకు, మనువు ఇక్ష్వాకునికి బోధించారు. రాజర్షులెందరో దీన్నిగురించి తెలుసుకుని తరువాతి తరాలకు బోధించారు. కాలప్రవాహంలో ఆ యోగం విలీనమైపోయింది. నీకు నాయందు గౌరవం, భక్తి ఉన్నాయి గనుక పై పెచ్చు స్నేహితుడవు గనుక పరమరహస్యమైన ఈ విద్య నీకు ఉపదేశించాను" అని కృష్ణుడు అనగానే "కృష్ణా! నాకో సందేహం కలుగుతున్నది" అంటూ ఇలా అడుగుతున్నాడు.



వాయిదాలు వేసే అలవాటు విజయానికి బద్ధశత్రువు

## అర్జునుడు అడుగుతున్నాడు

"కృష్ణా! కోట్లకొలదిసంవత్సరాలక్రిందటివాడు సూర్యుడు. ఇటీవల జన్మించినవారు మీరు. వెనుక పుట్టిన నీవు– ఎప్పుడు పుట్టాడో తెలియని సూర్యునికి ఉపదేశించడం ఎట్లా పొసగుతుంది? అగమ్యంగా ఉంది. దయచేసి చెప్పండి" అన్న మాటకు –

## భగవంతు డంటున్నాడు

"అర్జునా!! నిజమే! నే నిప్పటివాణ్ణి కాను. నీకూ, నాకూ ఇదివరకే ఎన్నో జన్మలు గడచాయి. ఆ జన్మల జ్ఞానం, నాకు పూర్తిగా తెలుసు. నీకు తెలియదు. నాకు పుట్టుక ఉండదు. నాశమూ లేదు. భూతకోటికి నేను ప్రభువును.

యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత! ।
అభ్యుత్థాన మధర్మస్య తదాఽఽత్మానం సృజా మ్యహమ్ ॥ 7

పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్ ।
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ॥ 8

ఎప్పుడెప్పుడు ధర్మానికి హానికలిగి, అధర్మం పెచ్చు మీరుతుందో అప్పుడు నేను నా అధీనంలో ఉండే ప్రకృతి మాయాప్రభావంతో ఏదో ఒకదేహాన్ని ధరించి, దుష్టుల్ని శిక్షించి, శిష్టుల్ని రక్షించి ధర్మాన్ని తిరిగి సంస్థాపిస్తాను.

అర్జునా! దివ్యమైన నా కర్మలను గ్రహించేవాడు తిరిగి జన్మించడు. అతడు నన్నే చేరుతాడు. నేను మీవలె పుణ్య పాపబద్ధుణ్ణి కాను. కర్మవశుణ్ణి కాను. సర్వస్వతంత్రుణ్ణి– అని నన్నెరిగినవాళ్లు మోక్షాన్ని పొందుతారు. నేను భక్తులతో కలిసి మెలిసి ఉంటాను. వారికోర్కులు తీరుస్తాను. అర్జునా! కర్మ, అకర్మ, వికర్మలను గూర్చిన అవగాహన కావాలి. కనుక నీకు చెబుతాను విను. కర్మ అనగా చేయతగింది. వికర్మ చెఱచునది. అకర్మ చేయకూడనిది. కోరిక లేకుండా కర్మ చేస్తే అది నివృత్తికర్మ. కర్మలు నిత్యకర్మ, నైమిత్తికకర్మ, కామ్య కర్మలని మూడువిధాలు. సంధ్యావందనం, దేవపూజ మొ॥వి నిత్యకర్మలు. ఒక విశేషకారణాన్ని అనుసరించి చేసేది అంటే గ్రహణకాల తర్పణంవంటివి నైమిత్తికాలు. కామ్యకర్మలు అల్పసుఖాలను కోరి చేసేవి.

విధివిహితమైనపని కర్మ. విధివిహితమైన పని మీద మనస్సు లగ్నం కాకుండా చేస్తే అది అకర్మ. వికర్మదశలో (నిద్రావస్థ, మత్తుమందు) మనస్సు, శరీరం స్వాధీనంలో ఉండవు.

కర్మయందు అకర్మను, అకర్మయందు కర్మను ఎవడు దర్శించగలడో వాడు జ్ఞానియై తనకర్తవ్యం నిర్వర్తించి, కృత కృత్యుడవుతాడు.

యస్య సర్వే సమారమ్భాః కామసంకల్పవర్జితాః।
జ్ఞానాగ్నిదగ్ధకర్మాణం త మాహుః పండితం బుధాః॥ 19

కోరికలు, వాసనలు (ఫలాపేక్ష) లేకుండా ఎవడు కర్మలను ఆచరిస్తాడో, ఎవడు జ్ఞానాగ్నితో కర్మలనూ దగ్ధం చేస్తాడో అతణ్ణి వివేకులు పండితు డంటారు.

ఏది చేసినా భగవంతుని ఆజ్ఞ అని, అతనిప్రీతి కొరకు అని తలచి భగవదర్పణం గావించాలి. అదే సాత్త్విక త్యాగ మనబడుతుంది. అన్ని ప్రాణుల ఆత్మలు సమానమే అని తెలుసుకోవాలి.

అర్జునా! యజ్ఞాలు బహువిధాలు. అందులో జ్ఞాన యజ్ఞం ప్రశస్తమైంది. ఎందుకంటే కర్మలన్నీ జ్ఞానమందే లయ మవుతాయి.

తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా।
ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానిన స్తత్త్వదర్శినః ॥ 34

అనుభవజ్ఞుడైన గురువు దగ్గరకు వెళ్ళి ఆయనపాదాల్ని ఆశ్రయించి, పదే పదే ప్రశ్నలు వేస్తూ, సందేహాల్ని నివారించు కోవాలి. అప్పుడే అవిద్య పటాపంచలై తత్త్వరహస్యాన్ని తెలుసు కుంటాడు.

ఈ విశ్వంలో జ్ఞానంతో సమానమైంది, పవిత్రమైంది మరొకటి లేదు.

న హి జ్ఞానేన సదృశం పవిత్ర మిహ విద్యతే ।
తత్స్వయం యోగసంసిద్ధః కాలే నాత్మని విందతి ॥ 38

నిష్కామకర్మయోగాభ్యాసంతో, నిర్మలచిత్తంతో, ఆత్మ జ్ఞానాన్ని నీలోనే నీవు పొందుతావు. దానిని పొందటానికి శ్రద్ధ అవసరం. శ్రద్ధాభక్తులతో జ్ఞానం పొందిన పిమ్మట అశాంతి ఉండదు. ముక్తి లభిస్తుంది. జన్మ ధన్యమైపోతుంది.

కనుక అర్జునా! "లే! నీ మనస్సును ఆవరించిన అజ్ఞానాన్ని, సంశయాలను జ్ఞానఖడ్గంతో నరకు. యోగ నిష్ఠుడవు కమ్ము. నీ కర్తవ్యాన్ని నిర్వహించు. జన్మను చరితార్థ మొనర్చుకో!" అని కృష్ణపరమాత్మ పలికాడు.

# శ్రీ మహాలక్ష్మి ఆవిర్భావం

- డా॥ డి. ఉదయకుమారి

"క్షీరసాగరంలో మందరగిరిని కవ్వంగా, వాసుకి అనే మహాసర్పాన్ని చిలికేత్రాడుగా చేసి, దేవదానవులు అమృత మథనకాంక్షులై చిలుకుతుంటే, సముద్రగర్భంలోకి మునిగి పోతున్న మందరగిరిని శ్రీమహాకూర్మమై, తనవీపుమీద నిలుపుకుని, ఇక క్షీరసాగరమథనం కొనసాగించమని ఆనతి చ్చాడు ఆ ఆర్తత్రాణపరాయణుడు. నిజానికి ఆ మహాద్భుతశక్తి చూచిన బ్రహ్మాదిదేవతలు, సకలచరాచరాలు శ్రీహరి విచిత్ర లీలకు విస్మయం పొందారు.

ఇక క్షీరసాగరంలోనుండి ముందుగా వాసుకి పడగల నుంచి క్రక్కిన విషం దావానలమై, హాలాహలంగా మారి ఉద్భవించింది. దాన్ని దేవత లందరికోరికపై ఈశ్వరుడు మ్రింగి తన కంఠంలో ఓ పక్కగా నిల్పి, నీలకంఠుడుగా ప్రసిద్ధి చెందాడు. లోకకల్యాణం కోసం, భర్తను విషం మ్రింగుమని చెప్పిన పార్వతి "సర్వమంగళ"గా శాశ్వతకీర్తి పొందింది. ఆ తర్వాత "సురభి" అనే మహాద్భుతరూపంగల "కామధేనువు" పుట్టింది. "అగ్నిహోత్రి" అనే పేరు పెట్టుకుని ఆ కామధేనువును మహర్షులు తీసుకున్నారు- అపురూపంగా. వారి స్వార్థంకోసం కాదు, తమ దగ్గరకు వచ్చే అశేష సాధువులకు, సత్పు రుషులకు, మహారాజులకు, వారిస్థాయికి తగ్గ అతిథ్యమిచ్చి, విందు భోజనం ఏర్పాట్లు చేసేందుకు కామధేనువును కోరారు ఆ ఋషులు.

ఆ తర్వాత "ఉచ్చైశ్రవం" అనే మహాద్భుతమైన "అశ్వం"గా ఉద్భవించింది. పాలకడలిలో నుంచి, ఆ గుర్రం రూపం, తోక అన్నీ సుందరంగా ఉన్నాయి. ఈ గుర్రం తోక రంగు గురించే పన్నగుల తల్లి అయిన కద్రువ, గరుత్మంతుని తల్లి అయిన వినత పందెమేసుకుని, గరుత్మంతుడు అమృత కలశం, స్వర్గం నుంచి తెచ్చి, తన పినతల్లికిచ్చి, తన తల్లిని చిరదాస్యం నుంచి విడిపించిన కథ ఉత్పన్నమైంది. ఆ తర్వాత అత్యద్భుతమైన శైలేంద్రంలా, "ఐరావతమ"నే ఏనుగు ఉద్భవిం చింది. ఆ తర్వాత పాలకడలిలో, చల్లని చంద్రుడుద్భవించాడు. ఇలా క్షీరసాగరమథనంలో మహాద్భుతాలెన్నో ఉద్భవించాయి. ఆ అద్భుతాలలో ఒకటిగా "శ్రీమహాలక్ష్మి" ఆవిర్భావం జరిగింది!

క్షీరసాగరమథనమంతా ఒక ఎత్తయితే, శ్రీమహాలక్ష్మి ఆవిర్భావఘట్టమొకటి ఒక ఎత్తు. యుగాల పర్యంతం లక్షలాది చిత్రకారుల కుంచెల్లో, కోట్లాదిశిల్పుల ఉలుల్లో జీవం పోసు కున్న "గజలక్ష్మి" రూపం, పోతన మహాకవి శిల్పంలో అమ్మవారి భక్తులందరిహృదయల్లో చిరస్థాయిగా నిలిచిపోతుంది.

పాలకడలిలోనిమీగడ, శరత్కాలమేఘాలచాటు మెరుపు తీగెల సమూహమూ, చిగురాకులతో నిండిన తమల పాకు తీగెలు, అరటిబోదెలు, బంగారుచంపకాలు ఇలా ఏ అవయవానికా అవయం తీర్చిదిద్దినట్లు బ్రహ్మ సృష్టించి నట్లుగా ఉన్న ఆ భువనమోహనరూపం శ్రీమహాలక్ష్మిది. ఆమెకు మంగళస్నానానికిగానూ అనర్ఘరత్నమణిమయపీఠం ఇంద్రుడు ఇచ్చాడు. దేవతాస్త్రీలు పుణ్యజలకలశాలు తెచ్చారు. భూమి చిగురుటాకులు పరిచింది. పంచగవ్యాలను ఇచ్చాయి- గోవులు. వసంతుడు మధువు తెచ్చాడు. మహర్షులు ఆశీర్వ చనాలు పలుకుతుండగా మంగళతూర్యనినాదాలు మిన్ను ముట్టగా, గంధర్వస్త్రీపురుషులు నృత్యగీతవాద్యాదిస్వాగ తాలు పలుకగా, "క్షీరసాగరతనయ" ముల్లోకాలనూ తనచల్లని చూపులతో కలయజూస్తూ కూర్చుంది అప్పుడే!

కం. పండిత సూక్తులతోడుత, తుండంబులు సాచి, తీర్థతోయము లెల్లన్
కుండముల ముంచి దిగ్వేదండంబులు జలకమార్చె తరుణీమణికిన్

అదీ "గజలక్ష్మీదేవి" సాక్షాత్కారం. ఇరువైపులా రెండు పెద్ద పెద్ద ఏనుగుతొండాలతో కలశాల్లోని నీరు క్రుమ్మరి స్తుండగా, పెద్ద పద్మాకారపీఠంలో భాసింపట్టు వేసుకుని కుదురుగా కూర్చుని, తన చల్లని చిరునవ్వులతో ముల్లోకాలనూ చల్లగా చూస్తూ, ఒకచేతిలో ధనం, మరోచేతిలో పద్మం ధరించి ఉండే "గజలక్ష్మి" అమ్మవారిఛాయాచిత్రాలు, శిల్పాలు లేని హిందువుల గృహాలు మనభారతదేశంలో అరుదు.

ఇక ఆ తల్లి రూపలావణ్య విశేషాలు ఇలా ఉండగా, ఆమెను చూచిన దేవపురుషులంతా ఈమె ఎవరి ఇల్లాలు అవుతుందో నని కుతూహలంతో చూస్తున్నారు. ఆమెచూపు, ఆలోచన మరోవిధంగా ఉంది. ఆమె తన పాణిగ్రహణఅదృష్టం



అర్థంలేని మాటలకంటే మౌనం చాలా గొప్పది

కోసం అఱ్రులు చాస్తున్న దేవ యక్ష గంధర్వ సిద్ధ చారణ గణాదుల్లోని పురుషులను కలయజూచింది. ఇలా ఆలోచించింది.

సీ.ఐదువ నై యుండ నలవడ దొక చోట నొకచోట సవతితో నోర్వ రాదు
తగ నొకచోట సంతత వైభవంబు గా దొకచోట వేఁడిమి నుండఁ బోల
దొకచోటఁ గరుణ లే దొక్కింత వెదకిన నొకచోట దగ్గతి యుండ బెట్ట
నెఱయంగ నొకచోట నిలుకడ చాలదు చర్చింప నొకచోట జడత గలదు.

ఆ.కొన్ని చోట్లు కామగుణ గరిష్ఠంబులు, క్రోధ సంయుతములు గొన్ని యెడలు
గొన్ని మోహలోభ కుంఠితంబులు గొన్ని, ప్రమద మత్సరానుభావకములు.

అంటూ లక్ష్మి ఉండతగనివీ, ఉండడానికి ఇష్టపడిన ప్రదేశాలు వితర్కించుకుంది. ఆమె చూపు శ్రీమహావిష్ణువుమీద పడింది. ఆమె విభ్రాంతి పొందింది.

సీ. అమరముత్తైదువనై యుండ వచ్చును
వరుసకు సవతు లెవ్వరును లేరు?
వెలయంగ నశ్రాంత విభవ మీతని యిల్లు,
శృంగార చందన శీతలుండు;
గలగఁ డెన్నడు శుద్ధ కారుణ్యమయమూర్తి,
విమలుండు గదిసి సేవింపవచ్చు!
నెఱినాడి తిరుగడు, నిలుకడ గలవాడు
సకల కార్యములందు జడత లేదు.

ఆ. సాధురక్షకుండు, షడ్వర్గరహితుండు
నాథుడయ్యెనేని నడప నోపు
నితడె భర్త! యనుచు నింతి సరోజాక్షుఁ
బుష్పదామకమున, (బూజ సేసె! (స్కం.8, ప.282)

లోకాలకు తండ్రి అయిన శ్రీమహావిష్ణువు, సంపదలకు తల్లి అయిన ఆ మహాలక్ష్మిని చేపట్టి, తన హృదయపీఠంమీద నిలుపుకున్నాడు. సర్వదేవతాగణం, మానవులు, మహర్షులు, సర్వలోకాలు పుష్పవర్షం కురిపించారు. లక్ష్మీనారాయణుల వివాహసందర్భంగా–



కం. ఆ పాలవెల్లికూతురు, తీపులచూపులను దోగి తిలకించి ప్రజల్
చేపట్టిరి సంపదలను, బ్రాపించెను మేలు, జగము బ్రతికె నరేంద్రా!

అంటూ క్షీరసాగరమథనకథనూ, క్షీరసాగరంలో ఉద్భవించిన మహాద్భుతవస్తుసముదాయాన్ని శ్రీమహాలక్ష్మి ఆవిర్భావాన్నీ, లక్ష్మీనారాయణుల కల్యాణాన్ని వర్ణించాడు శుక యోగీంద్రుడు పరీక్షిన్మహారాజుకు. అయితే, సాధారణమానవుల ఇల్లాళ్లకేగాక, సాక్షాత్తు దేవుళ్లఇల్లాళ్ళకుకూడా ఒక్కోసారి ఎలాంటి సంకటపరిస్థితులు, సంశయాలు, భయాలు ఎదురౌతాయనేది శ్రీమహాలక్ష్మికథద్వారా మనం తెలుసుకోవచ్చు.

ఆర్తత్రాణపరాయణుడైన శ్రీహరి, భక్తులకు ఏ ఆపద ఏ సమయంలో వచ్చినా పరుగెత్తుకు వెళతాడు. ఆ సమయంలో ఆ రాక్షసులను అంతం చేయడానికి శ్రీమహావిష్ణువు వివిధ అవతారాలుకూడా ధరించాల్సివస్తుంది. ఆ అవతార సమయంలో ఆ రాక్షసులకర్మ పరిపాకానికి వచ్చేవరకూ కాచుకుని కూడా ఉండాల్సిందే. ఆ సందర్భంలో శ్రీమహాలక్ష్మి అన్నిరోజులూ ఆ రాక్షసులకు సర్వసంపదలు ఇవ్వాల్సిందే! ప్రహ్లాదచరిత్రలో హిరణ్యకశిపుడు నియంతగా మారాక, శ్రీహరి అదృశ్యరూపుడై పోయాడు. వాని యోగబలం, వరబలం, అంతటివి మరి! దేవతాగణాలంతా వాడికి మొక్కాయి విధిలేక! ఆ దేవతాగణాలలో లక్ష్మీదేవికూడా ఉంది! అంచేత ఆ రాక్షసునికి విజయలక్ష్మి, సంపదలక్ష్మి, సార్వభౌమాధికారలక్ష్మి, సర్వం ఒనగూడాయి. ఆమె తన అష్టైశ్వర్యకళలు, వానికి ధారాదత్తం చేయలేక తప్పలేదు.

ఇక "గజేంద్రమోక్షం"లో కూడా ఇలాగే జరిగింది. తనతో ఒకమాటైనా చెప్పకుండా గజేంద్రునికోసం పరుగెడుతుంటే లక్ష్మీదేవికూడా పరుగెత్తింది. తనభర్త ఆర్తత్రాణతను గుర్తు చేసుకుంటూ–

శా. తాటంకాచలనంబుతో, భుజనటద్ధమ్మిల్లబంధంబుతో,
శాటీముక్త కుచంబుతో, నదృఢచంచత్కాంచితో, శీర్ణ లా
లాటాలేపముతో, మనోహరకరాలగ్నోత్తరీయంబుతోఁ,
గోటీందుప్రభతో, నురోజభర సంకోచద్విలగ్నంబుతోన్.

అలా పరుగెడుతోందా ఇల్లాలు. మరి ఇంత గొప్పదేవత అయిన ఆ జగజ్జనని భక్తుల హృదయాల్లో చిరముద్ర వేసుకోదా మరి? శ్రీమహాలక్ష్మి భక్తజనులపాలిటి కల్పతరువు!

# శ్రీవిష్ణుప్రీతికరమాసం...

- శ్రీ కె.జానకిరామావధాని, 90320 44114

భారతీయ కాలవ్యవస్థలో మాసాల గణనపరంగా చివరి మాసం ఫాల్గునమాసం. వైజ్ఞానికపరంగా చూస్తే ఋతువుల్లో చివరిదైన శిశిరఋతువు వర్తించే చివరినెల ఇది. వృక్షాల నుంచి ఆకులు రాలడం కనిపిస్తుంది. రాబోయే కొత్త సంవత్సరంలో నవవసంత వేళ చిగురించడానికి సిద్ధంగా ఉన్నామనే సంకేతాన్ని ఇది ప్రకటిస్తుంది.

ఆధ్యాత్మికపరంగా శ్రీమహావిష్ణువుకు అత్యంతప్రీతికరమైన మాసం ఇది. ఎన్నో వ్రతాలు కూడా ఈ మాసంలో చేయాలని శాస్త్రవిధులు నిర్దేశిస్తున్నాయి.

ఈ మాసంలో గృహనిర్మాణం ప్రారంభిస్తే మంచిదని పెద్దలు చెబుతారు. దీనివల్ల పుత్రలాభం, సువర్ణ లాభంకూడా కలుగుతుందని మత్స్య పురాణం చెబుతోంది.

భారతీయవైజ్ఞానిక, ఆధ్యాత్మిక దృక్పథాల్లోని ఔన్నత్యాన్ని ప్రకటించే మరొక లక్షణం ఈ మాసంలో కనిపిస్తుంది. బాహ్యంగా శ్రీమహావిష్ణువుకు ప్రీతికరమైన మాసంగా ఫాల్గునాన్ని చెబుతారు. కానీ, శివసంబంధమైన అర్చనలు, వ్రతాలు ఈ మాసంలో చేయాలని శాస్త్రం నిర్దేశిస్తోంది. కార్తికమాసంలోనూ ఈ లక్షణం మనకు కనిపిస్తుంది. శివప్రీతికరమైన కార్తికమాసంలో విష్ణుసంబంధమైన అర్చనలు, వ్రతాలు జరుగుతాయి. ఈ అంతర్లక్షణాన్ని విశ్లేషణ చేస్తే భారతీయ ఆధ్యాత్మికవ్యవస్థలోని విశాల దృక్పథం మనకు అర్థమవుతుంది. శివకేశవ అభేదాన్ని మాటల్లో కాకుండా చేతల్లో వ్యక్తం చేసే అద్భుతఆచరణీయవిశేషం మనశాస్త్రాల్లో ఉంది.

ఉత్తరఫల్గునీ నక్షత్రంతో కూడిన పూర్ణిమ వస్తుంది కనుక ఈ మాసానికి ఫాల్గునమాసం అని పేరు వచ్చింది.

ఫాల్గునం.. విష్ణుప్రీతికరం అంటోంది భాగవతం. ఫాల్గున శుద్ధ పాడ్యమి నుంచి పన్నెండు రోజులు పయోవ్రతం

## ఇతిహాసాలలో ఫాల్గునమాసం

**భారతీయ ఇతిహాస చరిత్రలో ఫాల్గునమాసానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. భారత, రామాయణాల్లోని ప్రధాన ఘట్టాలెన్నో ఈ మాసంలోనే జరిగాయి. రామాయణంలో అత్యంత కీలకమైన రామరావణ సంగ్రామం ఫాల్గునమాసంలోనే జరిగింది.**

**మరీ విశేషమేమిటంటే ఫాల్గునబహుళపాడ్యమినాడు ఈ యుద్ధం ప్రారంభమై, ఫాల్గున అమావాస్యతో ముగియడం. బహుళవిదియ రోజున ధూమ్రాక్షుడు, తదియరోజున వజ్రదంష్ట్రుడు, చవితిరోజున అకంపనుడు, పంచమిరోజున ప్రహస్తుడు, అష్టమిరోజున అతికాయుడు ప్రాణాలు విడిచారు.**

**రామాయణ సంగ్రామంలో అతిముఖ్యమైన ఘట్టం - ఇంద్రజిత్తు సంహారం. ఫాల్గున బహుళ ఏకాదశి నుంచి త్రయోదశి వరకు మూడు రోజుల పాటు-లక్ష్మణునికి, ఇంద్రజిత్తుకు జరిగిన యుద్ధంలో చివరిరోజున ఇంద్రజిత్తు ప్రాణాలు విడిచాడు.**

**ఇక, అత్యంత చారిత్రాత్మకమైన ఘట్టం రావణసంహారం. ఫాల్గున అమావాస్యరోజున శ్రీరామచంద్రుని చేతిలో రావణుడు నిహతుడయ్యాడు.**

**భారతేతిహాసంలోను ఎన్నో ముఖ్యఘటనలు ఫాల్గున మాసంలో సంభవించాయి. ధర్మరాజు ఫాల్గున బహుళ అష్టమి నాడు, భీమసేనుడు ఫాల్గున శుద్ధ త్రయోదశి రోజున జన్మించారు. దుర్యోధన, దుశ్శాసనులు జన్మించిందికూడా ఈ మాసంలోనే!**



పరులకోసం జీవించేవారే నిజంగా జీవించేవారు

ఆచరించి, విష్ణుదేవుడికి క్షీరాన్నం నివేదిస్తే అభీష్టసిద్ధి కలుగుతోందని భాగవతపురాణం వివరిస్తోంది.

ఆదితి పయోవ్రతం ఆచరించి, వామనుణ్ణి పుత్రుడిగా పొందింది. ఫాల్గునంలో గోదానం, ధనదానం, వస్త్రదానం, గోవిందుడికి ప్రీతి కలిగిస్తాయని శాస్త్రవచనం. చైత్రాదిమాసాల క్రమంలో చిట్టచివరిది ఫాల్గునం.

ఇంతకు ముందు పదకొండునెలల్లో చేసిన దేవతాపూజలు, వ్రతాలు ఈ చివరిమాసంలో ఇంకోసారి కనిపించడం విశేషం. సర్వ దేవతావ్రతసమాహారంగా, సర్వవ్రత సింహావలోకనంగా ఇది కనిపిస్తుంది.

వసంతపంచమి నుంచి ఫాల్గున పూర్ణిమవరకు ప్రకృతి రోజుకో రంగును సంతరించుకుంటుంది. చిలుకలు వాలిన జామచెట్టులా ఉండే ప్రకతి పంచవన్నెల రామచిలకలా కనువిందు చేస్తుంది. చలి పూర్తిగా తగ్గదు. నులి వెచ్చదనం ప్రాణానికి హాయి కలిగిస్తుంటుంది. ఫాల్గున బహుళపాడ్యమినాడే రావణుడితో యుద్ధానికి వానరసైన్యాన్ని వెంట బెట్టుకొని, శ్రీరాముడు లంకకు వెళ్లాడు. ఫాల్గున బహుళ ఏకాదశినాడు రావణ కుమారుడు ఇంద్ర జిత్తు, లక్ష్మణుడు మధ్య ప్రారంభమైన సమరం త్రయోదశి దాకా కొనసాగింది. రావణబ్రహ్మను శ్రీరాముడు అమావాస్య రోజు వధించాడు. అంతేకాదు కురుపాండవుల్లో కొందరు ఫాల్గున మాసంలో జన్మించినట్లు చెబుతారు.

పాలకడలినుంచి లక్ష్మీదేవి ఇదే మాసంలో జన్మించారు. ఇక అర్జునుడి జన్మనక్షత్రంకూడా ఇదే కాబట్టి 'ఫల్గున' అనే పేరుంది. ఫాల్గున బహుళఅష్టమినాడు ధర్మరాజు, ఫాల్గున శుద్ధత్రయోదశి రోజున భీముడు, దుర్యోధనుడు, దుశ్శాసనులు జన్మించినట్లు పురాణాలు తెలుపుతున్నాయి.

శ్రీమహావిష్ణువుకు ఇష్టమైన మాసాల్లో ఫాల్గునం ఒకటి. పూర్ణిమ తిథిలో చంద్రుడు పూర్వఫల్గుని లేదా ఉత్తరఫల్గుని నక్షత్రసమీపంలో సంచరిస్తే, ఆ మాసాన్ని 'ఫాల్గుని'గా పరిగణిస్తారు. గోవిందవ్రతాలను విరివిగా చేస్తుంటారు. విష్ణుపూజకు 'పయోవ్రతం' విశిష్టమైంది. దీన్ని శుద్ధ పాడ్యమినాడు ప్రారంభించి, పన్నెండు రోజుల పాటు కొనసాగిస్తారు. సమీపంలోని నదుల్లో స్నానమాచరించి, సూర్యుడికి అర్ఘ్యమిచ్చి, విష్ణువును షోడశోపచారాలతో పూజించి, పాలను నైవేద్యంగా సమర్పించడం సంప్ర దాయం. పయస్సు అంటే పాలు. అదితికి ఈ వ్రతఫలితంవల్లే వామనుడు జన్మించాడట! లక్ష్మీనారాయణులు, పార్వతీపరమేశ్వరుల్ని శుద్ధతదియ నాడు పూజించి నైవేద్యం సమర్పిస్తారు.



## చేయవలసిన దానాలు

**ఈ మాసంలో బ్రాహ్మణులకు వస్త్రాలు, పుస్తకాలు, వివిధ ధాన్యాలు దానం చేయాలి. శక్తికొలది విష్ణు ప్రతిమలు దానం చేయడంవల్ల మోక్షసిద్ధి కలుగుతుంది. ఈ మాసంలో చేసే గోదానం, ధాన్య దానం, వస్త్రదానం గోవిందునికి ప్రీతికలిస్తాయని ధార్మికవచనం.**

ఈ మాసంలో రెండు రోజులు వినాయకుణ్ణి ఆరాధిస్తారు. కాశీ, దాక్షారామాలలో వెలసిన డుండి గణపతికి సంబంధించినపూజ ఇది. శుక్లపాడ్యమి, చతుర్థినాడు అవిఘ్న, పుత్ర గణపతి వ్రతాల్ని ఆచరి స్తారు. శుద్ధద్వాదశి పయోవ్రతానికి చివరిరోజు. ఈ రోజున నరసింహస్వామిని పూజిస్తారు.

ఫాల్గునమాసంలో ప్రతితిథికీ ఒక ప్రత్యేకత ఉంది. చవితినాడు 'సంకటగణేశ' వ్రతం ఆచరి స్తారు. బహుళ అష్టమినాడు సీతాదేవి భూమి నుంచి ఆవిర్భవించింది. అందుకే ఆ రోజున రామాయణాన్ని చదివి, సీతారాముల్ని కొలుస్తారు. బహుళ అమా వాస్యనాడు పితృదేవతలకు పిండప్రదానం చేసి, అన్నదానం చేస్తారు.



# అభిషేకప్రియుడు..

– డా॥ నిష్ఠల సుబ్రహ్మణ్యశాస్త్రి

దేవతలను సంతృప్తిపరచడం ద్వారా వారి అనుగ్రహం కలిగి, మానవులకు కష్టాలు తీరడమే కాక, సుఖశాంతులు కలుగుతాయనేది నిర్వివాదాంశం. పూజలద్వారా దేవతల అనుగ్రహం పొందవచ్చు.

పాద్యం, అర్ఘ్యం, ఆచమనీయం, ఆసనం, స్నానం, గంధం, పుష్పం, ధూపం, దీపం, నైవేద్యం, తాంబూలం, నీరాజనం, స్తోత్రం... మొదలైనవన్నీ పూజలో భాగాలే. పూజించటానికి ముందు దైవాన్ని ఆవాహన చేయడం ఉంటుంది.

ఇంకా, యజ్ఞోపవీతం, వస్త్రం, ఛత్రం, చామరం, నృత్యం, గీతం, ఆందోళిక మొదలైనవాటినికూడా పెద్దపూజలలో చేర్చుకోవచ్చు. సంగ్రహంగా అయితే పంచోపచారాలతో పూజ ఉంటుంది. షోడశోపచారాలతో పెద్దపూజ. ప్రతి పూజలోను దేవునికి స్నానం ఉంటుంది. దీన్నే స్వామికి చేసే 'అభిషేకం' అంటారు.

ఒక్కొక్క దేవునికి ఒక్కొక్క ప్రక్రియ ఇష్టంగా ఉంటుంది. పూజలో అన్నీ ఉన్నా వారికిష్టమైన ప్రక్రియ ద్వారా ఆరాధిస్తే త్వరలో భక్తులను అనుగ్రహిస్తారు. సాధారణంగా దేవతలందరూ "స్తుతిప్రియా వైదేవాః" అనే వచనంద్వారా స్తోత్రాలు చదివితే అనుగ్రహిస్తారు. కాగా "నమస్కారప్రియస్సూర్యః" అని సూర్యుడు నమస్కారాల ద్వారా అనుగ్రహిస్తాడు. అలంకారాలద్వారా విష్ణువు, పూజద్వారా అమ్మవారు, తర్పణాలవల్ల విఘ్నేశ్వరుడు అనుగ్రహిస్తారు. ఈశ్వరుడు అభిషేకం ద్వారా ఎక్కువ అనుగ్రహిస్తాడు. కనుకనే **'అభిషేక ప్రియ శ్శమ్భుః'** అని ప్రసిద్ధి ఏర్పడింది.

108 కలశాలతో కూడా అభిషేకం చేయవచ్చు. జలంలో ఉండే దోషాలు ముందుగా పోగొట్టుకొని, అభిషేకం చేయడం శాస్త్రపద్ధతి. "వస్త్రపూతజలేనైవ అభిషేకం తు కారయేత్" అని శాస్త్రం. వస్త్రంలో వడగట్టిన నీటితో అభిషేకం చేయాలి. ఇంకా అభిషేకం చేసే జలంలో దోషం పోగొట్టడానికి తార్క్ష్యముద్రతో మృత్యుంజయమంత్రాలు ప్రయోగించి, అమృతీకరణం అనే ప్రక్రియ ద్వారా అమృతంగా మార్చి, అభిషేకం చేయడం శాస్త్రపద్ధతి.

ప్రతినెలలోనూ బహుళచతుర్దశి మాసశివరాత్రి. ఈ రోజులలో అభిషేకం గొప్పది. అయితే మాఘమాసంలో బహుళ చతుర్దశి మహాశివరాత్రి. ఈనాడు శివాభిషేకం ఇంకా ఇంకా గొప్పది. నమకచమకాలతో, మన్యుసూక్తంతో, పాశుపత మంత్రాలతో లేదా పురుషసూక్తంతో అభిషేకం చేయవచ్చు



జీవితంలో సర్వస్వం కోల్పోయినా, ఒకటి మాత్రం మిగిలి ఉంటుంది అదే భవిష్యత్తు

లేదా శివమంత్రాలతో చేయవచ్చు. సామాన్యులు శివనామాలతో చేయవచ్చు. సామాన్యులైనా, పండితులైనా ఎవరైనా సరే భక్తితో అభిషేకం చేస్తే చాలు. అయితే భక్తిశ్రద్ధలుండాలి. బోళాశంకరుడు అందరినీ అనుగ్రహిస్తాడు. అభిషేకానికి ఎన్ని కడవలనీరు వాడాలనే విషయంలో ఆగమాలు కొన్ని నియమాలు చెబుతున్నాయి.

## అభిషేకాలు - ఫలాలు

ఏ ద్రవ్యంతో అభిషేకం చేస్తే ఏ ఫలం కలుగుతుందో శాస్త్రాలు చెప్పాయి. ఆవుపాలతో అన్ని సౌఖ్యాలు కలుగుతాయి. ఆవుపెరుగుతో ఆరోగ్యం కలుగుతుంది. ఆవునేయి ఐశ్వర్యాన్ని, పంచదార దుఃఖనాశాన్ని కలుగజేస్తాయి. తేనె వల్ల తేజస్సు పెరుగుతుంది, చెఱకురసం వల్ల ధనవృద్ధి, కొబ్బరినీటితో అభిషేకంవల్ల సంపదలు పెరగటం, విభూతి వల్ల పాపనాశము, పన్నీరువల్ల పుత్రలాభం, పుష్పోదకం వల్ల భూలాభం, బిల్వజలంవల్ల భోగభాగ్యాలు, నువ్వుల నూనెవల్ల అపమృత్యుదోషాలు నివారింపబడటం, సువర్ణోదకం వల్ల పేదరికంపోవడం, ద్రాక్షరసంవల్ల పనులు నెరవేరడం, ధన లాభం, ఖర్జూరజలంవల్ల సుఖజీవనం, శత్రుహాని, మోక్షం, నేరేడుపండ్లరసం వల్ల సకలకార్యాలలో జయం, కస్తూరీ జలం వల్ల శత్రుభయాలు పోవడం, మామిడిపండ్లరసంవల్ల గృహలాభం, నవరత్నజలం వల్ల రాజ్యం, సుగంధ జలం వల్ల పుత్రలాభం, దూర్వోదకం అనగా గరికనీటి వల్ల పోయిన సొమ్ము లాభించడం, రుద్రాక్షజలంవల్ల గొప్ప ఐశ్వర్యం. అన్నం వల్ల రాజ్యం, ఆయుర్దాయం, సుఖజీవనం, మోక్షం కలుగుతాయి.

### అభిషేకం ఎందుకు?

**ఈశ్వరుడు అభిషేకం వల్ల**
**ఎక్కువ ప్రీతి చెందుతాడని**
**ప్రారంభంలో చెప్పుకున్నాం కదా!**
**పాలకడలిని దేవదానవులు చిలికినప్పుడు**
**వచ్చిన హాలాహలాన్ని ఈశ్వరుడు మింగి,**
**లోకాలను కాపాడి మహాదేవుడయ్యాడు.**

**ఆ తాపం శమించడానికి అభిషేకం చేయాలి.**
**మహాశివరాత్రినాడు**
**'హర హర శంభో మహాదేవ'**
**అంటూ అభిషేకాలలో పాల్గొని,**
**శివునిఅనుగ్రహం పొందుదాం.**

అయితే, నేరేడుపండ్లరసంవల్ల వైరాగ్యం లభిస్తుందని, కస్తూరీజలంవల్ల చక్రవర్తిత్వం, మామిడిపండ్లరసం వల్ల దీర్ఘవ్యాధినివారణం అని మరికొన్ని గ్రంథాలలో ఉంది. పసుపు నీటివల్ల సౌభాగ్యాలు, మంగళాలు లభిస్తాయని... రుద్ర కామ్యార్చనావిధిలో చెప్పబడ్డాయి. సాధారణంగా పాలు, పెరుగు, నేయి, తేనె, పంచదార కలిపి పంచామృతం చేసి, అభిషేకం చేస్తే 'పంచామృతాభిషేకం' అవుతుంది. ఇంకా అక్షతలజలంతో, బంగారంనీటితో, శంఖోదకం, ఫలోదకాలతో కూడా అభిషేకాలు చెప్పబడ్డాయి.



బాలప్రబోధం

# పట్టుదల ఉంటే.. కానిది లేదు!

- ఆచార్య కోలవెన్ను మలయవాసిని,
73311 41505

భారతదేశంలోని నదులలో గంగానది అన్నిటా గొప్పది. 'గంగాస్నానం - తుంగాపానం' అన్నారు. అంటే గంగానదిలో స్నానం, తుంగానదిలో నీళ్లు త్రాగడం ఎంతో పుణ్యమన్న మాట! 'హిందువులు గంగానదిని గంగామాతగా, పుణ్యమూర్తిగా భావిస్తారు.

గంగాదేవి సాక్షాత్తు విష్ణువుపాదాలనుండి పుట్టిందని మనపురాణాలు చెప్తున్నాయి. మనం విష్ణ్వాలయానికి వెళ్లినప్పుడు తీర్థం ఇస్తూ- పూజారి 'శ్రీవిష్ణుపాదోదకం పావనం శుభం' అంటూ ఇవ్వడం వింటూ ఉంటాం. దాని అర్థం ఈ నీరు విష్ణుమూర్తి పాదములనుండి పుట్టినది అని అసలు గంగ అంటే నీరు అనే అర్థంకూడా ఉంది.

గంగానదికి భాగీరథి, జాహ్నవి అనే రెండు ప్రసిద్ధమైన పేర్లు ఉన్నాయి. గంగ శివునిజటాజూటంలో ఉండడానికి, గంగానదికి భాగీరథి అని పేరు రావడానికి కారణమయిన సంఘటన ఒకటి ఉంది.

అసలు మొదట్లో గంగానది స్వర్గలోకంలోమాత్రమే ఉండేది. అది భగీరథుడనే రాజుకోరిక మీద భూలోకానికి వచ్చింది. అయితే అది స్వర్గలోకంనుండి తిన్నగా భూలోకానికి రాలేదు. మధ్యలో కొన్ని మజిలీలు చేసింది. మొదటి మజిలీ శివునిశిరస్సన్నమాట.

ముందు గంగానది స్వర్గాన్ని విడిచి ఎందుకు రావలసివచ్చిందో తెలుసుకుందాము.

సగరుడనే చక్రవర్తి ఉండేవాడు. అతనికి వేలకొలది పుత్రులు. ఆ సగరుడొకసారి అశ్వమేధయాగం తలపెట్టాడు. అశ్వాన్ని దేశంమీదకు వదిలాడు. అది దేశమంతటా తిరిగి పాతాళలోకంలో కపిలుడనే మహర్షి తపస్సు చేసుకునే చోటికి వచ్చి ఆగింది. యాగాశ్వం ఎప్పటికీ తిరిగి రాకపోయేసరికి సగరునిపుత్రులు సాయుధులై గుర్రాన్ని వెతకడానికి బయలు చేరారు. వెతికి వెతికి చివరికి కపిలుడి చెంత ఈ అశ్వాన్ని చూశారు.

"మునీశ్వరుడవు కదా? నీకు గుఱ్ఱం కావలసి వచ్చిందా? దొంగమునీ!" అంటూ హేళన చేశారు. ఆ హేళనకు కపిలమహర్షి మండిపడి చూచేసరికి సగర పుత్రులందరూ భస్మమై అక్కడే పాతాళలోకంలో పడిపోయారు.

ఈ సంగతి తెలిసి సగరుడెంతో విచారించాడు. అకాలమరణమే కాకుండా తనపుత్రులు ఇలా నరకంకూడా పొందేసరికి సగరుడికి ఎక్కడలేని దుఃఖం వచ్చింది. తన పుత్రులకు స్వర్గం రావాలంటే ఏం చెయ్యాలి? అని ఋషులతో ఆలోచించగా స్వర్గలోకంలోని గంగానదిని నీ పుత్రుల భస్మం మీదుగా ప్రవహించేలా చేస్తే మోక్షం కలుగుతుంది అని చెప్పారు. సగరుని వంశస్థులు కొందరు ప్రయత్నం చేశారు. కానీ గంగానదిని స్వర్గం నుంచి పాతాళలోకానికి తేవడమంటే మాటలా? వాళ్ళవల్ల కాలేదు.

కొంతకాలం గడిచింది. సగరుడికి మునిమనుమడుగా భగీరథుడు పుట్టాడు. యుక్తవయస్సు రాగానే తన తాతల సంగతి తెలుసుకున్నాడు. గంగానదిని పాతాళలోకానికి తేవాలని పట్టుబట్టాడు.

దీక్షతో గంగను గురించి తపస్సుచేసాడు. ఎన్నో సంవత్సరాలు తపస్సు చేయగా చేయగా గంగాదేవి ప్రత్యక్షమయింది. కానీ నేరుగా పాతాళానికి రావడానికి ఒప్పుకోలేదు. నన్ను, నా ప్రవాహవేగాన్ని ఆపాలంటే శివుడికే సాధ్యం. కాబట్టి నువ్వు శివుణ్ణిగురించి తపస్సు చెయ్యి. నన్ను శివుడు ధరించడానికి ఒప్పించు. అప్పుడు నేను నీతో కూడా వస్తానన్నది.

భగీరథుడు సరే అని శివుణ్ణిగూర్చి బహుకాలం తపస్సు చేశాడు. శివుడు ప్రసన్నుడై భగీరథుని కోరిక విని గంగను తన శిరస్సున ధరించడానికి ఒప్పుకున్నాడు.



ఆశగలవాడు ధనవంతుడైనా దరిద్రుడే

అప్పుడు భగీరథుడు మళ్లీ గంగను ప్రార్థించాడు. ఆమె అతి వేగంతో స్వర్గలోకంనుండి- అంటే ఆకాశంనుండి శివునిశిరస్సుమీదికి దూకింది. శివుడు ఆ వేగానికి తట్టుకుని ఆమెను తనజడలలో ముడివేసి ఒక్కపాయ మాత్రం హిమాలయం మీద వదిలాడు. అక్కడనుండి ఆమె భూమికి ప్రవహించి, ఆ తరువాత భోగవతి అనే పేరుతో పాతాళలోకానికి చేరింది. అక్కడి సగరపుత్రులభస్మంమీద ప్రవహించి, వారికి మోక్షాన్నిచ్చింది.



ఇలా, భగీరథుడు తపస్సుచేసి సాధించాడు కనుకనే గంగకు **"భాగీరథి"** అనే పేరు వచ్చింది. గంగను పాతాళలోకానికి తీసుకురావడానికి భగీరథుడు పెద్దప్రయత్నం చేశాడు.

ముందు గంగనుగురించి తపస్సు చేశాడు. ఆ తరువాత గంగ చెప్పగా, కొంతకాలం శివుణ్ణిగురించి తపస్సు చేసి, శివుణ్ణి మెప్పించాడు. మళ్ళీ గంగను ప్రార్థించాడు. చివరికి ఎలాగయితేనేం గంగానదిని భూలోకానికి తెచ్చి, అక్కడనుండి పాతాళలోకానికి తీసుకువెళ్ళాడు. అందుకే ఎవరయినా ఒక పనికోసం అతికష్టపడి ప్రయత్నం చేస్తుంటే 'వాడు భగీరథప్రయత్నం చేస్తున్నాడురా'! అంటారు.

## తిరుమలలో భక్తులు చేయకూడనివి

- ☒ తిరుమలయాత్రలో మనస్సును ఇతర విషయాలపై లగ్నం చేయకండి.
- ☒ ఆచారవ్యవహారాలప్రకారం ఆలయార్హత లేని సందర్భాలలో ఆలయంలోకి రాకండి.
- ☒ తిరుమలగిరులలోని విరులన్నీ శ్రీవారిసేవకే!
- ☒ శ్రీవారిదర్శనంకోసం త్వరపడకండి. క్యూలో మీవంతు వచ్చేవరకు ఆగండి.
- ☒ అన్నప్రసాదాల్ని వృథా చేయకండి.
- ☒ విలువైనఆభరణాలు, ఎక్కువడబ్బు మీవద్ద ఉంచుకోకండి.
- ☒ నీరు, విద్యుత్తు వృథా చేయకండి.
- ☒ అపరిచితులను వసతిగృహాలలోకి అనుమతించకండి, వారిని నమ్మి, గదితాళాలు ఇవ్వకండి.
- ☒ నాలుగుమాడవీథుల్లో పాదరక్షలు ధరించకండి.

# శ్రీకాళహస్తి వైభవం

- శ్రీ ఆముదాల మురళి, 94404 32683

సీ॥ దక్షిణామూర్తియై తనరారు నొకపరి
శ్రీహయగ్రీవుడై చెలగు నొకట
శారదామాతయై సాక్షాత్కరించును
గణపతిదేవుడై కానవచ్చు
శ్రీచక్రరూపమై చెన్నొందు నొకచోట
గాయత్రిదేవియై ఘనతఁ గాంచు
వేదస్వరూపమై విలసిల్లు నొకయెడ
ఉపనిషత్సారమై యుండు నొకట

తే.గీ॥ సకలమూర్తుల సారమౌ సాంబమూర్తి
తన నిరాకార సాకార తత్త్వములను
వాయులింగంబుగా జూపి భక్తతతుల
నాదుకొనుచుండు శ్రీకాళహస్తివిభుడు. 1

చం॥ చెలది యొకండు తంతువులఁ జెసెను మంటప గోపురాళి కో
వెలలను దాని ప్రేమఁ గనవే దహనం బొనరించినావు దీ
పులనిడు దీపవహ్ని నిడి, పూర్ణనిరాశను నూర్ణనాభి కీ
లల వెలయించు దీపమును లావున మ్రింగెదు నంతఁబోవవే. 2

మహాస్రగ్ధర
మునివిశ్వామిత్రశాపంబున సుతశతమున్ బోవ దుఃఖంబు తోడన్
తన ప్రాణత్యాగనిష్ఠాతతమతి యతిమూర్ధన్యుడౌ యా వశిష్ఠున్
నినుసేవింపంగ బంచెన్ నియతి ధరణియే నిర్వృతిన్ బొందగా నా
ముని కాంక్షావాప్తికై యీ భువి వెలసిన శంభో! మమున్ బ్రోవవయ్యా! 3

## వాయులింగ వైశిష్ట్యం

దక్షిణకైలాసంగా, దక్షిణకాశిగా వాసిగాంచిన శ్రీకాళహస్తిలో పూర్వం వశిష్ఠమహాముని, తన పుత్రశోకాన్ని తొలగించు కోవడానికి నిశ్చలభక్తితో తపస్సు చేశాడు. ఆ మహర్షి తపస్సుకు మెచ్చి పరమేశ్వరుడు కైలాసంనుండి దిగివచ్చి ప్రత్యక్షమైనాడు.

పంచభూత, పంచేంద్రియ, పంచకోశాది, పంచవర్గప్రాయ పంచముఖాలతో పశ్చిమాభిముఖుడై లింగాకారమై నిలిచిన ఆ పరమశివుణ్ణి దర్శించి, వశిష్ఠుడు పుత్రశోకం తొలగిపోయి, నమస్కరించాడు. పరమశివుని ఆజ్ఞపై వశిష్ఠుడు బ్రహ్మోపదేశం చేయమని కోరాడు. అప్పుడు ఆ మహాలింగంలోంచి దక్షిణామూర్తిరూపుడై కైలాసపతి వెలువడి, వశిష్ఠునికి బ్రహ్మోపదేశం చేశాడు.

ఆనాటినుండి, భక్తకోటిని అనుగ్రహించడానికి పంచముఖ నాగలింగాకృతిలో స్వయంభువుడై పరమేశ్వరుడు దక్షిణకైలాస గిరిలో వెలశాడు. బ్రహ్మదేవుడు కూడ ఈ నాగలింగాన్ని పూజించి, తరించాడని పురాణకథనం.

దక్షిణ భారతదేశంలోని పంచభూతలింగాలలో, శ్రీకాళహస్తీశ్వరుడు వాయులింగంగా ప్రసిద్ధి పొందాడు. ఒక ప్రళయం తర్వాత, వాయుదేవుడు శ్రీకాళహస్తిలోని పరమశివుని దర్శించి, పచ్చకర్పూరతీర్థంతో అభిషేకించాడు. ఆనాటినుండి





మమకారం మల్లెతీగె, అహంకారం కందిరీగ

ఆ శివలింగం వాయులింగంగా విశ్వవిఖ్యాతమైంది. గర్భ గుడిలో గాలి చొరనిచోటులో అఖండదీపం చలిస్తూ, పరమశివుని సేవిస్తూ ఉండడం ఈ దక్షిణకాశీవిశిష్టత.

## శివుని ఆజ్ఞలేనిదే చీమైనా కుట్టదు

భగవంతుడు మనకు మానవజన్మ ఎందుకిచ్చాడో తెలుసు కుంటే ఈ సందేహానికి జవాబు లభిస్తుంది. మానవుడు గత జన్మల్లో చేసుకున్న కర్మఫలాన్ని అనుభవించడానికే ఈ జన్మ ఎత్తుతాడు. కర్మానుభవం పూర్తి చేసుకుని మరలా సృష్టికర్త అయిన భగవంతుడి దగ్గరికే చేరుకుంటాడు.

ఇక్కడ తెలుసుకోవలసిన విశేషం ఏమంటే, మనం చేసే కర్మలకు ఫలాలు ఇచ్చేవాడు భగవంతుడే! అందుకే శివుడి ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదన్నారు.



మనం చేసుకున్న కర్మఫలాలను వివిధరకాల జన్మ లకు కేటాయించేదీ భగవంతుడే! మన కర్మానుభవం పూర్తి చేసుకోవడానికి జన్మ ఎత్తి, ఆ జన్మలో మరికొన్ని పాపాలు, పుణ్యాలుచేసి, మరింతగా ఈ జననమరణచక్రంలో కూరుకు పోతుంటాం.

మాధవసేవగా, సర్వప్రాణికోటి సేవచేస్తూ, ధర్మయుక్తంగా అర్థాన్ని, కామాన్ని పొంది, భగవంతునికి శరణాగతి చేస్తే, భగవంతుడే మన ప్రారబ్ధాన్ని సుఖప్రారబ్ధంగా మార్చి, మనల్ని కడతేరుస్తాడు. ఇదే ఏ మానవుడైనా కోరుకోవలసింది.

## మారేడు చెట్టు, మారేడు పత్రి విశిష్టత

మహాలక్ష్మికి 'బిల్వ నిలయా' అని నామముంది. అందుకే మారేడును 'శ్రీఫలా' అని కూడా పిలుస్తారు. బిల్వపత్రాలతో పూజ శివునికి ప్రీతికరం. శ్రీమహాలక్ష్మి తపఃఫలంగా ఆమె కుడిహస్తం నుండి బిల్వవృక్షం అవతరించి 'శ్రీఫలా' అని పిలువ బడింది. వైఖానస, పాంచరాత్రాగమ సంహితల్లో బిల్వపత్రం కూడా పేర్కొనబడింది.



వేదకాలం నుండే దేవతలచే పూజింపబడుతూ మారేడు చెట్టు శ్రీవృక్షమని పేరు పొందింది. త్రిగుణరూపాలైన త్రిదళా లతో త్రిమూర్తులకు ప్రీతిపాత్రమై 'వేదత్రయీ' అని బిల్వవృక్షం ప్రసిద్ధి పొందింది. దేవతలు దీన్ని మక్కువతో నందనవనానికి తీసుకు వెళ్లారట. బిల్వం జ్ఞానప్రదమని, ఐశ్వర్యదాయకమని పురాణసూక్తి.

మూడుదళాలుగల మారేడుఆకులు మంచివాసన కలిగి ఉంటాయి. అయితే, ఈ చెట్టుకు పొడవైన ముళ్లుంటాయి. ఈ దేవవృక్షాన్ని సాధారణంగా ఆలయాలలో పెంచుతారు. శ్రీసూక్తంలో కూడ బిల్వవృక్ష ప్రస్తావన ఉంది.

మారేడుచెట్టులో ఔషధంగా ఉపయోగపడని వస్తువు లేదు. దీని వేరు ఆకలిని, జీర్ణశక్తిని వృద్ధి చేస్తుంది. ఆకులు మధుమేహాన్ని తగ్గిస్తాయి. తులసిలాగా మారేడుదళాలను కూడా, అవి లభ్యం కాని రోజున, ఆ ముందు రోజు నిర్మాల్యాన్ని కడిగి, పూజలో వాడుకోవచ్చు.

# అన్నీ ఆమె... అంతటా ఆమె

– డా॥ కప్పగంతు రామకృష్ణ

ప్రపంచంలోని మరే ఇతర దేశం స్త్రీకి ఇవ్వని సమున్నత స్థానాన్ని మనదేశమే ఇచ్చింది. భారతమాత అంటూ జన్మనిచ్చిన భూమికి నమస్కరించే సంస్కారం కేవలం మనదేశంలోనే ఉంది. స్వాతంత్ర్య సంగ్రామంలో కూడా 'మాతృభూమి', 'వందే మాతరం'వంటి నినాదాలు ప్రజల్లో స్వేచ్ఛాప్రియత్వాన్ని కలి గించి, స్వాతంత్ర్యస్ఫూర్తిని రగిల్చాయి. కేవలం మనదేశంలోనే మహిళను 'అమ్మా' అని పిలిచే సంస్కారం ఉంది. పరిచయం లేని మహిళ ఎదురైతే, ఆమెతో మాట్లాడాల్సిన సందర్భం వస్తే 'ఏమ్మా' అంటూ సంబోధించే ఉత్తమగుణం ఈ మట్టిలో పుట్టిన ప్రతిమనిషికీ సహజంగా వస్తుంది.

వేదాలకు అధిష్ఠానదేవతగా గాయత్రీమాతను ఎంచు కున్న ఘనతకూడా మనకే దక్కుతుంది. అదొక్కటే కాదు.. ఈ దేశంలోని ప్రతి అణువులో మహిళాశక్తి ప్రకటితమవుతుంది. గంగ, గోదావరి, నర్మద, సరస్వతి, యమున...ఇలా ప్రతి నదికీ స్త్రీపేరు ఉంటుంది. కారణం... మనిషికి అత్యంత ప్రాణాధారమైనవాటిల్లో నీరు ఒకటి. నీరు లేకపోతే ప్రాణం నిలువదు. స్త్రీమూర్తి లేనిదే జీవితం లేదు. అందుకే నీటికి, స్త్రీకి సమానప్రాధాన్యం ఇచ్చారు– మనపూర్వీకులు. ఈ రెండూ లేనిదే మనిషి జీవనం సాగించలేదు. ఆ జీవితం పరిపూర్ణత్వాన్ని పొందలేదు. అందుకే, నదులన్నిటినీ స్త్రీమూర్తుల పేరుతో పిలవటం మనదేశంలో ఆచారంగా ఉంది.

గంగమ్మ తల్లి, కృష్ణమ్మ తల్లి అంటూ నదుల్ని తల్లిగా భావించి, నోరారా పిలిచే దృశ్యం కేవలం మనదేశంలోనే కనిపిస్తుంది. చివరకు పశుసంతతికి చెందిన ఆవును కూడా ఆవు అని పిలవకుండా 'గోమాత' అని గౌరవంగా పిలిచి, తల్లిగా పూజించటం; వేపచెట్టును గౌరీదేవిగా, లక్ష్మీదేవిగా అర్చించటంకూడా మనదేశంలోనే ఉంది. నీరు, నిప్పు... అన్నిట్లోనూ అమ్మను దర్శించగలిగిన సమున్నతజాతి మన భారతజాతి మాత్రమే.

భారతీయసంస్కృతికి పట్టుగొమ్మలుగా నిలుస్తున్న వేదాలు స్త్రీకి ఎంతో ప్రాధాన్యత ఇచ్చాయి. ఋగ్వేదం, యజుర్వేదం, అథర్వణ వేదాల్లోని అనేకమంత్రాలు స్త్రీ ఔన్న త్యాన్ని విశేషంగా ప్రశంసించటంతో పాటు మహిళల్ని ఎంతో గౌరవంగా చూడాలనే బాధ్యతను పురుషులకు నిర్దేశించాయి.

## తొలివరుసలో ఆమే...

ప్రాచీనకాలంనుంచి మనఆచార, సంప్రదాయాల్లో మహిళలకే తొలిస్థానం కల్పించింది భారతీయసంస్కృతి. భార్యాభర్తల పేర్లు పిలవాల్సి వచ్చినప్పుడు ముందుగా భార్యపేరు పిలవటం ఆనవాయితీగా వస్తోంది. దేవతలుకూడా ఇందుకు మినహాయింపు కాదు. లక్ష్మీనారాయణులు, జానకీరాముడు, పార్వతీ పరమేశ్వరులు, సీతారాములు, గౌరీశంకరులు, ఛాయా ఉషాసమేతసూర్యనారాయణస్వామి, వల్లీదేవసేనాసమేత సుబ్రహ్మ ణ్యేశ్వరుడు, అరుంధతీవశిష్ఠులు... ఇలా భార్యపేరు వచ్చిన తర్వాతనే భర్తపేరు వస్తుంది.

వేదాలతో సహా పురాణాలన్నీ స్త్రీని శక్తిస్వరూపంగా వర్ణించాయి. త్రిమూర్తుల కన్నా ఉత్తమస్థానంలో జగజ్జననిగా, పరాదేవతగా మహిళనే నిలిపాయి.

వేదాలుకూడా యజ్ఞాల్లో స్త్రీకి అగ్రతాంబూలం ఇచ్చాయి. యజ్ఞాల్లో యజమాని భార్య మాత్రమే అగ్నిప్రతిష్ఠాపన చెయ్యాలి. ఆమె అగ్ని వెలిగించిన తర్వాతనే మిగిలిన కార్యక్రమం కొనసాగుతుంది. ఇతరులెవ్వరికీ ఆ అధికారం లేదు. అలాగే, పూర్ణాహుతిలో కూడా యజమానురాలు తప్పనిసరిగా ఉండాలి. భార్యావిహీనుడికి యజ్ఞయాగాది కర్మలు చేసే అధికారాన్ని వేదాలు ఇవ్వలేదు.

అలాగే, కొత్త ఏడాది వచ్చాక జరిగే తొలి కల్యాణం సీతారామకల్యాణం. ఇక్కడ కూడా సీతారామకల్యాణం అన్నారే కానీ రామకల్యాణం అనలేదు. పార్వతీకల్యాణం, పద్మావతీ పరిణయోత్సవం... ఇలా అన్ని దేవతాకల్యాణాల్లోనూ 'ఆమె'కే తొలిస్థానాన్ని కల్పించాయి వైదికశాస్త్రనియమాలు. ఇప్పటికీ, దంపతులకు నూతనవస్త్రాలు ఇచ్చే సందర్భంలో ముందుగా భార్యకు పసుపు కుంకుమలు ఇచ్చిన తర్వాతనే భర్తకు వస్త్రాలు ఇస్తారు.



వ్యాజ్యాలు, వ్యాధులు ఎవ్వరికీ రాకూడదు

మనువుకూడా 'అర్థస్యసంగ్రహేచైనాం వ్యయేచైవ నియోజయేత్'- అంటూ ధనాన్ని జాగ్రత్త చెయ్యటం, ఖర్చు చెయ్యటంలో ఇంటి యజమానురాలికే మొదటి అధికారం ఇచ్చాడు.

పల్లెల్లో గ్రామదేవతల ఆచారం ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. పోలేరమ్మ, నాంచారమ్మ, తలుపులమ్మ, తిరుపతమ్మ, బతుకమ్మ... ఇలా వందలాదిగా గ్రామదేవతలు ఉన్నారు. వీరం దరూ స్త్రీమూర్తులే. చాలా కుటుంబాల్లో ఏ శుభకార్యం జరిగినా తొలిపూజగ్రామదేవతకే చేస్తారు. వానలు పడకపోయినా గ్రామదేవతకే మొక్కులు చెల్లిస్తారు. అంటే, ఏ కష్టంవచ్చినా మనిషిని ఆదుకునేది మహిళలే అన్న విషయం స్పష్టమవుతోంది.

## మనుస్మృతిలోనూ పెద్దపీట

పదిమంది ఉపాధ్యాయులకంటే ఒక ఆచార్యుడు, వంద మందిఆచార్యులకంటే తండ్రి, వెయ్యిమందితండ్రులకంటే తల్లి పూజనీయురాలని మనుధర్మశాస్త్రం చెబుతుంది. మహిళకు ఇంతకన్నా గొప్పస్థానాన్ని మరే సంస్కృతీ ఇవ్వలేదనేంతగా మనుస్మృతి స్త్రీప్రాధ్యాన్యాన్ని వివరించింది. 'మాతృదేవో భవ' అంటూ తల్లికి తొలి నమస్కారం చేసిన తర్వాతనే 'పితృదేవో భవ' అంటూ తండ్రికి తర్వాతి నమస్కారం చెయ్యాలని ఉపనిషత్తులు చెప్పిన వాక్యాలుకూడా మనుధర్మశాస్త్రాన్ని సమర్థించాయి.

సమాజంలో అత్యున్నతస్థానం స్త్రీకి ఉంది. అది ఆమె హక్కు. పురుషుడు ఆమెను ప్రాధేయపడాలి. ఆమెను మహా రాణిలా చూసుకోవాలి. దైవంకన్నా గొప్పస్థానం ఇవ్వాలి. ఆమె సదా వందనీయురాలు. ఇంటా బయట, చదువైనా, వివాహ మైనా, ఆస్తిపంపకాలైనా, అధికారమైనా... అన్నింటా అగ్ర తాంబూలం ఇవ్వాల్సిందే అంటుంది- మనుస్మృతి.

'ఆమె'పై అధికారం చెలాయించే హక్కు పురుషుడికి ఎప్పటికీ లేదని, 'ఆమె'తో పురుషుడు ఏవిషయంలోనూ సాటి రాలేడని మనువు స్పష్టంగా చెప్పాడు. మనిషికి అర్థం, పర మార్థం స్త్రీవల్లే కలుగుతాయి. భార్యను మించిన స్నేహితులు భర్తకు మరొకరు లేరు. పురుషుడు స్త్రీ లేకుండా పరిపూర్ణ త్వాన్ని పొందలేడు. అతణ్ణి స్వీకరించటానికి సమ్మతించి, స్త్రీ అతనిఇంటికి భార్యగా వచ్చినప్పుడే పురుషుడికి పూర్ణత్వం సిద్ధిస్తుందంటాడు- మనువు. 'శ్రీ' (సంపద), 'స్త్రీ' (భార్య) లేని




ఇల్లు కాంతిహీనంగా ఉంటుంది. ఇది మనువు ఇచ్చిన సూచన రూపంలోని ఆదేశం. మార్గదర్శనం కూడా!

తన రక్షణకోసం మహిళ ఏనాడూ చింతించాల్సిన అవసరం లేకుండా మనువు చేసిన కట్టుదిట్టమైన ఏర్పాట్లు ఇందులో కనిపిస్తాయి. 'బాలికగా ఉన్నప్పుడు తండ్రి, యువతిగా ఉన్నప్పుడు భర్త, వార్ధక్యంలో ఉన్నప్పుడు కుమారుడు బాధ్యత తీసుకుని స్త్రీని సంరక్షించాల'నే అర్థం బోధపడుతుంది. మహిళ పూర్తి బాధ్యత పురుషుడికి అప్పగించాడు. ఇక్కడ మహిళపై బాధ్యతను పురుషుడు గుర్తించాలి తప్ప వారిపై ఉన్న అధికారాన్ని కాదు.

స్త్రీలు ఏవిధంగానూ దుఃఖానికి గురికాకూడదని మనువు చెప్పాడు. *'యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః' (3:56)*- ఎక్కడ స్త్రీలు పూజలందుకుంటారో అక్కడ దేవతలు ఉంటారంటూ దేవతల కన్నా స్త్రీలకే ఎక్కువ గౌరవాన్నిచ్చాడు.

ఎన్నో యుగాలనాడే మహిళకు సర్వోన్నతగౌరవం ఇచ్చిన మనసంస్కృతిని మనవారసత్వ సంపదగా కాపాడు కుందాం.

బాలప్రబోధం

# పలుకే బంగారం

- శ్రీ ఆర్.సి.కృష్ణ స్వామి రాజు, 9393662821

శిరుగురాజుపాలెం గ్రామపశువుల కాపర్లు అంజేరమ్మ కనుమగుండా పశువులను అడవికి తోలుకెళ్లేవారు. ఉదయం తోలుకెళ్లిన పశువులను సాయంకాలం దాకా అడవిలోని కొండల్లో గుట్టల్లో మేపుకొని వచ్చేవారు. కనుమ వేపచెట్టు కింద ఉన్న చిన్న గుడిసెలో ఒక అవ్వ ఉండేది.

పశువుల కాపరి గోస్వామి అడవికి వెళ్ళేటప్పుడు, అడవి నుంచి వచ్చేటప్పుడు అవ్వను నవ్వుతూ పలకరించేవాడు. బాగు న్నావా అవ్వా?, తిన్నావా అవ్వా?, ఆరోగ్యం బాగుందా అవ్వా? అని అడిగేవాడు. అవ్వ అన్నిటికీ 'ఊఁ' కొట్టి ఊరకుండేది. నెలలకొద్దీ అతడు అవ్వను పలకరించడం అలవాటైపోయింది. అతడి పలకరింపుకై అవ్వ ఎదురు చూసేది. అతడు అడవికి వెళ్లేటప్పుడు, అడవినుంచి వచ్చేటప్పుడు అన్ని పనులూ వదిలేసి, అతడిపలకరింపు అయనాక తన పనులు తాను చేసుకునేది.

అవ్వని గోస్వామి నిత్యం పలకరించడంపట్ల మిగతా పశువుల కాపర్లు హేళన చేసేవారు. మాటలతోటి మాన్యాలు సంపాదించవచ్చు, మన్ననలు పొందవచ్చు అని మా అమ్మమ్మ చెప్పింది నేను చేస్తున్నాను అని సమాధానమిచ్చేవాడు.


ఒక పౌర్ణిమనాడు గోస్వామి పశువులను మేపడానికి వెళ్తూ అవ్వను పలకరించి వెళ్ళాడు. అయితే సాయంత్రం మాత్రం తిరిగి రాలేదు. ఇతరపశువులకాపర్లు అందరూ అడవినుంచి వస్తున్నారు. కానీ, గోస్వామి జాడమాత్రం కాన రాలేదు. అడవినుంచి వచ్చినవారిని ఆరా తీస్తే వెనక వస్తు న్నాడేమోనని బదులిచ్చారు. గోస్వామి పలకరింపులకు అలవాటు పడిన అవ్వకు దిగులు, తెలియనిభయం పట్టుకుంది. చీకటి పడుతున్నప్పటికీ గోస్వామి కానీ, అతడిఆవులు కానీ తిరిగి రాకపోవడంపట్ల ఆందోళన చెందింది. కీడు శంకించిన ఆమె ఆఘమేఘాల మీద పరుగులు తీసి గోస్వామి అడవినుంచి తిరిగి రాలేదని ఊరి రచ్చ బండ వద్దకు వెళ్ళి చెప్పింది.

ఊర్లో వాళ్ళు గోస్వామికి ఏమయ్యిందో ఏమో అని పిల్లా జెల్లా, చిన్నా పెద్దా కలిసి కత్తులు కర్రలు మందులు లాంతరు దీపం తీసుకుని కొండవద్దకు పరుగులు తీశారు. కొండంతా కలియ తిరిగారు.

వెదకగా వెదకగా కొండ కింద ముళ్లపొదలవద్ద గోస్వామి ఆవులన్నీ గుమికూడి ఉండడం గమనించారు. దగ్గరికి వెళ్లి చూసిన గ్రామస్తులకు కొండనుంచి జారిపడి గాయాలై స్పృహ తప్పి పడి ఉన్న గోస్వామి కనిపించాడు. వెంటనే అతడి ముఖంపై కొన్ని నీళ్లు చల్లి, కొన్ని ఆకు పసర్లు గాయాలకు రాసి, కొన్ని మందులు తినిపించి గోస్వామికి స్పృహ వచ్చేట్లు చేశారు. ప్రాణగండం తప్పినందులకు సంతోషపడ్డారు.

అందరూ కలిసి అవ్వగుడిసె ముందు చేరారు. అవ్వ, గోస్వామి రోజూ ఒకరినొకరు పలకరించుకోవడం ద్వారానే గోస్వామి తమకు దక్కాడని అవ్వతో చెప్పారు. అవ్వ నవ్వి "చిట్టెడు వడ్లు వేస్తే బుట్టెడు పేలాలు అయినట్లు మనం ఒక చిరునవ్వు నవ్వితే అది వందలాది చిరునవ్వులకు దారితీస్తుంది. మంచిగా పలకరిస్తే లోకమంతా మంచిగా కనిపి స్తుంది. 'పలుకే బంగార'మని తెలుసు కోండి" అని హితవు పలికింది.

నోరు తెరిచి ఎదుటి వ్యక్తిని పలక రిస్తే మన సొత్తు ఏమీ పోదు, ఇంకా మంచే జరుగుతుంది అని గ్రహించారు. అవ్వ మాట బంగారు బాట అని చిరునవ్వులు చిందిస్తూ ఊరు వైపు నడిచారు.




తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుమల
శ్రీవారి తెప్పోత్సవం
2021 మార్చి 24 నుండి 28 వరకు



## శ్రీ లక్ష్మీ అష్టోత్తర శతనామావళిః

ఓం ప్రకృత్యై నమః
ఓం వికృత్యై నమః
ఓం విద్యాయై నమః
ఓం సర్వభూతహితప్రదాయై నమః
ఓం శ్రద్ధాయై నమః
ఓం విభూత్యై నమః
ఓం సురభ్యై నమః
ఓం పరమాత్మికాయై నమః
ఓం వాచే నమః
ఓం పద్మాలయాయై నమః 10

ఓం పద్మాయై నమః
ఓం శుచయే నమః
ఓం స్వాహాయై నమః
ఓం స్వధాయై నమః
ఓం సుధాయై నమః
ఓం ధన్యాయై నమః
ఓం హిరణ్మయ్యై నమః
ఓం లక్ష్మ్యై నమః
ఓం నిత్యపుష్టాయై నమః
ఓం విభావర్యై నమః 20

ఓం అదిత్యై నమః
ఓం దిత్యై నమః
ఓం దీప్తాయై నమః
ఓం వసుధాయై నమః
ఓం వసుధారిణ్యై నమః
ఓం కమలాయై నమః
ఓం కాంతాయై నమః
ఓం కామాయై నమః
ఓం క్షీరోదసంభవాయై నమః
ఓం అనుగ్రహపరాయై నమః 30

ఓం బుద్ధయే నమః
ఓం అనఘాయై నమః
ఓం హరివల్లభాయై నమః
ఓం అశోకాయై నమః
ఓం అమృతాయై నమః
ఓం దీప్తాయై నమః
ఓం లోకశోకవినాశిన్యై నమః
ఓం ధర్మనిలయాయై నమః
ఓం కరుణాయై నమః
ఓం లోకమాత్రే నమః 40

ఓం పద్మప్రియాయై నమః
ఓం పద్మహస్తాయై నమః
ఓం పద్మాక్ష్యై నమః
ఓం పద్మసుందర్యై నమః
ఓం పద్మోద్భవాయై నమః
ఓం పద్మముఖ్యై నమః
ఓం పద్మనాభప్రియాయై నమః
ఓం రమాయై నమః
ఓం పద్మమాలాధరాయై నమః
ఓం దేవ్యై నమః 50

ఓం పద్మిన్యై నమః
ఓం పద్మగంధిన్యై నమః
ఓం పుణ్యగంధాయై నమః
ఓం సుప్రసన్నాయై నమః
ఓం ప్రసాదాభిముఖ్యై నమః
ఓం ప్రభాయై నమః
ఓం చంద్రవదనాయై నమః
ఓం చంద్రాయై నమః
ఓం చంద్రసహోదర్యై నమః
ఓం చతుర్భుజాయై నమః 60

ఓం చంద్రరూపాయై నమః
ఓం ఇందిరాయై నమః
ఓం ఇందుశీతలాయై నమః
ఓం ఆహ్లోదజనన్యై నమః
ఓం పుష్ట్యై నమః
ఓం శివాయై నమః
ఓం శివకర్యై నమః
ఓం సత్యై నమః
ఓం విమలాయై నమః
ఓం విశ్వజనన్యై నమః 70

ఓం తుష్ట్యై నమః
ఓం దారిద్ర్యనాశిన్యై నమః
ఓం ప్రీతిపుష్కరిణ్యై నమః
ఓం శాంతాయై నమః
ఓం శుక్లమాల్యాంబరాయై నమః
ఓం శ్రియై నమః
ఓం భాస్కర్యై నమః
ఓం బిల్వనిలయాయై నమః
ఓం వరారోహాయై నమః
ఓం యశస్విన్యై నమః 80

ఓం వసుంధరాయై నమః
ఓం ఉదారాంగాయై నమః
ఓం హరిణ్యై నమః
ఓం హేమమాలిన్యై నమః
ఓం ధనధాన్యకర్యై నమః
ఓం సిద్ధయే నమః
ఓం స్త్రైణసౌమ్యాయై నమః
ఓం శుభప్రదాయై నమః
ఓం నృపవేశ్మగతానందాయై నమః
ఓం వరలక్ష్మ్యై నమః 90

ఓం వసుప్రదాయై నమః
ఓం శుభాయై నమః
ఓం హిరణ్యప్రాకారాయై నమః
ఓం సముద్రతనయాయై నమః
ఓం జయాయై నమః
ఓం మంగళాయై నమః
ఓం దేవ్యై నమః
ఓం విష్ణువక్షఃస్థలస్థితాయై నమః
ఓం విష్ణుపత్న్యై నమః
ఓం ప్రసన్నాక్ష్యై నమః 100

ఓం నారాయణసమాశ్రితాయై నమః
ఓం దారిద్ర్యధ్వంసిన్యై నమః
ఓం సర్వోపద్రవవారిణ్యై నమః
ఓం నవదుర్గాయై నమః
ఓం మహాకాళ్యై నమః
ఓం బ్రహ్మవిష్ణుశివాత్మికాయై నమః
ఓం త్రికాలజ్ఞానసంపన్నాయై నమః
ఓం భువనేశ్వర్యై నమః 108

శ్రీ లక్ష్మీ అష్టోత్తర శతనామావళి సమాప్తం.



13-02-2021న చెన్నై(తమిళనాడు), టి.నగర్‌లో తి.తి.దే. వారు శ్రీపద్మావతీ అమ్మవారి
నూతన ఆలయ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఇందులో శ్రీశ్రీశ్రీవిజయేంద్రసరస్వతిస్వామివారు,
తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ వై.వి.సుబ్బారెడ్డి మరియు
తి.తి.దే. కార్యనిర్వహణాధికారి డా॥ కే.ఎస్.జవహర్ రెడ్డి, ఐ.ఏ.ఎస్. గార్లు పాల్గొన్న దృశ్యం



22-02-2021న తమిళనాడులోని ఉకుందూర్ పేటలో తి.తి.దే. శ్రీవేంకటేశ్వరస్వామివారి
నూతన ఆలయనిర్మాణానికి భూమిపూజ నిర్వహించింది.
ఇందులో తమిళనాడు రాష్ట్రముఖ్యమంత్రి గౌ॥ శ్రీ ఈ.కె.పళనిస్వామి,
తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ వై.వి.సుబ్బారెడ్డి గార్లు పాల్గొన్న దృశ్యం



27-02-2021న పాలకమండలి ఎక్స్-అఫిషియో సభ్యురాలిగా ప్రమాణస్వీకారం చేసిన
ఆంధ్రప్రదేశ్ దేవదాయ మరియు ధర్మదాయ ప్రిన్సిపల్ సెక్రటరీ
డా॥ జి.వాణిమోహన్, ఐ.ఏ.ఎస్., గారికి స్వామివారి చిత్రపటాన్ని అందిస్తున్న
తి.తి.దే. అదనపు కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి గారు



16-02-2021 న పొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లాలో జరిగిన
వసంతపంచమి సరస్వతీపూజ వేడుకలో
తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ వై.వి.సుబ్బారెడ్డి
మరియు ఇతర అధికార్లు పాల్గొన్న దృశ్యం



తి.తి.దే. నిర్వహించనున్న కల్యాణమస్తు కార్యక్రమానికి 17-02-2021న జరిగిన
కల్యాణముహూర్తనిర్ణయ వేడుకలో తి.తి.దే. కార్యనిర్వహణాధికారి డా॥ కే.ఎస్.జవహర్ రెడ్డి, ఐ.ఏ.ఎస్. గారు,
తి.తి.దే. అదనపు కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి గారు, హిందూధర్మప్రచారపరిషత్తు కార్యదర్శి
డా॥ కె.రాజగోపాలన్ గారు మరియు ఆగమశాస్త్రపండితులు పాల్గొన్న దృశ్యం



11-02-2021న అలిపిరి (తిరుపతి) సమీపంలో ఉన్న శ్రీపురందరదాసు విగ్రహానికి
174 ఆరాధన మహోత్సవాన్ని పురస్కరించుకుని పుష్పాంజలిని సమర్పిస్తున్న
దాససాహిత్య ప్రాజెక్టు విశేషాధికారి శ్రీ పి.ఆర్. ఆనందతీర్థాచార్యులు
మరియు భజనమండలి సభ్యులు పాల్గొన్న దృశ్యం

# సురాసురార్చిత చరణా... మల్లికార్జునా!

– శ్రీమతి కె. విజయలక్ష్మి, 7013185538

మన దేవాలయాలు

"శ్రీశైలశిఖరం దృష్ట్వా పునర్జన్మ నవిద్యతే" అని శాస్త్ర వచనం. అంటే కేవలం శిఖరదర్శనం చేసుకున్నంతమాత్రాన్నే పునర్జన్మ లేకుండా చేసే దివ్యక్షేత్రం శ్రీశైలం. అలాంటి శ్రీశైలంలో పరమశివుడు "శ్రీమల్లికార్జునస్వామి" పేరుతో జ్యోతిర్లింగరూపుడుగా, శ్రీపార్వతీదేవి శ్రీభ్రమరాంబాదేవి పేరుతో అష్టాదశశక్తులలో ఒకరుగా కొలువుదీరి, ఆరాధనలందు కుంటూ ఉన్నారు.

కర్నూలు జిల్లాలో కర్నూలు పట్టణానికి సుమారు 180 కిలోమీటర్లదూరంలో సముద్రమట్టానికి 1500 అడుగుల ఎత్తులో పవిత్రకృష్ణానదీతీరంలో ఉంది. శ్రీశైలం ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటైన శ్రీమల్లికార్జునస్వామివారికి, అష్టాదశ శక్తుల్లో ఒకరైన శ్రీభ్రమరాంబాదేవివారికి నిలయం.

స్థలపురాణం ప్రకారం పూర్వం శిలాదుడనే మహర్షి ఉండేవాడు. శిలాదుడు శివభక్తుడు. సదా శివపూజలను చేస్తూ ధర్మవర్తనుడై జీవిస్తూ ఉండేవాడు. చాలాకాలం సంతానం కలుగకపోవడంతో శిలాదుడు శివుణ్ణి గురించి తపస్సు చేశాడు. శిలాదుని తపస్సును మెచ్చి శివుడు ప్రత్యక్షమై వరం కోరుకో మనగా– "శివభక్తి పరాయణులైన ఇద్దరుకుమారులను ప్రసా దించండి" అని శిలాదుడు వరం కోరాడు. శివుడు ప్రసా దించాడు.

తర్వాత కొంతకాలానికి శిలాద దంపతులకు ఇద్దరు కుమారులు జన్మించగా, వారికి నంది, పర్వతుడు అని పేర్లు పెట్టి, అల్లారుముద్దుగా పెంచసాగారు. వారికికూడా శిలాదుడి మాదిరిగానే చిన్నతనంనుంచే శివభక్తి అలవడింది. వారిద్దరూ పెరిగి పెద్దవారయ్యారు.

నంది తండ్రి అనుమతి పొంది అడవులకు వెళ్లి శివుణ్ణి గురించి తపస్సు చేశాడు. నంది తపస్సుకు మెచ్చి, ప్రత్యక్షమైన శివుడు వరం కోరుకోమనగా– "స్వామీ! మీరు నా పై నివసిం చాలి. నేను అన్నివేళలా మిమ్ములను నా తలపై మోసే భాగ్యాన్ని ప్రసాదించండి" అని నంది వరం కోరాడు.



శివుడు వరాన్ని ప్రసా దించడంతో నంది పర్వతరూపాన్ని పొందగా శివుడు ఆ పర్వతంపై కొలువుదీరాడు. అదే "మహానంది" క్షేత్రంగా చెప్పబడుతూ ఉంది.

నంది విషయం తెలుసుకున్న అతని సోదరుడు పర్వతుడుకూడా శివుణ్ణి గురించి తపస్సు చేశాడు. పర్వతుని తపస్సుకు మెచ్చుకుని శివుడు ప్రత్యక్షమై వరం కోరుకో మనగా– "స్వామీ! పర్వతరూపం దాల్చిన నా పైన ఎల్లవేళలా మీరు నివసించేలా, ఈ పర్వతశిఖరాన్ని దర్శించేవారికి పునర్జన్మ లేకుండా మోక్షం కలిగేలా వరం ప్రసాదిం చండి" అని పర్వతుడు కోరాడు.

శివుడు వరాన్ని ప్రసాదించాడు. వరం ఫలంగా పర్వతుడు ఎత్తైన పర్వతరూపాన్ని పొందగా, శివుడు పర్వతలింగంగా మారి ఆ పర్వతం పైనే కొలువుదీరినట్లు, ఆ పర్వతమే **'శ్రీశైలం'** అనీ, ఆ పర్వతలింగమే శ్రీమల్లికార్జునస్వామి అని స్థలపురాణం వెల్లడిస్తూ ఉంది.

కాగా, బ్రహ్మచే వరం పొందిన అరుణుడనే రాక్షసుడు దేవతలపై దండెత్తి వారిని జయించి లోకకంటకుడుగా మారితే, దేవతల ప్రార్థనలమేరకు పార్వతీదేవి భ్రమరరూపం ధరించి అరుణుడిని అంతమొందించి, శ్రీపర్వతంమీద అవతరించి శ్రీభ్రమరాంబదేవిగా పూజలందుకుంటూ ఉన్నట్లు స్థలపురాణ కథనం.

శ్రీశైలమహాక్షేత్రం ముప్పైఆమడలపొడవు, ముప్పై ఆమడలవెడల్పు విస్తరించివున్నట్లు పురాణాలు పేర్కొన్నాయి. స్కాందపురాణం శ్రీశైలాన్ని అష్టదళపద్మం అని వర్ణించింది. శ్రీశైలం పద్మంయొక్క కర్ణిక అనీ ఎనిమిదిదళాలు ద్వార, ఉప ద్వారాలు అని చెప్పబడుతూ ఉంది.


తూర్పున 'త్రిపురాంతకం', పశ్చిమాన 'అలంపురం', ఉత్తరాన 'ఉమామహేశ్వరం', దక్షిణాన 'సిద్ధవటాలు' శ్రీశైల క్షేత్రప్రధానద్వారాలుకాగా, ఈశాన్యంలో 'ఏలేశ్వరం', ఆగ్నేయంలో 'సోమశిల', నైఋతిలో 'పుష్పగిరి', వాయవ్యంలో 'సంగమేశ్వరం'లు ఉపద్వారాలుగా పేరుపొందాయి.

చుట్టూ నాలుగుగోపురాలతో కోటగోడల్లాంటి ఎత్తైన ప్రాకారంతో 2,79,300 చదరపు అడుగుల వైశాల్యం గల ప్రాంగణంలో ఆలయం ఉంది. ప్రధానగోపురమైన తూర్పు గోపురం ఐదుఅంతస్తులతో, ఐదుగోపుర కలశాలతో దర్శన మిస్తుంది. తూర్పుగోపుర ద్వారంగుండా ఆలయంలోనికి ప్రవేశి స్తూనే ప్రధానఆలయంచుట్టూ ఉపాలయాలు దర్శనమిస్తాయి. ప్రధానఆలయానికి ఎదురుగా ధ్వజస్తంభం ఉంది. ధ్వజ స్తంభం దాటగానే 'నందిమండపం' ఉంది. ఈ మండపంలోని నందికి "శనగల బసవన్న" అని పేరు. నందిమండపం దాట గానే వీరశిరోమండపం ఉంది.

అనంతరం ప్రధానఆలయం ముఖమండపం, అంతరా లయం, గర్భాలయాలను కలిగి ఉంది. ముఖమండపంలో స్వామివారికి ఎదురుగా నందీశ్వరుడు కొలువుదీరి ఉన్నాడు. ముఖమండపం నుంచి అంతరాలయంలోనికి వెళ్ళే ద్వారానికి ఎడమవైపున వినాయకుడు కొలువుదీరి ఉన్నాడు. ఈయనకు 'రత్నగర్భగణపతి' అని పేరు.

అంతరాలయం ద్వారానికి కుడివైపున శ్రీభద్రకాళీసమేత వీరభద్రస్వామివారు కొలువు దీరి ఉన్నారు. స్వామివారిని దర్శించుకుని బయటకు వచ్చిన భక్తులు ఈ స్వామివారిని దర్శించుకుంటారు. ఇంకా ముఖమండపంలో పంచలోహ నటరాజస్వామివారు, హుండీలు ఉన్నాయి.

ఇక ప్రధాన గర్భాలయంలోని రుద్రాక్ష మండపంమధ్య భాగంలో జ్యోతిర్లింగస్వరూపుడు అయిన శ్రీమల్లికార్జునస్వామి వారు లింగరూపంలో దర్శనమిస్తారు. శ్రీమల్లికార్జునలింగాన్ని ప్రతి ఒక్కరూ తాకి, లింగానికి తల ఆనించి నమస్కరించవచ్చు.







ద్వేషం వల్ల మనుషులు దూరమైతే, స్నేహం వల్ల అందరూ దగ్గరవుతారు

స్వామివారిఆలయప్రాంగణంనుంచి సోపానమార్గం ఎక్కగానే అమ్మవారిఆలయధ్వజస్తంభం, సింహమండపాలు దర్శనమిస్తాయి. అమ్మవారిఆలయప్రధానద్వారంపైన మూడు అంతస్తుల గోపురం దానిపైన మూడుగోపుర కలశాలు ప్రతిష్ఠింప బడి ఉన్నాయి. అమ్మవారిగోపురద్వారానికి ముందువైపు దక్షిణంగా సీతాదేవి ప్రతిష్ఠించిన సహస్రశివలింగం ఉంది. అమ్మవారిఆలయం- ప్రదక్షిణ మండపం, ముఖమండపం, గర్భాలయాలను కలిగి ఉంది. ప్రదక్షిణమండపంలోని స్తంభాలు సందర్శకులకు నయనానందాన్ని కలిగిస్తాయి. ముఖమండపంలో అమ్మవారిఎదురుగా శ్రీచక్రం దర్శనమిస్తుంది. దీన్ని ఆదిశంకరా చార్యులవారు ప్రతిష్ఠింపజేశారు.

ప్రధానగర్భాలయంలో శ్రీభ్రమరాంబాదేవి కొలువుదీరి ఉంది. ఉగ్రమూర్తి అయిన అమ్మవారు అలంకారంవల్ల శాంత మూర్తిగా దర్శనమిస్తుంది. స్థానకమూర్తి అయిన అమ్మవారు అష్టభుజాలను కలిగి- శూలం, ఖడ్గం, బాకు, చక్రం, గద, విల్లు, శంఖాలను చేతులలో ధరించి కుడివైపు భుజానికి అంబులపొదిని ధరించి ఎడమకాలితో మహిషాన్ని తొక్కిపట్టి దానిముఖాన్ని ఎడమహస్తంతో పైకిఎత్తి గట్టిగా పట్టుకుని, కుడి స్వహస్తంలోని శూలంతో పొడుస్తూ ఉన్నట్లుగా మూలరూపం ఉంటుంది. అయితే అలంకారంవల్ల ఇవేమి కనిపించవు. శాంతమూర్తిగా ఆశీనురాలైనట్లు దర్శనమిస్తుంది.



ఈ ప్రధానదైవాలతోపాటూ శ్రీశైలఆలయప్రాంగణం లోని ఉపాలయాల్లో అర్ధనారీశ్వరుడు, పాండవులు ప్రతిష్ఠించిన శివలింగాలు, నవబ్రహ్మలు ప్రతిష్ఠించిన శివలింగాలు, శ్రీవీర భద్రస్వామి, కుమారస్వామి, మల్లమ్మ, అక్కమహాదేవి, వృద్ధ మల్లికార్జునస్వామి, ఉమామహేశ్వరస్వామి, శ్రీరామప్రతిష్ఠిత సహస్రశివలింగం, శ్రీరాజరాజేశ్వరస్వాములతో పాటు త్రిఫల వృక్షం, అద్దాలమండపం, మల్లికాగుండం, మనోహరగుండం, సప్తమాతృకలు, నాగావళితోట, కల్యాణమండపంమున్నగు వాటిని భక్తులు దర్శించవచ్చు. శ్రీశైలక్షేత్రాన్ని ఆనుకుని కృష్ణానది ప్రవహిస్తూ ఉంది. దీన్ని పాతాళగంగ అని పిలుస్తారు. ఇంకా శ్రీశైలక్షేత్రంసమీపంలో ఉన్న సాక్షిగణపతి, హటకేశ్వరం, పాల ధార - పంచధార, శిఖరేశ్వరం, శ్రీశైలం ప్రాజెక్ట్, శివాజీ స్ఫూర్తి కేంద్రం, పంచమఠాలు, బయలు వీరభద్రుడు, ట్రైబల్ మ్యూజియంలను దర్శించవచ్చు.

ప్రతిరోజు అభిషేకాలు, పూజలు జరిగే శ్రీశైలక్షేత్రంలో మాఘమాసంలో మహాశివరాత్రి పర్వదినసందర్భంగా పదకొండు రోజులపాటు బ్రహ్మోత్సవాలు అంగరంగవైభవంగా జరుగు తాయి. ఈ సమయంలో ఒక్కోరోజు ఒక్కో వాహనసేవ జరుగు తుంది. శివరాత్రిరోజు లింగోద్భవం, స్వామివారికల్యాణం అంగరంగవైభవంగా జరుగుతాయి. దసరాపండుగసందర్భంగా అమ్మవారికి ప్రత్యేకఅలంకారాలు, పూజలు జరుగుతాయి. సంక్రాంతి, ఉగాదిపండుగల సందర్భంగా పూజలు జరుగు తాయి. ఇంకా వివిధసందర్భాలలో కోటి బిల్వకుంకుమార్చనలు, కుంభోత్సవాలు నిర్వహిస్తారు.

శ్రీశైలంలో దేవస్థానంవారు నిర్వహిస్తూ ఉన్న కాటేజీ లలో వసతిసౌకర్యాలు లభిస్తాయి. అన్నింటిలో ఉచితభోజన వసతి ఉంది. ఆన్‌లైన్‌లోకూడా వసతి రిజర్వ్ చేసుకోవచ్చు.

హైదరాబాద్ నుంచి 210 కిలోమీటర్లు, విజయవాడ నుంచి 220 కిలోమీటర్లు, కర్నూలు నుంచి 180 కిలో మీటర్లు, కడప నుంచి 260 కిలోమీటర్లు, మార్కాపురం నుంచి 85 కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీశైలానికి హైదరాబాద్, విజయ వాడ, కర్నూలు, కడప, తిరుపతి, అవనిగడ్డ, మచిలీపట్నం, ఒంగోలు, అనంతపురం, రాయచూరు, బళ్ళారి, గుల్బర్గా, మహానంది, ప్రొద్దుటూరు, కాకినాడు, రాజమండ్రి, మార్కాపురం, చెన్నై, బెంగుళూరుల నుంచి బస్సు సౌకర్యాలు ఉన్నాయి.

కేవలం దర్శనమాత్రాన్నే మోక్షం ప్రసాదించే శ్రీశైల క్షేత్రాన్ని దర్శించి భక్తులు తరించవచ్చు.

# షట్కాల శివలింగార్చన

– 'సారస్వతకళానిధి' డా॥ వెలువోలు నాగరాజ్యలక్ష్మి
*93941 13848*

సాధారణంగా మనం పండుగలన్నిటినీ పగటిపూట జరుపుకుంటాం. కానీ, రాత్రివేళ జరుపుకొనేపండుగలు రెండున్నాయి. అవి శ్రావణమాసంలో కృష్ణాష్టమి, మాఘ మాసంలో శివరాత్రి. కృష్ణాష్టమి శ్రీకృష్ణుని జన్మదినం. శివరాత్రి మహాశివుడు లింగరూపంలో ఆవిర్భవించిన పుణ్యసందర్భం.

మాఘబహుళచతుర్దశి పరమేశ్వరునికి ప్రీతిపాత్రం. ఆనాటి అర్ధరాత్రి కోటిసూర్యప్రభలతో మహాదేవుడు లింగాకృతితో అవతరించి, జీవులకు మోక్షప్రదాతగా విలసిల్లాడు. లయకారు డైన పరమేశ్వరుణ్ణి, అభిషేకప్రియుడైన మృత్యుంజయుణ్ణి ఎలుగెత్తి స్తుతిస్తూ జీవులంతా పరవశించే పవిత్రముహూర్తం లింగోద్భవకాలం.

ఈశ్వరుడు పశుపతి. ఆ భూతనాథుడు జీవులను మాయాదిపాశాలతో బంధిస్తాడు. అంతులేని జనన మరణాలకు ఆలవాలమైన ఆ పాశాలనుండి ముక్తిని పొందదలచిన జీవుడు పాశఖండనమైన శాంభవదీక్షను స్వీకరించాలి. అదే పాశు పతవ్రతం. పరమశివుణ్ణి పతిగా కాంక్షించి, తపస్సు చేయ సంకల్పించినపార్వతి పాశుపతదీక్షను చేపట్టింది.

షట్కాలశివలింగార్చన చేయటం విశిష్టధర్మం. గురు ముఖతః దీక్షాసంస్కారం పొంది, శివలింగార్చనపరులైనవారికి భస్మరుద్రాక్షధారణం, పాశుపతదీక్ష నియతకర్మలు ఈ దీక్షలో, పరమమాహేశ్వరాచారవిధిలో పరమరమణీయం షట్కాల లింగార్చనం.

అరుణోదయ, సూర్యోదయ, సంగమ, మధ్యాహ్న, సాయంసంధ్య, అర్ధరాత్రాలు షట్కాలాలు.

వ్యాసునిఉపదేశానుసారం, ధర్మరాజుఆదేశంతో అర్జునుడు దివ్యాస్త్రసంపాదనకై తపోదీక్ష స్వీకరించాడు. ఇంద్రకీలాద్రిపై కఠోరమైనవ్రతంతో పాశుపతదీక్ష చేపట్టాడు. పరమమాహేశ్వరాచారపరాయణమైన షట్కాల శివలింగార్చనతో పరమశివుణ్ణి మెప్పించి పాశుపతాస్త్రాన్ని పొందాడు.

సంగమకాలంలో శివార్చన కావించటం వీరమాహే శ్వరాచారవిధులలో తృతీయం. సూర్యోదయంనుండి ఏడు ఘడియలకు సంగమకాలంగా నిర్ణయింపబడింది. అర్జునుడు ఏకాగ్రతతో చంద్రశేఖరుడైన మహాదేవుణ్ణి అర్చించి, తన హృదయాన్ని సమర్పించుకున్నాడు.

అనంతరం 'ఓం నమశ్శివాయ' అనే పంచాక్షరీమంత్ర జపంతో మధ్యాహ్నకాలంలో మంచుకొండ అనుంగు పెండ్లి కొడుకైన విశ్వనాథుణ్ణి అర్చించాడు. సాంబశివుణ్ణి సంధ్యా సమయంలో పద్మాసనస్థుడైన పార్థుడు పూజించాడు. మారేడు దళాలను మన్మథహరునికి సమర్పించుకున్నాడు.

ఇక అర్ధనిశా సమయపూజ షట్కాలశివలింగార్చనలో చివరిది. అత్యంతవిశిష్టమైంది. అంచితభక్తితో పరిశుద్ధ సమర్చనా విధితో పార్థుడు సంస్కృతార్థుడై లింగోద్భవవేళ మహేశ్వరుణ్ణి ధ్యానించి తరించాడు.

అష్టమూర్తి అయిన మహేశ్వరుణ్ణి అనుక్షణం అంత రంగంలో ప్రతిష్ఠించుకుని మహాదేవుని నిత్యచింతనలో జీవుడు మోక్షసిద్ధిని పొందగలడని నిరూపించిన వృత్తాంతాలు, కోకొల్లలు. ఆదిదేవునిదివ్యవైభవాదులను అభివర్ణించడం అసాధ్యం. మహాశివరాత్రిపర్వదినాన నిర్మలప్రశాంతనిశ్చల దృఢమనస్కులై, శివసాన్నిధ్యంలో కాలం గడపి, శివపంచాక్షరీ జపం చేస్తూ జాగరణతో పరమశివునిదివ్యానుగ్రహాన్ని పొందే ప్రయత్నం సాగించటమే జీవులందరికర్తవ్యం.

దురాచారచరితుడైన గుణనిధి శివరాత్రిపర్వదినాన అప్రయత్నంగా చేసిన జాగరణ, ఉపవాసాలవల్ల పుణ్యలోక ప్రాప్తినందినవృత్తాంతం సుప్రసిద్ధం. ఇక ఆలస్యం చేయక మనం కూడా మహాశివరాత్రిలింగోద్భవకాలంలో పంచాక్షరీ మంత్రమననంతో తరిద్దాం!



తమకు విచారాన్ని కాక సంతోషాన్నిచ్చే పిల్లలున్న తల్లిదండ్రులు అదృష్టవంతులు

పార్వతీపరమేశ్వరులు ఈ జగత్తుకు తల్లిదండ్రులు.

పార్వతీ పరమేశ్వరుల కల్యాణం జగత్కల్యాణం.

మహాశివరాత్రి పర్వదినసందర్భంగా ఆదిదంపతుల కల్యాణం మీ కోసం...



# పార్వతీకల్యాణం

– డా॥ జంధ్యాల పరదేశిబాబు

## పార్వతిజననం

పర్వతాలకు రాజు హిమవంతుడు. అతనిభార్య మేనక. ఈ దంపతులకు జగన్మాత ఆదిశక్తి కుమార్తెగా జన్మించింది. ఆమెయే పార్వతి. చిన్ననాటినుండి శివుణ్ణి ఆరాధించేది. ఒకసారి నారదుడు హిమవంతునితో "మీ కుమార్తెకు శివుడే సరియైన భర్త. ఆయనే వచ్చి పార్వతీదేవిని చేపట్ట గలడు" అని చెప్పాడు. సర్వాంతర్యామి అయిన పరమేశ్వరుడు కైలాసపర్వతంమీద తపస్సు చేస్తున్నాడని తెలిసింది.

## పార్వతిసపర్యలు

హిమవంతుడు భార్యతో అక్కడికి వెళ్లి, "ప్రభూ! తమకు నిత్యం సేవలు చేయడానికి నా కుమార్తె పార్వతిని అనుమతించండి" అని కోరాడు. 'సరే' అన్నాడు– శివుడు. పార్వతి ప్రతిరోజూ పరమేశ్వరునికి భక్తిశ్రద్ధలతో సపర్యలు చేయడం మొదలు పెట్టింది.

ప్రతినిత్యం శివుడు తపస్సు చేసే శిలాపీఠాన్ని శుభ్రం చేసి, అభిషేకించి, ముగ్గులు తీర్చిదిద్ది, పూలతో అలంకరించేది పార్వతి. తనను ఏ క్షణాన పిలుస్తాడోననే ఆశతో అతనివైపే చూస్తూ, పార్వతి పంచాక్షరీమంత్రాన్ని జపిస్తుండేది. కానీ పరమేశ్వరుడు ఒక్కసారైనా, ఒక్క క్షణమైనా కన్నెత్తి చూడలేదు. నోరు తెరచి ఆమెను పలుకరించలేదు. ఈ విధంగా చాలాకాలం జరిగింది.

పార్వతీపరమేశ్వరులకల్యాణంకోసమై ఎంతోకాలం నుండి ఎదురుచూస్తున్న దేవతలకు నిరాశ కలిగి, బ్రహ్మను ఆశ్రయించారు. బ్రహ్మదేవుడు వారిని ఊరడించి, మన్మథుణ్ణి స్మరించాడు. "మన్మథా! నీవు వెంటనే కైలాసం వెళ్ళి, తపోదీక్షలో ఉన్న పరమేశ్వరునిపై నీ మదనతాపబాణప్రయోగం చేసి, పరమేశ్వరుడు పార్వతిని మోహించేటట్లు చెయ్యి" అని బ్రహ్మ ఆదేశించాడు మన్మథుణ్ణి. "లోకకల్యాణార్థం నీ వీ పనిచేయక తప్పదు" అని చెప్పాడు బ్రహ్మ. రతీమన్మథులు కైలాసం చేరారు. మన్మథుడు వింటిని సవరించి, పంచపుష్పబాణాలను ఎక్కుపెట్టి, సమయంకోసం ఎదురుచూడసాగాడు. పార్వతి ఎప్పటి మాదిరిగానే నిత్యసేవా నిమిత్తం పరమేశ్వరునిసన్నిధికి వెళ్తోంది. ఇంతలో ఒక దేవతాపుష్పం అప్పుడే ఆకాశంనుండి రాలుతూ పార్వతి దోసిట్లో పడింది. పార్వతి ఆ పువ్వును పరమేశ్వరునిపాదాలచెంత ఉంచింది. ఆ పుష్పపరిమళాలకు పరమేశ్వరుడు కన్నులు తెరచి పార్వతీదేవిని చూచి, ముసిముసిగా నవ్వుకున్నాడు. "నీ భక్తికీ, సేవలకూ నేను సంతసించాను. నీకోరిక ఫలిస్తుంది. శుభం కలుగుగాక!" అని పరమశివుడు ఆమెను ఆశీర్వదించాడు.

మన్మథుడు ఇదే తగిన సమయమని తన పంచపుష్పబాణాల్ని శివునిమీద ప్రయోగించాడు. తనపై అటువంటి సాహసం చేయ తలపెట్టిన మన్మథుణ్ణి తన నేత్రాగ్నితో భస్మం

చేశాడు శివుడు. తన కళ్లముందే మన్మథుడు భస్మమై పోవడంతో పార్వతీదేవి మిక్కిలి పరితపించి, తపోమార్గాన పరమేశ్వరుణ్ణి భర్తగా పొందాలని నిశ్చయించుకుంది. తల్లిదండ్రులు ఎంత వారించినా వినక పార్వతి తపోవనాలకు వెళ్లడానికే నిర్ణయించుకుంది.

## పార్వతి తపస్సు

పార్వతి సుకుమారరూపం వదలింది. సకలభూషణాలను తీసివేసింది. తపస్సుకు అనుకూలమైన నారచీరలు ధరించింది. మహోగ్రమైన తపస్సుకు పూనుకొంది. జయ, విజయ, మాధవి, సులోచన మొదలైన చెలికత్తెలు తనను అనుసరిస్తుండగా ఎక్కడ మన్మథుడు దగ్ధమైనాడో, అక్కడే వేదిక నమర్చుకుని నిరాహారయై తపస్సు ఆరంభించింది. కొంతకాలం మంచి నీరుకూడా మాని, కేవలం ఎండుటాకులే ఆహారంగా తపస్సు కొనసాగించింది. మరి కొంతకాలం అవి కూడా మాని వాయు భక్షణం చేస్తూ తపస్సు చేస్తున్న ఆమెను మునులు "అపర్ణ" అని పిలువసాగారు.

ఒంటికాలిపై నిల్చుండి తీవ్రమైనతపస్సు చేస్తున్న పార్వతిని సమీపించి తల్లిదండ్రులు మేనకాహిమవంతులు "అమ్మా! నీ కెందు కీ తీవ్రతపము? సుకుమారమైన నీ శరీరమెక్కడ? ఈ తపస్సెక్కడ? విరక్తుడైన రుద్రుడెక్కడ? పసిపాపవైన నీవెక్కడ? తపము మాని ఇంటికి రాతల్లీ! ఆకాశంలో ఉన్న చంద్రుణ్ణి అందుకోవడం సాధ్యం కానట్లే, శివుణ్ణి భర్తగా పొందడం నీ సాధ్యం కాదు" అని ఎన్నోరకాలుగా చెప్పారు.

హిమవత్పుత్రిక "అమ్మా! లోక శుభంకరుడైన శంకరుణ్ణి నా తపశ్శక్తిచేత మెప్పిస్తాను. పరమేశ్వరుడు తపస్సులభుడు. ముమ్మాటికి ఇది సత్యం," అని తన నిశ్చయాన్ని ప్రకటించగా హిమవంతుడు మేరుమంథరాదిబంధువర్గంతో కూడి స్వగృహానికి మరలివెళ్లాడు.

పార్వతీదేవి యొక్క మహోగ్రతపోగ్ని జ్వాలలకు సకలలోకాలు తల్లడిల్లిపోయాయి. దేవతలు భయభ్రాంతులై బ్రహ్మదేవుణ్ణి సమీపించి శరణుకోరారు. పార్వతీదేవి చేసేకఠోరతపస్సు పరమేశ్వరునిదివ్యదృష్టికి చేరింది. ఆమె తపోదీక్షకు కొంత మెత్తబడ్డాడు శివుడు.

ఆ సమయంలోనే విష్ణువుతో సహా ఇంద్రాది దేవతలు శంకరునివద్దకు వచ్చి, తారకాసురుని రాక్షసకృత్యాలు తెలిపి, కాపాడమని ఎన్నో విధాల ప్రార్థించారు. "పరమశివా! తారకాసురసంహారం కోసం నీవు, నీకొరకు తపస్సు చేస్తున్న జగన్మాతను వరించి, పుత్రుని పొందవలెను" అనిచెప్పాడు విష్ణువు. శివుడు లోకశ్రేయస్సుకోసం 'సరే' అన్నాడు. ఇంద్రాది దేవతలు సంతోషించారు.

## సాక్షాత్కారం

పరమేశ్వరుడు వృద్ధసాధువువేషంలో పార్వతీదేవివద్దకు వెళ్లి, "నీ తపోదీక్షకు కారణం ఏమిటి?" అని అడిగాడు. తాను పరమేశ్వరుణ్ణి పతిగా పొందుటకై తపస్సు చేస్తున్నానని చెప్పింది- పార్వతి.


**STATEMENT ABOUT OWNERSHIP AND OTHER PARTICULARS ABOUT**

**SAPTHAGIRI**

**(MONTHLY)**
**FORM IV**
**See Rule 8**

1. Place of Publication : TIRUPATI
2. Periodicity of its Publication : Monthly
3. Honorary Editor : **Dr. K.S.Jawahar Reddy, I.A.S.,** Executive Officer, T.T.D.
4. Printer's Name : **Sri P.Ramaraju, M.A.,**
   Whether citizen of India : Yes
   Address : Special Officer(Publications & Press), T.T.D., Tirupati.
5. Editor & Publisher's Name : **Prof. K.Rajagopalan, Ph.D.,**
   Whether citizen of India : Yes
   Address : Chief Editor (i/c), Sapthagiri, T.T.D. Journal, Tirupati
6. Name and address of individuals who own the Newspaper and partners or shareholders holding more than one percent of the Total Capital } Board of Trustees represented by the Executive Officer on behalf of T.T.D., Tirupati

I, **K.Rajagopalan**, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

TIRUPATI,
Date : 28-2-2021.

**(Sd.) Prof. K.Rajagopalan,**
Signature of the Publisher




ఇతరులు మన తప్పను భూతద్దంలో చూపకముందే మన తప్పను ఒప్పుకోవాలి

"బాలా! శంకరుడు నీకు తగిన వరుడు కాజాలడు. అతడు శ్మశానవాసి. శరీరానికి బూడిద పులుముకుంటాడు. మెడలో కపాలాలు ధరిస్తాడు. పాములను ఆభరణాలుగా ధరిస్తాడు. అలాంటి బైరాగి నీకు తగినభర్త కాదు" అని చెప్పాడు.

అప్పుడు పార్వతి ఆవేశంతో "స్వామీ! శివుణ్ణి గురించి మీకు తెలియకపోతే మాట్లాడకండి" అని గద్దించింది. "నా స్వామి కుబేరాదిధనవంతులకే కాగా, యాచించినవారం దరికో సిరిసంపదలు అనుగ్రహించే ఐశ్వర్యవంతుడు. ఆయన సర్వేశ్వరుడు. నేను ఆయనపాదసేవను కోరుకుంటున్నాను గాని అతనిసంపదలను కాదు. మీరు వయోవృద్ధులని క్షమిస్తున్నాను. నా కోపానికి గురికాక, ఇచ్చటినుండి వెంటనే వెళ్లిపొండి" అని పలికింది పార్వతి.

ఆ వృద్ధుడు చిరునవ్వు నవ్వి 'అలాగే దేవి' అంటూ నిజరూపంతో సాక్షాత్కరించాడు. పార్వతి మహేశ్వరుని దివ్య సుందరరూపం చూచి, అంతరంగంలో ఆనందించింది. "దేవా! తారకాసురుణ్ణి వధించే సామర్థ్యం ఉన్న కుమారుణ్ణి ప్రసాదించి, దేవకార్యసిద్ధికై పూనుకో. నాతో వివాహానికై మా తండ్రి హిమవంతునికడకు వచ్చి మాట్లాడు" అని కోరింది.

శివుడు "పార్వతీ! ఈ జగత్తు సమస్తమూ గుణకార్య వశమై పుడుతూ ఉంటుంది. నీవు సూక్ష్మప్రకృతివి త్రిగుణాత్మవు అందువల్ల ఈ సృష్టివ్యాపారం యథావిధిగా జరుగుతుంది. అంతేకాని నేను హిమవంతునిదగ్గరకు వెళ్లి, నీకోసమై యాచించను" అన్నాడు.

అప్పుడు పార్వతీదేవి "పరమేశా! నీవే ఆత్మవు; నీవే ప్రకృతివి; సర్వమూ నీవే! ఐనా మన వివాహం జరిగి తీరాలి. నా శరీరావరణాన్ని అంగీకరించి, నన్ను సౌభాగ్యవతిని చెయ్యి" అని ప్రార్థించింది.

పరమేశ్వరుడు లోకరక్షణార్థమై ఛాయలాగా నిన్ను అనుసరించే ఉంటానని అనుగ్రహించాడు. మునులందరూ ఈ విషయాన్ని మేనకా హిమవంతులకు తెలిపి, మంగళవాద్యా లతో పార్వతిని నిజగృహానికి తీసుకొని వెళ్లారు.

దేవకార్యంకొరకై విష్ణుమూర్తికూడా వారితో పాటు శివసన్నిధికి వెళ్ళగా, ఆ హరిహరాత్మక భావాన్ని చూచి, మునులు ఎంతో సంతోషించారు.

శివుడు విష్ణుమూర్తితో- "పార్వతి పాణిగ్రహణం చేయడా నికై హిమాలయానికి వెళ్ళాలి. పూర్వం దక్షకన్యను స్వీకరించాను కానీ అది కేవలం సంకల్పమాత్రంగా జరిగింది. ఇప్పుడు యథావిధిగా వివాహం జరుపుకోవాలి. నాకు ఆ విషయాలు అంతగా తెలియవు. అందువల్ల ఆ సన్నాహాలు చేయండి" అని ఆదేశించారు.

ఇంతలో బ్రహ్మదేవుడితో పాటు ఇంద్రుడుకూడా అక్కడికి వచ్చాడు. అత్రి మొదలైన మహర్షులు విచ్చేసి, కల్యాణ క్రతువు నిర్వర్తించడానికి పూనుకొన్నారు.

## వరుడుగా పరమశివుడు

పరమశివుని మెడలోని నాగాభరణాలు సువర్ణ ఆభరణా లుగా మారిపోయాయి. కంఠంలోని కపాలమాలలు ముత్యాల సరాలయినవి. సకలాభరణభూషితుడై దేవతాగణంతోపాటు పర్వతరాజపురానికి తరలివెళ్ళాడు దేవదేవుడు. బంగారు కలశాన్ని శిరస్సున పెట్టుకొని, చండి ముందు నడుస్తుండగా మిగిలిన భూతగణమంతా అనుసరించాయి. డమరుకనాదాలతో, భేరీభాంకారాలతో, శంఖధ్వానాలతో దిక్కులు పిక్కటిల్లుతూ ఉండగా, సిద్ధసాధ్యగంధర్వాదులూ, దేవాసురగణ మంతా ఆయనవెంట నడిచింది. ఐరావతాన్ని ఎక్కి ఇంద్రుడూ, గరుడా రూఢుడై లక్ష్మీసమేతంగా శ్రీమహావిష్ణువూ, జంగమరూపం ధరించి వేదాలు తనను సేవిస్తూ ఉండగా సరస్వతీసమేతంగా బ్రహ్మదేవుడూ శివకల్యాణానికై బయలుదేరారు.

హిమవంతుడు గర్గాచార్యుల సూచనప్రకారం శివ పార్వతుల కల్యాణానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నాడు. దేవశిల్పి విశ్వకర్మ రత్నశోభితమైన సువిశాలకల్యాణమంటపాన్ని జగన్మోహనంగా నిర్మించాడు.

నారదమునీంద్రుడు బంగారుకలశాలతో, అరటి స్తంభాలతో విలసిల్లుతున్న కల్యాణమండపంలో ప్రవేశించి "పర్వతరాజా! మగపెండ్లివారు వచ్చారు. ఎదురుగా వెళ్లి తీసికొని రావాలి" అని చెప్పగా,

సమస్తబంధువర్గంతో పర్వతరాజైన హిమవంతుడు పెండ్లి వారికి స్వాగతసత్కారాలు చేసి, మహర్షులకూ ఇంద్రాదిదేవత లకూ విడిదికై సముచితమైన మందిరాలను ఏర్పాటు చేశాడు.

## వధువుగా పార్వతి

కొత్తపెండ్లికూతురు పార్వతి తెల్లనిపట్టుచీర కట్టుకొన్నది. బంగారు వన్నెరైక తొడిగింది. మెడలో ముత్యాల సరాలు, చేతులకు పసిడి గాజులు మణికంకణాలతో నానా విధరత్నాలంకారభూషితయై పరమమంగళ స్త్రీలతో చెలికత్తెల సేవలందుకొంటూ ఉంది.

గర్గాచార్యులవారు "అమ్మా! లగ్నం సమీపించింది. వెంటనే వధూవరులను పెళ్లిపీటలమీద కూర్చోబెట్టాలి" అన్నారు.

అంత లక్ష్మీ సరస్వతులు ఇరువైపులా బంగారు చామరాలు పట్టుకొనగా, శచీదేవి మొదలైన దేవకాంతలు భూషణ దర్పణాంబరాలు చేతధరించి వస్తుండగా, అరుంధతి మొదలైన పతివ్రతలూ, మునికాంతలు, పేరంటాండ్రు కాగా, సుర, నర, కిన్నరకాంతలు మంగళగీతికలు పాడుతూ ముందు నడుస్తూ ఉండగా ముల్లోకాలలోని సౌందర్యలావణ్యరాగరసాలు మూర్తి దాల్చినట్లుగా పర్వతరాజతనయ పార్వతి వివాహమంటపానికి వచ్చింది.

బృహస్పతి చేతులు జోడించి "దేవా! లగ్న మాసన్నమైన"దని పలుకగా, పరమేశ్వరుడు కరుణాదృష్టితో వారి వైపు చూశాడు.

బ్రహ్మదేవుడు హోమద్రవ్యాలు తీసికొని వస్తుండగా, విష్ణుమూర్తి ఇంద్రుడూ ఇరువైపుల మణిమయచామరాలు పట్టుకొనగా, దిక్పాలకులు భక్తితో ఛత్రము ధరించి వెంట వస్తుండగా, నరులు, సురలు, కిన్నరులు కేతనాలు పట్టుకొనగా, ప్రమథగణంతో కూడి సర్వేశ్వరుడు క్రొత్త పెండ్లికొడుకై వివాహ మంటపానికి విచ్చేశాడు.

వధూవరులు వివాహమంటపానికి విచ్చేయగా, గర్గాచార్యులవారు పుణ్యాహవాచనమంత్రాలు పఠిస్తూ మంగళ ద్రవ్యాలను అర్చింపజేశారు.

ఏ దేవదేవునికోసమై తాను కఠోరమైన తపస్సు చేసిందో, ఆ పరమశివునివంక సిగ్గుతో చూచింది, పార్వతి. త్రైలోక్యలక్ష్మీసమేతులై పార్వతీపరమేశ్వరులు ఒకరినొకరు చూచుకొనుచుండగా లక్ష్మీదేవి, సావిత్రి నూతనదంపతులకు నీరాజనం పట్టారు. అరుంధతి, అనసూయలు మంగళహారతి ఇచ్చారు.

గర్గుని ఆదేశానుసారం బ్రహ్మ, విష్ణువూ కలిసి "తండ్రీ! పరమేశ్వరా! నీ కులగోత్రాలు తెలుపు" మనగా శివరుద్రుడు చిరునవ్వు నవ్వాడు. అంత నారదుడు మహతిని మ్రోగింపగా, పర్వతరాజు అతణ్ణి వారించాడు.

అప్పుడు నారదుడు "పర్వతరాజా! వీరి కులగోత్రాలు నాదమే! నాదంలో శంభుడూ, శంభునిలో నాదమూ ప్రతిష్ఠితమై ఉంటాయి. కాబట్టి నాదమయుడు. అందుచేత నేను నా వీణ మ్రోగించాను. ఈశ్వరుడు కులగోత్రాలకు అతీతుడు. పండితుడవైన నీవు నీ అల్లుని కులగోత్రాలనుగురించి ఆలోచించడం తగదు. ఈ ఉమామహేశ్వరదాంపత్యం సృష్టి స్థితి లయకారణం" అని అనగా పర్వతసార్వభౌముడూ, సుర రాజ ప్రభృతులు నారదుణ్ణి ఎంతో అభినందించారు.

## కన్యాదానం

అప్పుడు ఆప్తబంధువులు "పర్వతరాజా! ఆలసింపక వెంటనే కన్యాదానం చేయ"మని చెప్పగా, పర్వతరాజు వేద విదులైన బ్రాహ్మణుల ఆశీర్వచనాలతో "మహేశా! ఈ కన్యను నీకు సమర్పిస్తున్నాను భార్యగా స్వీకరించు." అంటూ కన్యాదానం చేశాడు.

దేవకాంతలు నూతనదంపతులకు మంగళహారతి పట్టగా పర్వతరాజపత్నులు కల్యాణగీతాలు పాడారు. కన్యాదాత మహర్షులకు అనర్ఘరత్నాలను బహూకరింపగా పరమశివుడు పార్వతీదేవితో కూడి పరమానందంతో విరాజిల్లాడు.

హిమవంతుడు మగపెండ్లివారిపక్షాన వచ్చిన బ్రహ్మాది దేవతలపై పన్నీరు చిలకరించి, చందనతాంబూలాదులు సమర్పించి, రత్నాభరణాలతో సత్కరించాడు. జగత్కల్యాణాత్మకమైన పార్వతీపరమేశ్వరుల కల్యాణం చూచి, ప్రమథగణమంతా మహానందంతో పరవశించిపోయింది.

సప్తఋషులు "పార్వతీపరమేశ్వరుల కల్యాణం వల్ల ముల్లోకాలకు శుభం కలుగుతుంది" అని పర్వతరాజు దంపతులకు తెలిపారు.

'తారకాసుర సంహారానికి నాంది' జరిగిందని ముల్లోకవాసులు సంతోషంతో పొంగిపోయారు. 'పార్వతీపరమేశ్వరుల కల్యాణం' జగత్కల్యాణం, ముల్లోకాలకు ఆదర్శప్రాయం!

శ్రీవేంకటేశ్వరలీలలు



# అడుగడుగునా కాపాడే దైవం

శ్రీమతి యడవల్లి మృదుల లక్ష్మి

తిరుపతి ఏడుకొండల స్వామి అంటే మావారికి మాటల్లో చెప్పలేనంత భక్తి. మా ఇంట్లో శ్రీదేవీ, భూదేవీ సమేత శ్రీవేంకటేశ్వరస్వామివార్ల పంచ లోహవిగ్రహాలు ఉన్నాయి. మావారి తాతగారి కాలం నుంచి వారసత్వంగా వస్తున్న విగ్రహాలవి. నిత్యం మావారు ఆ విగ్రహాలకు పూజ చేస్తుంటారు. ధనుర్మాసంలో అయితే నిత్యం తులసిపూజ, విష్ణుసహస్రనామ పారాయణం చేసి, భోగాలు నివేదన చేస్తారు.

చిన్నప్పటినుంచి నాకున్న భక్తికితోడు వివాహం అయిన తర్వాత మావారిపూజలతో నాకు తిరుపతి వేంకటేశ్వర స్వామి వారంటే భక్తి మరింతగా పెరిగింది. భక్తుల్ని కాపాడు కోవటంలో శ్రీవారిని మించినదైవం లేదు. మా విషయంలో ఎన్నోసార్లు ఇది ఋజువైంది కూడా!

మా వివాహం జరిగిన కొద్దిరోజులకే శ్రీవారిదర్శనా నికి కొండకు చేరుకున్నాం. దర్శనం జరిగాక ప్రసాదాలు తీసు కునేందుకు బయల్దేరాం. ఎందుకనో గానీ ఆ రోజు విపరీతమైన రద్దీగా ఉంది. ఆడవారి క్యూలైన్ దగ్గర రద్దీ కొద్దిగా తక్కువగా ఉండటంతో నన్ను ప్రసాదం తీసుకురమ్మని పంపించారు. తాను అక్కడే ఉంటానని చెప్పి, చాలా జాగ్రత్తలు చెప్పి, మరీ పంపించారు.

ప్రసాదం తీసుకువచ్చి బయటకు వచ్చేసరికి ఆయన కనిపించలేదు. విచిత్రం ఏమిటో గానీ ఆయన చెప్పిన గుర్తులేవీ నాకు జ్ఞాపకం రావటం లేదు. ఎంతగా వెతికానో. నాలో భయం విపరీతంగా పెరిగిపోయింది. ఎక్కడ ఉన్నానో, ఏం చేస్తున్నానో తెలియని పరిస్థితి. ఆ ప్రాంతమంతా తిరిగేస్తున్నా. సెల్‌ఫోన్ సౌకర్యం లేదు. ఎవరిని అడగాలి. పైగా పెళ్లి అయిన కొత్తల్లోనే వచ్చాం. పూర్తిగా వివరాలు చెప్పలేని పరిస్థితి. అమ్మచాటున పెరిగిన బిడ్డనేమో బయటి సంగతులు తెలియవు. ఏం చెయ్యాలో నాకు దిక్కుతోచటం లేదు. ఏడుపు ఆగటంలేదు.

ఇంతలో ఓ పెద్దమనిషి, తిరునామాలతో అర్చకస్వామి లాగా ఉన్నారు. నా పరిస్థితి గమనించి ఏం జరిగిందంటూ అడిగారు. విషయం చెప్పాను. కంగారు పడొద్దమ్మా అంటూ మీ ఆయన అటువైపు ఉన్నారేమో చూడు అంటూ ఓ పక్కకి చూపించారు. ఆశ్చర్యం...! ఆయన కనిపించారు. అంతే... పరిగెత్తు కుంటూ క్షణంలో ఆయన దగ్గరకు చేరా. వెనక్కి తిరిగి చూస్తే అర్చకస్వామి కనిపించలేదు.

ఎందుకేడుస్తున్నావంటూ ఆయన అడిగారు. జరిగిం దంతా చెప్పాను. అప్పుడు మావారు చెప్పారు... నేను ఎంతకీ రాకపోయేసరికి ఆయనకీ భయం వేసిందట. ఆయన ఎప్పుడు కొండకు వచ్చినా తిరుమలకు నడుచుకుంటూ వస్తారు. పెళ్ళయ్యాకకూడా ఇద్దరం కలిసి కొండ ఎక్కుదామంటే నేను నడవలేనని మొండిగానే చెప్పాను. నా మాట కాదనలేక బస్సులో కొండకు వచ్చారు. ఇవన్నీ గుర్తు చేసుకుంటూ మా వారు వేంకటేశ్వరస్వామివారికి నమస్కారం చేసుకున్నారట. స్వామీ! నా భార్య తప్పును మన్నించు. ఆమె రాకపోయినా నేను ఈసారి నడుచుకుంటూనే కొండకు వస్తానని దండం పెట్టు కున్నారట!

ఈ మధ్యసమయంలోనే స్వామి నాకు మహత్తు చూపించారు. ఎప్పుడైతే మా వారు అపరాధం మన్నించమని వేడుకున్నారో స్వామి కరుణతో నాకు దారి చూపించారు. మా ఇద్దరినీ కలిపారు. నేనుకూడా అపరాధం మన్నించమని వేడుకున్నాను.

ఆ తర్వాత కూడా మా జీవితంలో స్వామి ఎన్నో నిదర్శనాలు చూపించారు. నా కడుపున బిడ్డ పడగానే ఆరోగ్య సమస్యలు వచ్చాయి. కొందరు వైద్యులు అబార్షన్ చేయించుకో మన్నారు. కానీ నేను ఒప్పుకోలేదు. మా వారు నిత్యం పూజించే మూర్తులకు మొక్కుకున్నారు. స్వామికరుణతో అన్నీ సర్దుకుని ప్రసవం సుఖంగా జరిగింది. పండంటి బిడ్డ పుట్టాడు. స్వామి పేరు కలిపి దత్తశ్రీనివాసుడనే పేరు పెట్టుకున్నాం. బిడ్డను తీసుకుని స్వామిదర్శనం చేసుకున్నాం. అప్పుడు మా వారి కాలికి ఫ్రాక్చర్ జరిగినా, ఎంతో నొప్పి ఓర్చుకుంటూ కొండకు నడిచి వచ్చారు. అంతబలం, ధైర్యం స్వామిఅనుగ్రహంతో వచ్చాయి.

మా జీవితంలో ఇంకా ఎన్నో నిదర్శనాలు ఉన్నాయి. మా కుటుంబాన్ని అడుగడుగునా ఆపదలనుంచి కాపాడే ఆపద మొక్కుల స్వామి తిరుమల గిరి సార్వభౌముడే! ఆ స్వామిదయ తోనే ఆనందంగా జీవిస్తున్నాం.



# ఆకలి తీర్చగలగడమే తపస్సు

- డా॥ యం.ఎన్.చార్య, 94406 11151

అన్నం పరబ్రహ్మస్వరూపం. అన్నం లేనిదే ఏ ప్రాణీ జీవించలేదు. అన్నదానం కోటి గోవుల దానఫలితంతో సమానమైంది. ఏది లోపించినా బ్రతకగలం. కానీ ఆహారం లోపిస్తే బ్రతకలేం.

"దానాలన్నింటిలోకెల్లా అన్నదానం మిన్న" అన్న దానాన్ని మించిన దానం మరొకటి లేదని పెద్దలు చెప్తారు. మనిషి ఆశకు అంతులేదు. అదుపు అంతకన్నా ఉండదు, ఎందుకంటే ఏది దానంగా ఇచ్చినా, ఎంత ఇచ్చినాకూడా ఇంకా ఇంకా కావాలనిపిస్తుంది.

కానీ, అన్నదానంలో మాత్రం దానం తీసుకున్నవారు ఇంక చాలు అని చెప్పి, సంతృప్తిగా లేస్తారు. ఏ దానం ఇచ్చినా దానం తీసుకున్నవారిని మనం సంతృప్తిపరచలేక పోవచ్చు. కాని అన్నదానం చేస్తే మాత్రం దానం తీసుకున్నవారిని పరిపూర్ణంగా సంతృప్తి పరచవచ్చును. అన్నదానాన్ని ఒక యజ్ఞంలా భావించి చేసేవారు కూడా ఉన్నారు. ఆకలిగొని ఉన్నవారికి అన్నదానం చేయలేకయినా అన్నం పెట్టే ఇంటినైనా చూపించమని పెద్దలు చెప్తారు.

త్రేతాయుగం, ద్వాపరయుగాల్లో యజ్ఞయాగాదులు తపస్సులద్వారా మానవులు మోక్షం పొందారు. కలియుగంలో దానధర్మాలు, దైవారాధన, నామపారాయణ, నామస్మరణ మొదలైనవాటిద్వారా సులభతరమైన మోక్ష మార్గాన్ని దైవం ప్రసాదించాడు.

ఎవరికున్నంతలో వారు దానధర్మాలు చేసుకోవచ్చు. ఈ దానం చేసేదికూడా మనస్ఫూర్తిగా చేయాలి. ఆడంబరాలకు పోనవసరం లేదు. దానాలు ఎన్నో రకాలుగా ఉంటాయి, దానాల్లోకూడా అన్నదానం, వస్త్రదానం, జలదానం, గోదానం, కన్యాదానం, సువర్ణదానం, భూదానం మొదలైనవన్నీ చాలా విశిష్టమైనవి.

మనిషిని పూర్తిగా సంతృప్తిపరచేది అన్నదానమే! దాహార్తిని తీర్చేది జలదానం. ముఖ్యంగా వేసవికాలంలో బాటసారుల దాహాన్ని తీర్చటంద్వారా వారికి మనమెంతో మేలుచేసినవాళ్లమవుతాం. వస్త్రదానం చేస్తే సాక్షాత్తూ ఆ భగవంతుడికే వస్త్రాన్నిచ్చిన పుణ్యం కలుగుతుంది. ఎండ, వాన, చలినుండి పేదలను కాపాడిన తృప్తి మనకు కలుగుతుంది.

మనం చేసే దానం 'ఫలాపేక్ష రహితంగా' ఉండాలి. ఏలాంటి స్వార్థం లేకుండా, ఏ ఫలితం ఆశించకుండా, ఎవరి మెప్పు కోసం కాకుండా నిస్స్వార్థ పూరితంగా చేస్తే ఆ దేవుడే దానాన్ని గ్రహించడానికి వస్తాడని అంటారు. కర్ణుడు, బలిచక్రవర్తి మొదలైనవారిదగ్గరికి సాక్షాత్తు భగవంతుడే యాచకుడిరూపంలో వచ్చి, దానం స్వీకరించి వారికి మోక్షాన్ని ప్రసాదించినట్టు పురాణ, ఇతిహాసాల ద్వారా మనకు తెలుస్తుంది.

ఒక మనిషి మరణించినా.. అతడు చేసిన దాన ధర్మాలవల్ల ఆజన్మాంతరం అతడిపేరు చిరస్థాయిగా నిలిచిపోతుంది. దానగుణం లేని మనిషికి మోక్షం కలుగదు. ప్రతిఫలం ఆశించక చేసేదానం అత్యున్నతమైంది. ఆకలితో ఉన్నవారికి అనాథలకు, పేదలకు, రోగులకు, వికలాంగులకు, అన్న, వస్త్ర, ఓషధులు మొదలైనవి దానం చేస్తే దాన్ని పాత్రదానం అంటారు.

అన్నదానం చేయడంలో ఏ మాత్రం పక్షపాత వైఖరి గాని 'పర తమ' భేదవైఖరి అస్సలు ఉండకూడదు, చూపకూడదు. సంపదగలవారికి, అధికారంగలవారికి,

బంధుమిత్రులకు ప్రత్యేకంగా ఆతిథ్యం ఇస్తూ పేదవారిని తక్కువ చేసి చూస్తే అది అపాత్రదానమే అవుతుంది. బంధు మిత్రులు అనే ప్రీతిచూపకుండా.. ఆర్థికస్తోమతను బట్టి, శారీరకశక్తిలేని వృద్ధులకు, అభాగ్యులకు మనస్ఫూర్తిగా అన్నదానం చేయాలి.

సాక్షాత్తు భగవంతునికే అన్ననివేదన సమర్పిస్తున్నా మనే భావన చెందుతూ చేస్తే ఆ పుణ్యఫలం రెట్టింపు అవు తుంది. పేదవారిని పక్కనబెట్టి అయినవారికి ముందుగా వడ్డిస్తే అన్నదానపుణ్యఫలం లభించదు.

అన్నదానం అంటేనే మనతో ఏ బంధం లేనివారినీ, నిరుపేదలను "దరిద్రనారాయణులను" భగవంతునిగా భావించి చేసేమహత్కార్యం ఇది! అన్నదానం జరిగే చోటుకు భగవంతుడు పేదవారిరూపంతో వస్తాడు అని పురాణఆధారాలున్నాయి.

ఉన్నోళ్లకు అన్నం పెడితే పెట్టినవారి మేలు కోరు తారో లేదో తెలియదుకాని, లేనివాడికి పట్టెడు అన్నం ప్రేమతో పెడితే వారిదేహాత్మలోని పరమాత్మ సంతృప్తి చెంది, వారు వేదఆశీర్వచనాలు ఇవ్వకున్నా అంతకుమించి దీవిస్తారు.

మనపేరు వారికి తెలియకున్నా ఏ తల్లిదండ్రులు కన్నబిడ్డో మాఅయ్య, మాదొర, మాదేవుడు కడుపు నిండా కమ్మని అన్నం పెట్టించాడు. ఆయన కడుపు సల్లం గుండా, వాళ్ళభార్య పిల్లలు సల్లంగుండా, వాడ సల్లంగుండా, వంశం సల్లంగుండా అని నిండు మనస్సుతో దీవిస్తారు. నిజంగా ఆ దీవెనలు దాతకు జీవితపర్యంతమే కాదు వచ్చే జన్మకు ఆ పుణ్య ఫల దీవెనలు సంప్రాప్తి స్తాయి.

ఈ అన్నదాన కార్యాక్రమానికి ఏదో రకంగా సహాయ పడిన వారందరికీ ఆ పుణ్యఫలం లభిస్తుంది. భగవద్గీతలో కృష్ణభగవానుడు యజ్ఞదానతపోరూపాలైన కర్మలను ప్రతిఫలాపేక్ష లేకుండా తప్పక ఆచరించాలని చెప్పాడు.

మహాభారతయుద్ధంలో కర్ణుడు మరణించిన తరు వాత స్వర్గానికి వెళ్ళాడు. అక్కడ కర్ణునికి అన్నిసౌకర్యాలు లభించాయి. స్వాగతసత్కారాలు లభించాయి. ఏది కావా లంటే అది పొందే అవకాశం ఉంది. అన్నీ అందుబాటులో ఉన్నాయి. ఏంలాభం...! కర్ణుడికి ఏదో అసంతృప్తి! ఏదో వెలితి! ఎంత తిన్నా కడుపు నిండినట్టుండడంలేదు. సంతృప్తనేది లేదు. ఎందుకు ఈ విధంగా ఉంటుందో అతని కర్థం కావడంలేదు. ఇదేమాట దేవేంద్రుణ్ణి అడిగాడు కర్ణుడు.

అప్పుడు దేవేంద్రుడు చిరునవ్వుతో నీవు అనేక దానాలు చేసావని అడిగినవాడికి లేదనకుండా ఇచ్చే దాన కర్ణుడివని చెప్తారు. మరి ఎప్పుడైనా అన్నదానం చేశావా?" అనడిగాడు. దానికి సమాధానం లేదు. నేనెన్నో దానాలు చేశాను గాని అన్నదానంమాత్రం చేయలేదు అన్నాడు కర్ణుడు. పోనీ అన్నం పెట్టే ఇల్లయినా చూపించావా? అని అడిగాడు దేవేంద్రుడు. కాస్త ఆలోచించిన కర్ణుడు చెప్పాడు



'అవును, ఓ బీదవాడు నా దగ్గరకు వచ్చి అన్నం పెట్టించ మని అడిగాడు. అపుడు నేను ఏదో ధ్యాసలో ఉండి, నాకు అవకాశం లేదు గానీ, అక్కడ ఆ ఇంటికి వెళ్ళు అని ఒక ఇంటిని చూపించాను' అని చెప్పాడు.

అన్నదానం చేసే ఇంటిని చూపించిన నీ వేలిని నోట్లో పెట్టుకో అన్నాడు ఇంద్రుడు. సరేనని ఆ వేలిని నోట్లో పెట్టుకున్నాడు కర్ణుడు. ఒక్కగుటక వేశాడు. ఆ క్షణంలోనే అతని కడుపు నిండిపోయింది. అంతవరకున్న అసంతృప్తి మటుమాయమైంది. ఎనలేని తృప్తి కలిగింది. ఈ కథనంద్వారా అన్నదానంయొక్కమాహాత్మ్యం, దాని ప్రాశస్త్యం తెలుస్తోంది.

చాలామంది అన్నదానం చేయడం మనం చూస్తూ ఉంటాం. అయితే అసలు అన్నదానం ఎందుకు చేయాలి? అనే ప్రశ్నకు మనస్సులో మెదలాడే ప్రశ్నలెన్నో ఉంటాయి. అన్నదానం చేయడంలో ఒక పరమార్థంతో పాటు మానసిక సంతృప్తి కలుగుతుంది. ఇది కేవలం ఆహారం అందించడమే కాదు. భౌతికశరీరాన్ని 'అన్నమయకోశం లేదా ఆహార శరీరం' అని పిలుస్తాం, ఎందుకంటే ఇది ఆహారపోష కాలతో కూడి ఉంది.

అన్నదానం చేస్తే వారికి శరీరాన్ని అందిస్తునట్లే! ఆహారంపట్ల కొంత స్పృహనూ, అవగాహననూ, మీలో కలుగ చేయడానికి అన్నదానం మీకొక గొప్ప అవకాశం. మీరు దానిని ఆహారంగామాత్రమే చూడొద్దు, అది జీవితం! మీ ముందు ఆహారం ఉన్న ప్రతిసారీ అది వాడిపడేసే పదార్థంలా కాకుండా అది జీవం అని అర్థం చేసుకోవాలి.

మన జీవితాన్ని ఉన్నతం చేసుకోవాలనుకుంటే మనం తప్పనిసరిగా ఆహారాన్ని, నీటిని, గాలిని, భూమిని ఒక జీవంగా చూడాలి, ఎందుకంటే మన శరీరనిర్మాణానికి ఇవే ముఖ్యమైన పదార్థాలు. మనం వీటిని జీవాధారంగా ఆశ్రయిస్తే అవి మన శరీరనిర్మాణంలో చాలా భిన్నంగా ప్రవర్తిస్తాయి. అలాగాక మనం వాటిని ఒక పదార్థంగా చూస్తే మన వ్యవస్థ దుకాణంలా తయారౌతుంది.

ప్రేమ, అంకిత భావంతో వడ్డించి అన్నదానం చేయడంద్వారా మనకు ఎదుటివారితో ఒక లోతైన సంబంధం ఏర్పడుతుంది. మనం దీన్ని గొప్ప అంకిత భావంతో చేయాలి. ఎందుకంటే దీని ద్వారా ఒకరికి జీవితాన్నిచ్చే అవకాశం మనం పొందుతున్నాం కాబట్టి!!

భోజనం చేసే ముందు మొదటి ముద్దను పరమేశ్వ రార్పణం చేసి, దానిని కాకులకో ఇతరపక్షులకో, ఏ ప్రాణులకో పెడతాము. ఇలా చేయడంవల్ల భగవంతు నికి సమర్పించినట్లు అవుతుంది. ఇక అన్నం తినే ముందు కొద్దిగా అన్నాన్ని కాకులకు వేయడంవల్ల శనిదోషాల నుంచీ బయటపడవచ్చనికూడా చెప్తారు.

ఇలాంటి విషయాలు పాటిస్తుంటే మనకు మన ఇంటిల్లిపాదికీ ఆయురారోగ్యాలకు ఎటువంటి లోటూ ఉండదు. అందరి ఆలోచనలు సన్మార్గంలో నడుస్తాయి. తినే పదార్థాలని వృథాచేయకుండా సద్వినియోగం చేస్తూ ఉంటే ఆ అన్నపూర్ణమ్మ తల్లి నిత్యం మనింట్లో ధాన్యరాశుల్ని కురిపిస్తుంది.

ఆహారాన్ని అలక్ష్యం చేస్తే- భుక్తికోసం వెంపర్లాడక తప్పని పరిస్థితిని చవిచూడవలసివస్తుంది. మనిషి పుట్టే ప్పుడు ఏమి తీసుకురాడు, ఈ మధ్యకాలంలో ఏం సంపా దించినా, ఎంత కూడబెట్టినా పోయేటప్పుడు ఎవరూ ఏమి తీసుకువెళ్ళరు. కేవలం మంచి చెడు కర్మల ఫలితాలు తప్ప!

భగవంతుడిచ్చిన సంపదతో మనిషి బ్రతికి ఉన్నన్ని రోజులు "అహం బ్రహ్మాస్మి" అనే భావనతో తనలో దైవత్వాన్ని అలవరచుకుని తనకు కలిగినంతలో సాటిజీవులకు, ఇతర ప్రాణులకు దానధర్మాలు చేయాలి.

"క్షుద్బాధ" ఆకలి అనేది మనకు ఎలా ఉంటుందో ఎదుటివారిఆకలికూడా అలాంటిదే! అని గ్రహించే స్థాయి 'స్థితి'కి రావాలి. ఆకలిబాధ అనేది అందరికీ ఒకేలాగే ఉంటుంది కనుక మనం....

*సాటివారి ఆకలిని తీరుద్దాం.*
*అన్నాన్ని గౌరవిద్దాం!*
*నలుగురినీ ఆదరిద్దాం!!*
*తృప్తిగా జీవిద్దాం!!!*

# పంగుణ్యుత్తరం

– ఆచార్య చక్రవర్తి రంగనాథన్

అమ్మవారిని సేవించాకనే స్వామివారిని సేవించాలనడం శ్రీవైష్ణవసంప్రదాయం. అమ్మ వారితిరునక్షత్రమహోత్సవం దేశమంతటా కూడా అన్ని శ్రీవైష్ణవదేవాలయాల్లో అంగ రంగ వైభవంగా జరిగే దివ్యసమయమే **'పంగుణ్యుత్తరం'.**

తమిళసంప్రదాయాన్ని అనుసరించి మకరసంక్రమణం అయిన 3వనెల 'తై, మాశి, పంగుణి' అని వ్యవహరింపబడే పంగుణి నెలలో, తెలుగు సంప్రదాయంప్రకారం 'ఫాల్గునమాసం'లో శుక్లపక్షంలో వచ్చే ఉత్తరఫల్గునీ నక్షత్రంలో దివ్యదేవేరి అవతరించినట్లు పురాణోక్తి.

కలియుగంలో అఖిలాండకోటిబ్రహ్మాండనాయకుడైన శ్రీశ్రీనివాసుని అవతారనక్షత్రం శ్రవణంవలే అమ్మవారి నక్షత్రాన్ని **'పంగుణి ఉత్తరఫల్గునీ'** నక్షత్రంగా పరిగణించబడుతుంది. ఈ ఉత్సవం 10రోజులపాటు వైభవంగా



జరుగుతుంది. **'పడితాండాదపత్ని'** గడపదాటని భార్య కనుక అంతటా ప్రాకారంలోపలే ఉయ్యాలసేవ, వాహనోత్సవాలు నిర్వహించబడుతాయి. చివరిరోజు అమ్మవారి తిరునక్షత్రమహోత్సవంనాడు సాక్షాత్తు స్వామివారే అమ్మవారి సన్నిధికి వేంచేసి **'తిరుమంజనం'** (అభిషేకం) **'ఊంజలసేవ'** (ఉయ్యాలసేవ) **'శేర్‌త్తి'** మొదలగునవి పొందుతారు.

భగవద్రామానుజాచార్యులు శ్రీరంగక్షేత్రంలో ఈపంగుణిఉత్తరంనాడే శ్రీరంగనాథుని, శ్రీరంగనాయకీ వైభవాన్ని తిలకించి, గద్యత్రయ్యాన్ని రచించి, వారికి సమర్పించారు. అందుకే **'పంగుణ్యుత్తరం' శ్రీవైష్ణవలోకానికి ఒక పెద్ద పండుగ.**

తిరుపతిక్షేత్రంలో **'చిత్తిరకూడం'** అనబడే చిదంబరం శ్రీగోవిందరాజస్వామివారి దివ్యమహిషిగా వెలుగొందే **శ్రీపుండరీకవల్లి** అమ్మవారికి జరిగే 'పంగుణ్యుత్తర ఉత్సవాల' వైభవాన్ని తెలుసుకోవలసిందే!

శ్రీశ్రీనివాసునికి పద్మావతివలె, శ్రీగోవిందరాజస్వామికి పుండరీకవల్లి అమ్మవారు వేంచేసి ఉన్నారు. **"శాలనాచ్చియార్"** అని ఈ అమ్మవారిని పేర్కొంటారు. తి.తి.దే. పంచాంగంలో కూడా **'శాలనాచ్చియార్ ఉత్సవప్రారంభం'** అని, **'శాలనాచ్చియార్ శాత్తుమొఱ'** అని పేర్కొనబడి ఉంటుంది కానీ, 'పుండరీకవల్లి అమ్మవారి శాత్తుమొఱ' అని ఉండదు. దానికి ఒక కారణం ఉంది. **'శాల'** అనే శబ్దానికి **'గుడి'** అని అర్థం. శ్రీమన్నారాయణునియొక్క దివ్యమహిషి మహాలక్ష్మి అయినా, ఆయా దేవాలయాలలో

వేంచేసి ఉన్న స్వామికి ఒక దివ్యదేవేరి వేంచేసి ఉంటుంది. కనుక **'శాలనాయ్చ్చియార్'** దేవాలయస్వామి పట్టమహిషి అని అర్థం.

ఉత్తరఫల్గునీ నక్షత్రానికి ముందు ఆరురోజులు (అంటే మొత్తం ఇక్కడ 7 రోజులపాటు 'శాలనాచ్చియార్' ఉత్సవాలు నిర్వహింపబడుతాయి.) సాయంకాలం అమ్మ వారిని విశేషంగా పుష్ప, ఆభరణాలతో అలంకరించి, అమ్మవారిసన్నిధినుండి రెండవగోపురంమీదుగా లోపల శ్రీగోవిందరాజస్వామిప్రాకారప్రదక్షిణం గావించి ఉయ్యాల మండపానికి వేంచేపు చేస్తారు. (పూర్వం అమ్మవారి ఆలయం ఎదుటే ఉయ్యాలసేవ జరిగేది, ప్రస్తుతం భక్తుల సౌకర్యార్థం శ్రీగోవిందరాజస్వామికి జరిగే చోట ఈ ఉయ్యాలసేవను నిర్వహిస్తున్నారు.) ఉయ్యాల మండపాన్ని మూడుసార్లుప్రదక్షిణం చేసి, ఉయ్యాలలో ఆసీనురాలైన తర్వాత, ఎదురుగా ఒక పెద్దఅద్దంలో అమ్మవారు తనసౌందర్యాన్ని ఆస్వాదిస్తుండగా, ఇరు ప్రక్కల కైంకర్యపరులు చామరాలు వీస్తుండగా, ఈ ఆనందోత్సవం జరుపబడుతుంది.

పిమ్మట మంగళహారతి అయి, అమ్మవారిని యథాస్థానానికి చేర్చగా, నమ్మాళ్వారుల దివ్యప్రబంధమైన, సామవేదసారభూతమైన **'తిరువాయ్మొళి'** అనే దివ్యప్రబంధాన్ని 2 శతకాలు మొదటిమూడు రోజులలో, తదుపరి క్రమంగా ఒక్కొక్కశతకం మిగతా నాలుగురోజులలో మృదుమధురంగా, శ్రావ్యంగా విన్నవించడం జరుగుతుంది.

చివరిరోజు అంటే అమ్మవారితిరునక్షత్ర మహోత్సవంనాడు (పంగుణ్యుత్తరంనాడు), పుండరీకవల్లి అమ్మ వారిమూలమూర్తికి ఏకాంతంగా తిరుమంజనం అయిన పిదప, లోపలినుండి శ్రీగోవిందరాజస్వామి ప్రాతఃకాల ఆరాధనలఅనంతరం అమ్మవారిఆలయానికి వేంచేపు అవుతారు. (ఆరోజు ఫాల్గునపౌర్ణిమ సంభవిస్తే అభిషేకానికి స్వామి వేంచేయరు.) అమ్మవారితిరుమంజనమండపంలో స్వామివారికి, అమ్మవారికి విశేషస్నపనతిరుమంజనం జరిగి, ప్రతిఒక్కరికికూడా అమ్మవారిపసుపును వినియోగం చేస్తారు.

ఇక సాయంకాలం స్వామివారిని, అమ్మవారిని ఆభరణాలతో, సుగంధభరితపుష్పమాలికలతో అలంకరించి, ఊయలసేవ మండపానికి వేంచేపు చేయగా, లోపలి నుండి ఏకాంగివారు పూలబుట్టను శిరస్సుపై పెట్టుకొని మేళతాళాలతో ఇక్కడికి చేరుకొన్న తర్వాత, ఇరువురికి సమర్పించబడ్డ సుమమాలను పరస్పరం అంటే స్వామి మెడలో నున్న రెండుమాలలను అమ్మవారికి, అమ్మవారికంఠసీమను అలంకరించినమాలను స్వామికి సమర్పణం గావించి, అన్యోన్యత ఉట్టిపడేలా మంగళ వాద్యాల నడుమ, ఈ కల్యాణమహోత్సవ ఘట్టం జరుపబడుతుంది.

తదుపరి ఇరువురిని ఒకే చోట చేర్చి, మంగళహారతిని సమర్పించిన తర్వాత, ఒక వినోదకార్యక్రమం అంటే దివ్యదంపతులు పరస్పరం కలహించుకున్నట్లు, ఆ ప్రణయకలహమహోత్సవం భక్తులకు తెలియజేసే విధంగా అమ్మవారు లోపలికి వేంచేసిన తర్వాత, అమ్మవారు స్వామిదగ్గర కోపగించుకొని, స్వామివారు తన దగ్గరికి వచ్చే సందర్భంలో అమ్మవారిసన్నిధితలుపులను మూసేవిధంగా, ఇలా మూడుసార్లు స్వామి పరిగెత్తుకొని వస్తుండగా, వెంటనే అమ్మవారితలుపులు మూయడం, తెరవడం చేసి, అమ్మవారు శాంతించి, స్వామివారిని రమ్మని పిలిచి, ఏకాసీనంలో స్వామి, అమ్మ వేంచేసి ఉండి, విశేష శాత్తుమొఱలను జరిపించుకొని, అమ్మవారికి తన సమస్త వస్తువులను స్వామి ఆనందంతో సమర్పించే ఈ **'పంగుణ్యుత్తర మహోత్సవం'** సాక్షాత్తు పరమపదంలో ఆ దివ్యదంపతులను దర్శించుకొంటున్న వైనాన్ని తలపించే విధంగా, ఆనందభరితంగా ఉంటుంది.

### ఎడమచేతితో కరోనాను ఓడించవచ్చు

**బయటికి వెళ్లినప్పుడు ఏ పనైన గానీ ఎడమ చేతితో మాత్రమే చేయండి. నోట్లు తీసుకోవడం, లిఫ్ట్ దోరు తెరవడం ఇలా ఏ పనైన ఎడమ చేతితో చేస్తే పొరపాటునైన మనం కుడిచేతితో కళ్లు, ముక్కు, ముఖం, తాకడం లాంటివి చేస్తే వైరస్ సోకే ప్రమాదం చాలా తక్కువ.**



# హరిదాస వాఙ్మయంలో... 8

# శ్రీవేంకటాచలాధీశుడు

- శ్రీ సుస్వరం నాగరాజాచార్యులు

విశ్వమును చూచుటకే సహస్రాక్షుడైన వేంకటేశ్వరుడు ఎత్తైన పర్వతముపై నిలబడి సకల దిక్కులను అక్కడున్న తన భక్తులను చూచి కాపాడుతున్నాడు.

యేశంఖ చక్రోజ్జ్వల బాహుయుగ్మాః ।
స్వాంఘ్రిం భజంతే భవసింధురేషామ్ ।
కటి ప్రామాణస్త్వితి వేంకటేశః ।
స్ఫుటీకరోత్యాత్మకరాంబుజాతైః.

తన బాహుయుగ్మములందు శంఖచక్రములను ధరించిన వాడైన వేంకటేశ్వరుడు ఒకచేతిని తన పాదములను చూపిస్తూ ఎవరైతే నా పాదాలను భజిస్తారో వారిని ఈ భవ సాగరమును దాటిస్తానని, మరొకచేతిని నడుమ దగ్గరుంచుకొని భక్తులకు భవసాగరమును నడుము వరకి తెచ్చి దాటించి వేస్తానని ప్రకటిస్తున్నాడు.

ప్రాయోన్యత్ర గతాం శ్రియం నిజవశాంకర్త్వం ముహుః కాంక్షితం।
భక్తానాం ప్రదిశన్ ధనం ప్రతిదినం సంసాధ్యసాధ్య ప్రియః।
తత్ తత్రైవ పునః సహస్ర గుణితం పశ్యన్ ఘనశ్యామలః।
తేషాం వేశ్మసు విస్మితోనివసతి శ్రీవేంకటేశోనిశమ్ ॥

శ్రీనివాసుడు భక్తులచే ధనమనే కానుకగా పొంది (ద్రవ్యయజ్ఞం చేయించి) వారికి అఖండైశ్వర్యమును ప్రసా దించుచున్నాడు.

ఆరూఢగరుడస్కంద మాలింగితరమాధరమ్ ।
ఆనమజ్జన సర్వస్వ మాశ్రయే వేంకటేశ్వరమ్ ॥

గరుత్మంతుని వీపుపై కూర్చున్న వేంకటేశ్వరుడు రమాలింగితుడై యున్నాడు. ప్రణత జనులకు సర్వస్వమైన ఆతనిని ఆశ్రయించెదను.

కశిపోకృత్యయంశేతేగిరీ కృత్యాధిష్ఠతి ।
అవతీర్ణోను జీకృత్య సతద్భక్తాగ్రణీః ఫణీ ॥

శేషునిపై పవళించిన శ్రీనివాసుడు ఇప్పుడు శేషపర్వ తము పై నిలబడినాడు. రామావతారములో లక్ష్మణుడైన శేషుని సేవను స్వీకరించాడు. కృష్ణావతారములో శేషుడైన బలరాముని గౌరవపాత్రుడైనాడు. కావున శ్రీనివాసుని భక్తాగ్రేసరులలో శేషుడు ఒకడైనాడు.

శంకర రవిశశి ముఖ్యాః కింకర పదవీ ముపాశ్రితా యస్య।
వేంకటగిరి నాథోఽసౌ పంకజనయన పరాత్పరో జయతి ॥

శివుడు సూర్యుడు చంద్రుడు ఈ మొదలైన వారు శ్రీనివాసుని భృత్యులైయున్నారు. పుండరీకాక్షుడైన ఈతడు సకల వస్తువులకన్నను అతీతుడు.

శ్రీవేంకటగిరిద్రోణీ క్షోణీయస్యానణీయసీ
తంవరణ్యం సురాగ్రణ్యం వేదగమ్యం భజామహే ॥

ఉన్నతోన్నతమైన వేంకటపర్వతపు ఎత్తైన ప్రదేశంలో శ్రేష్ఠుడై, సకల దేవతానాయకుడై వేదవేద్యుడైయున్న శ్రీవేంకటేశ్వరుని సేవించెదను.

శ్రీవేంకటపతే దీనగతే రమ్యాకృతేక్షితౌ ।
సమః సమస్త మర్త్యార్తి ప్రమర్దన కిమస్తి తే ॥

దీనులకు దేవుడైన, మనోహరుడవైన, సమస్త జనుల సంకటములను పారద్రోలే శ్రీవేంకటపతే నీకు సరిసమాన మెవరు?

సమస్త సుజనాధారం దోషదూరం గుణాకరం
శ్రీవేంకటాచలావాసం శ్రీనివాసం భజేఽనిశం ॥

సకల సజ్జనులకు ఆధారభూతుడును, దోషదూరుడును, గుణపూర్ణుడును, శ్రీవేంకటగిరి నిలయుడును అయిన శ్రీనివాసుని సదా భజించెదను. (ఇంకా ఉంది)

# హరహరమహాదేవ
## (శ్రీఅప్పయ్య దీక్షితులవారి జీవితచరిత్ర)

రచన-డా॥ జి.వి.పూర్ణచందు, సైజు-1/8డెమ్మీ, పుటలు-240, ధర-రూ.153/-, (పోస్టల్ ఖర్చు రూ.50/- అదనం) ప్రతులకు- ఎస్.ఆర్.పబ్లికేషన్స్, డి.ఆర్.ఆర్. స్ట్రీట్, ఇన్నర్ రింగ్ రోడ్డు (అంబాపురం), విజయవాడ రూరల్- 520 012, ఆంధ్రప్రదేశ్, ఫోన్‌నెంబర్లు: 0866-2436959, 9494875959

శివాద్వైతసిద్ధాంతాన్ని ప్రతిపాదించిన శివ యోగి శ్రీఅప్పయదీక్షితులు. ఈ తెలుగింటి బిడ్డను, తమిళులు సాక్షాత్ శివుడిగా పూజిస్తారు. 400కు పైగా అద్వైతగ్రంథాలను రాసి, ప్రజల్ని శాంతిమార్గం లోకి మళ్లించిన కారణజన్ములు శ్రీఅప్పయ్యదీక్షితులు. ఒకేశ్లోకంలో హరిహరస్తుతి చేసిన మహాకవి.

రాయలవారి అనంతరం కల్లోల స్థితిలో పడ్డ విజయనగరపాలకులకు మార్గదర్శనం చేసి, ప్రజలలో ఐకమత్యాన్ని సాధించి శాంతిని నెలకొల్పటం దీక్షితులవారు సామాజికంగా, మతపరంగా సాధించిన ఘనవిజయాలు.




దీక్షితులవారి 500వ జన్మదిన మహోత్సవాలను పురస్కరించుకుని, శతాధిక గ్రంథకర్త, తెలుగుభాషాసంస్కృతుల మూలాలను వెలికి తీస్తున్న పరిశోధకుడు గౌ॥ జి.వి.పూర్ణచందు తెలుగు పాఠక లోకానికి అందించిన కానుక ఈ గ్రంథం. తెలుగువారి వెలుగులను పునఃప్రసారం చేస్తూ, విలువల పతనాన్ని నిలువరించే ప్రయత్నమే ఈ రచన.

శ్రీరంగం, కుంభకోణం, తిల్లై, చిదంబరం ఇంకా అనేక చారిత్రక క్షేత్రాలు సందర్శించి శ్రీదీక్షితుల వారికి సంబంధించిన అనేక అంశాలను పరిశోధించి, అధ్యయనం చేసి సేకరించిన అంశాలను సంకలించిన గ్రంథమిది.

'మార్గబంధుస్తోత్రం' ఆశువుగా చెప్పబడ్డ దైవం మార్గసహాయేశ్వరుణ్ణి ప్రార్థిస్తూ, అప్పయ్య దీక్షితులవారి కథాగమనాన్ని కొనసాగిస్తారు డా॥పూర్ణ చందు. తాత, ఆచార్యదీక్షితుల వారితో కథ మొదలౌ తుంది. వీరు చేసిన ఎనిమిది సర్వతోముఖయాగం, మహావ్రతయాగం, సామాన్యులు చేయగలిగేవి కావు. రాజుతో సమానమైన సంపద, పాండితీగరిమ కలిగిన ఆచార్యదీక్షితుల ప్రస్తావనతో హరహరమహాదేవ కథాప్రస్థానం మొదలౌతుంది. ఎనిమిదిమంది విజయ నగరప్రభువులతో సఖ్యత కలవాడిగా నీలకంఠదీక్షితులు తమ 'నలచరిత్ర' గ్రంథ పీఠికలో పేర్కొన్నారు.

విశ్వజితయాగం చేసి సర్వస్వాన్ని దక్షిణగా దానంచేసిన వాణ్ణి 'సర్వవేద' అని పిలుస్తారు. అలాంటి రంగరాజదీక్షితులు శ్రీఅప్పయదీక్షితుల వారి తండ్రి.

వేపచెట్టును పోలిన 'తిల్ల' చెట్లు ఎక్కువగా ఉండిన నగరం చిదంబరం. సాక్షాత్తు చిదంబరుడే తిల్లై దీక్షితులు అనే యోగిరూపంలో వచ్చి, రంగరాజదీక్షితు లకు పుత్రసంతానప్రాప్తిని కలిగించాడనీ, అలా తిల్లై నటరాజస్వామి, అప్పయ్య దీక్షితుల నామంతో అవతరించాడని చెబుతారు. వనవాసంలో ఉన్న శ్రీరాముడికి ఆతిథ్య మిచ్చిన భారద్వాజమహర్షి గోత్రికులు వీరు.

రంగరాజదీక్షితులు, శివపుత్రుడనే అర్థంలో 'వినాయక సుబ్రహ్మణ్యశర్మ' అని పేరు పెట్టి ముద్దుగా 'అప్పా'(తండ్రి) అని పిలుచుకోవడంతో అది అప్పయ్యగా దానికి 'దీక్షిత'నామం చేర్చబడి అప్పయ్యదీక్షితులనే పేరు స్థిరపడింది.

ఇలా ఎన్నో విశేషాలతో పాటు అప్పయ్య దీక్షితులవారి కొన్ని రచనలు, వ్యాకరణ గ్రంథాలను పరిచయం చేస్తూ డా॥ జి.వి.పూర్ణచందు ఫలశ్రుతిగా చతుర్మతసారాన్ని ప్రపంచానికి సర్వమత సామరస్యాన్ని ప్రబోధించిన శ్రీఅప్పయ్యదీక్షితులజీవితం, ప్రపంచ శాంతికాముకులకు మార్గదర్శకం అంటారు. గ్రంథం చివరలో కొన్ని స్తోత్రరత్నాల నివ్వటం పాఠకులకొక చిరుకానుక.

– శ్రీ ఆకుల మల్లేశ్వరరావు

ఆయుర్వేదం

# ఈ విటమిన్ ఉండేలా చూసుకోం'డి'

– డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ

మన ఆరోగ్యకారకుడు సూర్యభగవానుడు. ఆ సూర్యభగవానుడి కిరణాల ప్రభావంతో మనలో నిద్రాణమై ఉన్న చైతన్య ప్రాణశక్తి ప్రేరణ, శక్తి పుంజుకుని శారీరక మానసిక శక్తి సామర్థ్యాలతో దైనందిన కార్యక్రమాలు సజావుగా నిర్వర్తించుకునేందుకు దోహదపడుతుంది. అనాదిగా మన వాళ్ళందరూ సూర్యోపాసకులు. ప్రాతః కాలంలో నిద్రలేచి నమస్కారం చేసినంతనే అనుగ్రహం, ఆశీర్వాదం, ఆరోగ్య యోగక్షేమములు ప్రసాదించే కరుణా మూర్తి నమస్కార ప్రియుడైన భానుడు (నమస్కార ప్రియో భానుః) సేవించటం, సంధ్యావందనం చేయటం వెనక ఆరోగ్య వైజ్ఞానిక రహస్యా లెన్నో... ఎన్నెన్నో- సంధ్యా వందనం చేయని పామరులు సైతం ప్రాతఃస్నానం పిమ్మట ప్రత్యక్ష దైవమైన సూర్యభగవానుడికి నమస్కరిస్తూ ధర్మ నిర్వహణలో శక్తిసామర్థ్యం నిచ్చుటకై ప్రార్థించి తమ తమ విధులలో నిమగ్నం కావటం మన వారి సంప్రదాయంలో ఒక భాగమే.

సూర్యకాంతి వల్ల వచ్చే సూర్యకిరణాల ప్రభావం అనంతమైనది, అనూహ్యమైనది. వాటిలోని అల్ట్రావయొలెట్ కిరణాల వల్ల శరీరంలోని కొలెస్టరాల్ సాయంతో విటమిన్ 'డి' వుత్పత్తి అవుతుంది.

తగినంత డి–విటమిన్ మన శరీరంలో లేకపోతే వివిధ రకాల అనారోగ్యాలు మనల్ని వేధిస్తాయి. వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోతుంది. చీటికి, మాటికి శరీరం వ్యాధుల బారిన పడుతుంది. కీళ్ల నొప్పులు, కండరాల నొప్పులు, నీరసం, నిస్త్రాణత, విపరీత అలసట, అగ్నిమాంద్యం, నిద్ర లేమి, సంతానరాహిత్యం చోటు చేసుకుంటాయి. ఎముకలకు సంబంధించిన వ్యాధులు, చర్మవ్యాధులు, రక్తపోటు, మధు మేహం, అధికబరువులాంటి సమస్యలకు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఈ విటమిన్–డి కారణ భూతమవుతుంది. స్వేద గ్రంథులు సరిగా పనిచేయకపోవటంతో పాటు, జీర్ణ శక్తి లోపాలు కలుగుతాయి. జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, నేత్ర దృష్టిపై కూడా ఈ ప్రభావం పడుతుంది. వృద్ధాప్య సమస్యలు అతిత్వరగా మనలో ప్రవేశిస్తాయి. చర్మసౌందర్యం, కేశసౌందర్యం దెబ్బతింటుంది.

అందుకే మనకు సూర్యకాంతి అత్యవసరం. వీట న్నింటిని దృష్టిలో ఉంచుకునే మన పెద్దలు కొన్ని ఆచారాలు, సంప్రదాయాలు ఏర్పాటు చేశారు. వాటి వెనుక ఎన్నో వైజ్ఞానిక ఆరోగ్యరహస్యాలు ఇమిడి ఉన్నాయన్నది కొన్ని నిదర్శనాలు, ఉదాహరణల ద్వారా ప్రస్ఫుటంగా తేటతెల్ల మవుతుంది.

పసిపిల్లలకు నువ్వుల నూనె రాసి ఉదయం పూట లేలేత భానుడి కిరణాలు ప్రసరించేలా కొద్దిసేపు ఆరు

### వైకుంఠపాళి
### :: 62 – సమాధానాలు ::

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 అ | | | 2 వి | 3 న | త | | | 4 అ |
| రుం | | | | ర్మ | | | | నూ |
| 5 ధ | నం | | 6 ఉ | ద | రం | | 7 చా | రు |
| తి | | 8 అ | | | | 9 వ | | డు |
| | 10 రా | జు | | | | 11 పు | బ్బ | |
| 12 శు | | డు | | | | ష్ట | | 13 నా |
| 14 నా | కం | | 15 శ్ర | 16 వ | ణం | | 17 లో | భి |
| రే | | | | సు | | | | జు |
| వి | | | 18 అ | ధ | రం | | | డు |

బయట పడుకోబెడతారు. తద్వారా వారికి పుష్కలంగా విటమిన్-డి అంది ఆరోగ్యంగా హుషారుగా ఎదుగుతారు.

మనకు వేసవి కాలం ఆరంభంలో ఉదయము నుంచి సాయంత్రం వరకు గాలి పటాలు ఎగుర వేసే సంప్రదాయం కూడా ఉంది. ఆ సమయంలోనే నువ్వులు, బెల్లం కలిపిన తీపి పదార్థాన్ని కూడా పిల్లలచే తినిపిస్తారు. తద్వారా వేడి చేయ కుండా ఉండటమేకాక నువ్వుల్లోని సహజక్రొవ్వులు, కాల్షియం శరీరానికి అంది కాల్షియం లోపం రాకుండా ఉండటంతో పాటు విటమిన్-డి కూడా పుష్కలంగా అంది చాలారోజులు అది శరీరంలో నిల్వ ఉంటుంది.

ఇలా వివిధ సందర్భాల్లో వివిధరకాలుగా వివిధ కార్య క్రమాల్లో సూర్యశక్తి ప్రభావాన్ని, దానిని మనం సద్వినియోగం చేసుకోవాల్సిన ఆవశ్యకతను, దాని వల్ల కలిగే ప్రయోజనాలను మన మహర్షులు తెలియజేశారు.

ప్రస్తుత నాగరిక సమాజంలో అవగాహనా లోపంతో అసంఖ్యాక ఉద్యోగస్థులు, విద్యార్థులు, వ్యాపారస్థులు, సాఫ్ట్ వేర్ ఇంజనీర్లు...... ఇలా ఎందరెందరో ఎండకు సూర్య కాంతికి, సూర్యరశ్మికి దూరమవుతూ వివిధరకాల అనారోగ్యా లకు గురయ్యే పరిస్థితి కలుగజేసుకుంటున్నారు. దీనికి తోడు లోకాన్ని, విశ్వాన్ని గడగడలాడించిన కరోనా మహమ్మారి ప్రభావం వల్ల కోట్లాది మంది ఈ విటమిన్-డి కి దూరమయ్యా రనటంలో ఆశ్చర్యం లేదు, అతిశయోక్తి కాదు.

ఏది ఏమైనప్పటికి సమస్తవిశ్వాన్ని, సకలజీవజాతు లను చైతన్యవంతం చేసే అనుహ్యామైన, అనంతమహత్తర శక్తివంతుడు మన ఆరోగ్య, ఆయుర్వర్ధకకారకుడు, ప్రేరకుడు అయిన సూర్యభగవానుడి కరుణాకటాక్షవీక్షణాలు సదా మనపై ఉండాలని ప్రార్థిస్తూ....

## సుప్రసిద్ధ పద్యం

**సిరికిం జెప్పఁడు శంఖచక్రయుగముం జేదోయి సంధింపఁ డే**
**పరివారంబును జీరఁ, డభ్రగపతిం బన్నింపఁ, డాకర్ణికాం**
**తరధమ్మిల్లముఁ జక్క నొత్తఁడు, వివాదప్రోత్థితశ్రీకుచో**
**పరిచేలాంచలమైన వీడఁడు గజప్రాణావనోత్సాహి యై.**

శ్రీమన్నారాయణుడు స్థితికారుడు. స్థితి శిష్ట రక్షణలో ఉంది. అందుకే ఆ మహాప్రభువు అంతగా సంరంభించినాడు. అర్థాంగితో నైనా ఆ మాట చెప్ప లేదు. పోనీ... సమరసామగ్రినైన సమకూర్చుకోలేదు. గబుక్కున వెళ్ళాలంటే గరుడవాహనం అవసరం కదా! అదీ అవసరం అనిపించలేదు ఆ ఆపన్న ప్రసన్నునికి. ఇంతకూ సాధురక్షణకు సాధనాలతో నిమిత్త మేమి? భక్తపోషణకు పరివారంతో అవసరమే ముంది? నిజమే. ఆ విశ్వపతికి ఇవేవీ అక్కరలేదు. నిస్సహాయుడుగా నిరాయుధుడుగా దుష్టసంహారం చేయగలుగుతాడు.

కాని, ఉన్న చిక్కంతా అతని చేతిలోనే ఉంది- ఆ చేతికి చిక్కు వడిన చేలాంచలంలో ఉంది. తనకు చెప్పకుండా ఆయన వెళ్ళిపోయినా ఆ యమ్మ కాదన లేదు. కానీ, ఆయన చేతిలో ఉన్న తన చేలంచెరగు మాటేమిటి? "ఇదేమిటీ" అని అడిగితే వినే స్థితిలో ఉన్నాడా ఆ వెర్రి నాయన, మరి అడగ కుండా తానెలా ఉండగలుగుతుందంటారు?...

**- జ్ఞానపీఠఅవార్డు గ్రహీత, పద్మభూషణ్**
**డా॥ సి. నారాయణ రెడ్డి**

# సంస్కృతం నేర్చుకుందాం..!!

పాఠం-05

రచన- మహామహోపాధ్యాయ కాశీ కృష్ణాచార్య

నిర్వహణ- మహామహోపాధ్యాయ సముద్రాల లక్ష్మణయ్య

| | | | | | |
|---|---|---|---|---|---|
| एक: = | ఒకడు | प्रात: = | ప్రొద్దున | अस्तु = | ఉండనీ, కానిమ్ము |
| अनेके = | చాలామంది | सायम् = | సందెవేళ | एधि = | ఉండుము |
| कति = | ఎన్ని, ఎందరు | नक्तम् = | రాత్రి | असानि = | నేనుండనిమ్ము |

### అ) ఈ క్రింది వాటికి తెలుగులోకి అనువాదం చేయండి?

01) तत्र कति सन्ति?

02) एक: अद्य प्रात: तत्रासीत्।

03) स: तत्रास्तु।

04) त्वम् अद्य सायम् अत्र एधि।

05) सायं तत्र अनेके आसन्।

06) अहं तत्र असानि।

07) ते सर्वे नक्तं तत्र न सन्ति।

08) यूयं अद्य नक्तं कुत्रास्त?

09) वयं सर्वे अत्रास्म।

10) कति अत्रासन्?

### అ) జవాబులు

01) అక్కడ ఎన్ని ఉన్నాయి? (ఎందరు ఉన్నారు?)

02) ఒకడు ఈరోజు ప్రొద్దున అక్కడనుండెను.

03) వాడు అక్కడ ఉండనీ.

04) నీవు ఈరోజు సందెవేళ ఇక్కడ ఉండుము.

05) సందెవేళ అక్కడ చాలామంది ఉండిరి.

06) నేను అక్కడ ఉండనిమ్ము.

07) వాళ్ళందరు రాత్రి అక్కడ లేరు.

08) మీరు ఈరోజు రాత్రి ఎక్కడనుంటిరి?

09) మేమందరము ఇక్కడనుంటిమి.

10) ఎందరు ఇక్కడనుండిరి?

### ఆ) ఈ క్రింది వాటికి సంస్కృతంలోకి అనువాదం చేయండి?

01) నీవీవేళ రాత్రి అక్కడనుండు.

02) ఈవేళ ప్రొద్దున అక్కడనెందఱుండిరి?

03) అక్కడనొకడుండెను.

04) మీరక్కడనుంటిరా?

05) మేమిక్కడ లేము.

06) చాలామంది అపుడక్కడనుండిరి.

07) నేనిక్కడనుండనిమ్ము.

08) వాడిపుడెక్కడనున్నాడు?

09) వాడిక్కడ లేడు.

10) నీవెపుడుంటివి?

### అ) జవాబులు

01) त्वम् अद्य नक्तं तत्र एधि।

02) अद्य प्रात: तत्र कति आसन्?

03) तत्र एक: आसीत्।

04) यूयं तत्र आस्त किं?

05) वयं अत्र नास्म।

06) अनेके तदा तत्र आसन्।


07) अहम् अत्र असानि।

08) स: इदानीं कुत्रास्ति?

09) स: अत्र नास्ति।

10) त्वं कदा आसी:?

విశ్వదాభిరామం వేమన పద్యసూక్తి



## అవివేకం - ఆపద

తామసించి చేయదగ దెట్టికార్యంబు;
వేగిరింప నదియు విషమ మగును;
పచ్చికాయ దెచ్చి పడవేయ ఫల మౌనె?
విశ్వదాభిరామ! వినుర వేమ!

**అర్థాలు:** తామసించి= మూఢత్వంతో; కార్యము= పని; వేగిరింప= తొందరపడితే; విషమమగును= చెడిపోతుంది; ఫలమౌనె= పండవుతుందా?


**భావం:** ఆలోచించకుండా, మూర్ఖంగా ఏపనీ చేయగూడదు. తొందరపడితే అయ్యేపని కూడా చెడిపోతుంది. పచ్చికాయను మగ్గవేస్తే మాగదు కదా!

**వివరణ:** రాబోయే పరిణామాలను గురించి ఆలోచించి, మంచిఫలితం వస్తుందని నిర్ణయించుకున్న పిదపనే ఏపనినైనా, చేయాలి. అలా కాకుండా, తొందరపడి చేస్తే, ఆశించినఫలితం రాదు. ఇంక పైగా వ్యతిరేకమైన ఫలితం కూడ వస్తుంది. పండడానికి యోగ్యమైన స్థితికి వచ్చినపుడే కాయలను మగ్గవేయాలి.

అంతే కాని, పక్వానికి రానిపచ్చికాయల్ని మాగవేస్తే అవి పండుగా మారవు. సరి కదా, ఆకాయ కూడ పాడయి పోతుంది. 'సహసా విదధీత న క్రియా మవివేక పర మాపదాం పదమ్' అన్నాడు భారవి.

- విద్వాన్ కట్టా నరసింహులు

## 62 వైకుంఠపాళి



**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు

### అడ్డం

2)గరుత్మంతుని తల్లి(3); 5)ఇదిమూల మిదంజగత్(2); 6)పొట్ట(3); 7)రసమే(2); 10)రాణిభర్త(2); 11)పూర్వఫల్గుణి నక్షత్రాన్నిలా కూడా అంటాం(3); 14)స్వర్గం(2); 15)శ్రీవేంకటేశ్వరుని జన్మనక్షత్రం(3); 17)లోభత్వం కల్గినవాడు(2); 18)క్రిందపెదవి(3)

### నిలువు

1)వశిష్ఠుని భార్య(4); 3)తూర్పుదిక్కున పుట్టి పడమటి సముద్రంలో కలసిన నది(3); 4)సూర్యుని రథసారథి(4); 8)దశరథుని తండ్రి(3); 9)జనమేజయుని భార్య(3); 12)వరుణుని భార్య(4); 13)నాభినుండి పుట్టినవాడు(4); 16)వసువులు కల్గిన భూమి(3)

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.

- ప్రధాన సంపాదకుడు



చక్కటి కుటుంబం, మంచిమిత్రులు నిజమైన సంపదలు





# మంచిమిత్రుడు

– ఆచార్య పి.ఎల్.శ్రీనివాస రెడ్డి,
94414 93777

తే॥ **అఘము వలన మరల్చు, హితార్థకలితు
జేయు, గోప్యంబు దాచు, పోషించు గుణము
విడువ దాపన్ను, లేవడి వేళనిచ్చు
మిత్రుడీ లక్షణంబుల మెలగుచుండు.**

మిత్రుడు పాపపు పనుల నుంచి వైదొలగేటట్లు చేస్తాడు. మంచిపనులు చేసేటట్లు చేస్తాడు. దాచాల్సిన విషయాల్ని చాలా జాగ్రత్తగా దాచిపెడతాడు, లేశమంత సుగుణమున్నా దాన్ని భూతద్దంలో పెట్టి లోకానికి చూపెడ తాడు. ఆపదల్లో చిక్కుకొని అల్లాడుతున్నప్పుడు ససేమిరా వదిలిపెట్టడు, దారిద్ర్యం దాపురించినప్పుడు, దావానలంలా తరుముతున్నప్పుడు తన శక్తివంచనలేకుండా ఇచ్చి ఆదు కుంటాడు.

నీవు పాపపు పనులు చేస్తూ ఉంటే నీ మిత్రుడు చూస్తూ ఊరుకోడు. ఆ దృశ్యానికి అతని మనసు విలవిల లాడిపోతుంది. ఆ పనుల నుంచి నిన్ను దూరం చేయడా నికి ఉద్యుక్తుడౌతాడు. ఇంకా లోకానికి హితమైన పనులు నీచేత చేయించే ప్రయత్నం చేస్తాడు. నీలోని సద్గుణాలను దీర్ఘీకరిస్తాడు. అవగుణాలను హ్రస్వీకరిస్తాడు. అంతేకాదు



కప్పిపుచ్చుతాడు. నీలోని లోపాలు; నీ కష్టనిష్ఠురాల్లో పాలు పంచు కుంటాడు. అతడు నీ కన్ను, నీ వెన్నుదన్ను. నీవు కష్టాలకడలిని ఈదుతున్నప్పుడు తనకూ కష్టాలున్నాయని చెప్పి తప్పుకోడు. నీకు ఆర్థికమైన అవసరాలున్నప్పుడు నీవు అడక్కుండానే అతను సాయం చేస్తాడు. ఈ అర్థాన్నే చెబుతుంది. A friend in need is a friend indeed అనే ఆంగ్లవాక్యం.

ఈ అన్ని లక్షణాలుంటే అతను మంచిమిత్రుడు. ఇందులో ఏ కొన్ని లక్షణాలు లేకపోయినా అతను అమిత్రుడు. వీటికి భిన్నమైన లక్షణాలుంటే అతను కుమిత్రుడు. ఈ కుమిత్రుడు నీవు పాపాలు లేదా తప్పులు చేస్తూవుంటే సంతోషిస్తాడు. తప్పుల నుంచి మరల్చక పోగా చెడ్డపనులే చేసేటట్టు చేస్తాడు; నీవు దుర్మార్గాలు చేయడానికి దోహదం చేస్తాడు. నీలో దాచాల్సిన చిన్నచిన్న అవలక్షణాలను బట్ట బయలు చేస్తాడు. సుగుణాలన్నిటినీ అవగుణాలుగా ఆవిష్కరిస్తాడు. నీకున్న కష్టాల్ని కడతేర్చడమలావుంచి ఉధృతం చేయడానికి ఉవ్వి ళ్లూరుతాడు. కాదంటే మెల్లగా అక్కడి నుంచి జారుకుంటాడు. నిన్ను దారిద్ర్యం దహిస్తున్నప్పుడు ఆర్థికంగా కుంగదీసే కార్యక్రమాలు క్రమంగా ఎక్కువ చేస్తాడు; చేయిస్తాడు. అప్పుడతను నీకు మిత్రుడు కాదు. శత్రువే. మిత్రునిరూపంలో ఉన్న శత్రువు. ఇతణ్ణి అంతశ్శత్రువు అనవచ్చు. శత్రువు మనకు శత్రువన్న విషయం స్పష్టంగా తెలుస్తుంది. కాబట్టి అతని నుంచి దూరంగా, జాగ్రత్తగా వుండవచ్చు. ఇతనలా కాదే! ఇతను పక్కలో బల్లెం. చాపకిందనీరు. ఇతను శత్రువు కన్నా అపాయకారి. అందుకే– *'బాహ్యశత్రుల పరిహరింపంగవచ్చు / అంతరారుల నిర్జింప నలవికాదు'*– అని శ్రీనాథుడు అరిషడ్వర్గాన్ని ఉద్దేశించి చెప్పిన మాట ఈ శత్రువు కాని శత్రువు అయిన మిత్రునికి వర్తిస్తుంది.


మంచి స్నేహితుడు కల్పవృక్షకామధేనువుల కన్నా మిన్న. అవి అడిగితే ఇస్తాయి. ఇతను అడక్కుండా ఇస్తాడు కాబట్టి, మంచి మిత్రుడు మణి మాత్రమే కాదు, ద్యుమణి కూడా! ద్యుమణి అంటే సూర్యుడు. మిత్రుడు అనే పదానికి సూర్యుడని కూడా అర్థం. సూర్యుడు జగత్తుకు మిత్రుడు కదా!

**నీతి**


**మంచిమిత్రుడు కల్పవృక్ష, కామధేనువుల కన్నా మిన్న.**

# చిత్ర కథ కిరాతార్జునీయం


కథ–డా॥ కంపల్లె రవిచంద్రన్
చిత్రాలు–తుంబలి శివాజీ







ఎవరు నువ్వు? ఈ నిర్జనవనంలో స్త్రీని వెంటబెట్టుకుని ఎందుకు తిరుగుతున్నావు? ఈ రాక్షసుణ్ణి నేను కొడుతుంటే నాతో సమానంగా నువు కూడా ఎందుకు బాణాలు వేసావు? ఇది వేటగాడి ధర్మం కాదు.
నిర్జనవనంలో నువ్వు ఎందుకు కూర్చున్నావు? నువు చూడబోతే నాగరికుడుగానూ సుకుమారంగానూ ఉన్నావు. ఈ పంది మాటంటావా... దాన్ని ముందు కొట్టినవాణ్ణి నేను. నేను కొట్టిన పందినే నువ్వు కొట్టావు. బలమున్నది కదా అనే పొగరుతో నన్ను తప్పుపట్టుతున్నావు. అంత బలవంతుడవు అయితే నాతో యుద్ధానికి రా...
అయితే కాచుకో...
ఇవేం బాణాలు... ఇంతకన్నా మంచి బాణాలు లేవా? ఇంతకన్నా బాగా యుద్ధం చేయలేవా?
అమోఘమైన నా అస్త్రాలనే లెక్కపెట్టని ఈ కిరాతుడు మామూలు మనిషికాడు. మాయావేషంలోఉన్న మహనీయుడెవరో అయి ఉంటాడు.
అగ్నిదేవుడు ప్రసాదించిన అక్షయతూణీరాలు ఖాళీ అయిపోయాయి. గాండీవం మాయమైపోయింది. అర్జునుడిప్పుడు నిరాయుధుడు.
3




అర్జునుడు కిరాతుడిపై కలియబడి, పిడికిళ్ళతో కొట్టసాగాడు.కిరాతుడు కూడా అర్జునుణ్ణి పిడికిళ్ళతో పొడిచాడు. కిరాతుడి దెబ్బలకు అర్జునుడికి స్పృహ తప్పింది.
అర్జునుడు స్పృహ తెలిసి లేస్తూనే స్నానం చేసి, మట్టితో చేసిన శివలింగం మీద పూలగుత్తి ఉంచి కొంచెం సేపు ధ్యానించి, లేచి కిరాతుడికేసి చూసేసరికి లింగం మీద తానుంచిన పూలగుత్తి కిరాతుడి నెత్తిన కనబడింది.
తండ్రీ! నన్ను అనుగ్రహించదానికి ఈ రూపంలో వచ్చావా? ధన్యోస్మి.
అర్జునా! నీవంటి శూరుదు మూడులోకాలలోనూ మరి లేడు. నీ భక్తికి మెచ్చాను. నా దివ్యాస్త్రాన్ని నీకిస్తాను. దాని మహిమతో నువ్వు శత్రువులను జయిస్తావు.
ధన్యుడనైతిని దేవదేవా! దీనులను రక్షించు దివ్యస్వరూపుడవైన నిన్ను దర్శించిన నాభాగ్యమే భాగ్యము. ఫలించె నా తపస్సు. ఫలించె నా పూజ.
శుభమస్తు అర్జునా!
4
వచ్చే సంచికలో మరో దివ్యలీలా విలాసంతో మీ ముందుకు....
స్వస్తి!



# క్విజ్

1) తిరుమలేశుని దర్శనానికి ముందు ఏ దేవుణ్ణి దర్శించాలి?

అ) వాసుదేవుడు ఆ) వామనుడు

ఇ) వరాహస్వామి ఈ) వేంకటేశ్వరస్వామి

2) సతీసావిత్రి భర్త?

అ) సత్యవ్రతుడు ఆ) సత్యవంతుడు

ఇ) సత్యకీర్తి ఈ) సత్యమూర్తి

3) శకుంతల పెంపుడు తండ్రి?

అ) కణ్వమహర్షి ఆ) మృకండమహర్షి

ఇ) భృగుమహర్షి ఈ) అత్రిమహర్షి

4) మహాభారతంలో పర్వాలు ఎన్ని?

అ) పదకొండు ఆ) పన్నెండు

ఇ) పద్దెనిమిది ఈ) ఇరవైఎనిమిది

5) శ్రీపద్మావతీఅమ్మవారు వెలసిన క్షేత్రం?

అ) శ్రీనివాసమంగాపురం ఆ) అలమేలుమంగాపురం

ఇ) నారాయణవనం ఈ) నాగులాపురం

6) ఆంధ్రభోజుడు ఎవరు?

అ) మహాకవి కాళిదాసు ఆ) శ్రీకృష్ణదేవరాయలు

ఇ) భోజరాజు ఈ) త్యాగరాజు

7) శ్రీవారి 'ముత్యాలహారతి' ఎవరు ప్రారంభించారు?

అ) అన్నమయ్య ఆ) పెదతిరుమలయ్య


ఇ) తాళ్లపాక తిమ్మక్క ఈ) తరిగొండవెంగమాంబ

**జవాబులు**

1) ఇ 2) ఆ 3) అ 4) ఇ
5) ఆ 6) ఆ 7) ఈ

# చిత్రలేఖనం

ఈ క్రింది బొమ్మకు రంగులు వేద్దామా...



ఈ పక్కన ఉన్న బొమ్మను క్రింది గడులలో గీయండి...



Edited and published on behalf of T.T.Devasthanams by Prof. K.Rajagopalan, Ph.D., Chief Editor, T.T.D. and printed at T.T.D. Press by Sri P.Ramaraju, M.A., Special Officer (Publications & Press), T.T.D. Press, Tirupati - 517507.

తిరుమల తిరుపతి దేవస్థానములు

# ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాలు

2021 ఏప్రిల్ 21 నుండి 29 వరకు



**21-04-2021 బుధవారం**
పగలు: ధ్వజారోహణం
రాత్రి: శేషవాహనం

**22-04-2021 గురువారం**
పగలు: వేణుగానాలంకారం
రాత్రి: హంసవాహనం

**23-04-2021 శుక్రవారం**
పగలు: వటపత్రశాయి అలంకారం
రాత్రి: సింహవాహనం

**24-04-2021 శనివారం**
పగలు: నవనీత కృష్ణాలంకారం
రాత్రి: హనుమత్సేవ

**25-04-2021 ఆదివారం**
పగలు: మోహినీసేవ
రాత్రి: గరుడసేవ

**26-04-2021 సోమవారం**
పగలు: శివధనుర్బాణాలంకారం
రాత్రి: ఎదుర్కోలు, కల్యాణోత్సవం, గజవాహనం

**27-04-2021 మంగళవారం**
పగలు: రథోత్సవం

**28-04-2021 బుధవారం**
పగలు: కాళీయమర్దనాలంకారం
రాత్రి: అశ్వవాహనం

**29-04-2021 గురువారం**
పగలు: చక్రతీర్థం
రాత్రి: ధ్వజావరోహణం

తిరుపతి

# శ్రీ కపిలేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు

2021 మార్చి 04 నుండి 13 వరకు

